

నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



మరింత దిగజారిన లింగ అంతరం : జిడిపికి అపారనష్టం!

ఇరాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండదు త్వరలో లక్ష్యాలు సాధిస్తాం : నేతన్యాహూ

సిరియా చర్చ్‌లో ఇస్లామిక్ జీహదీ ఆత్మాహుతి దాడి : 22 మంది మృతి

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 204 | మంగళవారం | 24 -06-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## రాష్ట్రంలో ఉపాధి హామీ
# జోరందుకుంది

కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో 4.58 కోట్ల పనిదినాలు పూర్తి

గతం మాదిరిగా 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని కేంద్రప్రభుత్వానికి మంత్రి సీతక్క లేఖ

ఈ ఏడాది ఇప్పటివరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మందికి పని

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో ఇప్పటికే 4.53 కోట్ల పనిదినాలను రాష్ట్రం పూర్తి చేసింది. మొత్తం కేటాయించిన పని దినాల్లో 70 శాతం లక్ష్యాన్ని తెలంగాణ రాష్ట్రం చేరుకున్నది. దీంతో గతంలో మాదిరిగా 12 కోట్ల పని దినాలు తెలంగాణకు కేటాయించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారు. పని దినాలు రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అపాయింట్ మెంట్ రాగానే కేంద్ర పెద్దలను కలిసి, ఉపాధి పని దినాలను కనీసం 12 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తాయనే విశ్వాసంతోనే ఉపాధి హామీ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నారని, 1127 కుటుంబాలు వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. సగటున ఒక్కో కూలీకి రూ.250.75 రోజువారి వేతనం వస్తుందని, అయితే రోజు వారి వేతనం రూ.307 దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కూలీ గిట్టుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులకు తెలంగాణ ప్రభుత్వం

తరువాయి 2లో



ఇరాన్‌పై అమెరికా దాడిని మోదీ ఎందుకు ఖండించడం లేదు? 'ఇరాన్‌పై అమెరికా బాంబుల దాడిని ఖండిస్తూ భారత ప్రధాని మోదీ ఒక్క పదం కూడా మాట్లాడడలేదు. కేవలం ఉద్రిక్తతలు పెరగొద్దు, చర్చలు జరగాలి, యుద్ధం ఆగాలని మాత్రమే ఇరాన్ ప్రభుత్వ వర్గాలతో అన్నారు. మోదీ తన ప్రియమిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేసి, ఇరాన్‌పై బాంబుల దాడిని ఆపాలి. అది యుఎన్ ఛార్టర్ ఉల్లంఘన అని చెప్పాలి. ప్రధాని భారత నైతిక అధికారాన్ని ప్రదర్శించి, ప్రజలపై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధాన్ని కొనసాగించడాన్ని ఖండించాలి. పాలస్తీనాలో అమాయక చిన్నారులు, మహిళలను ఆకలితో చంపేస్తుండడంపై ఇజ్రాయెల్‌ను మోదీ ఎందుకు అడగడం లేదు.'

– ఎఎన్ఐ వార్తా సంస్థతో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

నేడు వామపక్షాల

## రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇరాన్‌పై అమెరికా బాంబుదాడులకు పాల్పడాన్ని ఖండిస్తూ అఖిల భారత వామ పక్ష పార్టీలు దేశ వ్యాపితంగా నిరసనలో భాగంగా నేడు (మంగళవారం) రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు

తరువాయి 2లో

# భీకర పోరు

- ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన ఇరాన్
- హైఫా, టెల్ అవివ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో పెద్ద ఎత్తున దాడి
- టెహ్రాన్‌పై బాంబు దాడులు కొనసాగించిన ఇజ్రాయెల్





### ఖతార్‌లో అమెరికా స్థావరాల వద్ద భారీ పేలుడు


పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలపై ఒకటైన ఖతార్ దేశ రాజధాని దోహాలో సోమవారం రాత్రి భారీ పేలుళ్ళు వినిపించాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఖతార్ లో 10 వేల మంది అమెరికా సైనికులు ఉంటారని భావిస్తున్నారు. ఇళ్ళు వదిలి బైటకు రావద్దని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని ఖతార్‌లోని తమ పౌరులకు బ్రిటీష్, అమెరికా ఎంబసీలు హెచ్చరించాయి.

**దుబాయ్:** తమ దేశ అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు తీవ్రమయ్యాయి. సోమవారం నాడు ఇజ్రాయెల్‌పై ఇరాన్ విరుచుకుపడింది. హైఫా, టెల్ అవివ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో పెద్ద ఎత్తున దాడి చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకటించింది. ఆపరేషన్ 'ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇరాన్ ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. జెరూసలెంలో కూడా భారీ పేలుళ్ళు వినిపించినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులను కొనసాగించింది. అమెరికా బాంబులతో దెబ్బతిన్న ఫోర్డో అణుశుద్ధీకరణ కేంద్రాన్ని చేరుకునేందుకు వీలు లేకుండా రహదారులను ధ్వంసం చేసింది. అంతే కాకుండా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ప్రమాదకరమైన ఖైదీలను బంధించిన ఎవిన్ జైలుపై, రివల్యూషనరీ గార్డ్స్ పారా మిలిటరీ కేంద్రంపై దాడి జరిగినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. 'ఇజ్రాయెల్ గుమ్మం వద్ద దాడులు చేసిన ఇరాన్ నియంతను పూర్తి సామర్థ్యంతో శిక్షిస్తామని' తెలిపింది. కాగా పేలుడుకు అమెరికా ఉపయోగించిన భారీ మందుగుండు ఆధారంగా ఫోర్డో అణు శుద్ధీకరణ కేంద్రం వద్ద భారీ నష్టం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి అనుబంధ అంతర్జాతీయ అణు శక్తి ఏజెన్సీ(ఎఐఇఎ) చైర్మన్ రాఫెల్ గ్రోస్సీ వియన్నాలో వెల్లడించారు. ఎవిన్ జైలుపై దాడిని ఖైదీల బంధువులు తీవ్రంగా ఖండించారు. తమ ప్రియతములైన కుటుంబ సభ్యులు ఏమైపోయారో తెలియక ఆందోళన

తరువాయి 2లో

## పంచాయతీ ఎన్నికలపై తీర్పు రిజర్వ్

ఏడాదిన్నరగా ఏం చేస్తున్నారని హైకోర్టు సీరియస్



**హైదరాబాద్ :** గ్రామపంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలని దాఖలైన పిటిషన్లపై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. 2024 జనవరి 31న సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు జరపట్లేదంటూ ఆరు పిటిషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ, నిర్మల్, జనగాం, కరీంనగర్ జిల్లాకు చెందిన ఆరుగురు దాఖలుచేసిన ఆ పిటిషన్లపై జస్టిస్ మాధవిదేవి విచారణ చేపట్టారు. గత డిసెంబర్‌లో జరిగిన విచారణ సందర్భంగా ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా తేదీలు వెల్లడిస్తామని రాష్ట్రప్రభుత్వం చెప్పినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఏడాదిన్నర

తరువాయి 2లో



## 9 రోజుల్లోనే రూ.9000ల కోట్లు

- రైతు ఖాతాల్లో 'భరోసా' నిధులు జమ
- కోటిన్నర ఎకరాలకు పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రికార్డు
- ఇది ప్రజాప్రభుత్వం సాధించిన ఘనత
- ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి
- నేడు రైతు భరోసా విజయోత్సవ సభ : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసాను రైతులకు అందించడం తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇదో రికార్డు అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలను ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడు మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ, రైతులకు

తరువాయి 2లో

# నరమేధం వెంటనే ఆపాలి

- ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేస్తాం
- సహజ వనరుల దోపిడీని అడ్డుకున్నందుకే మావోయిస్టులు, ఆదివాసీల హత్యలు
- ఎఐవైఎఫ్ ఛలో రాజ్ భవన్.. నేతల అరెస్ట్




ప్రజాపక్షం/హైదరాబాద్






ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న భయంకరమైన నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు, ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో పలువురు నాయకులకు గాయాలు అయ్యాయి. ఆందోళన కారులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదన్నారు. మావోయిస్టులతో

తరువాయి 12లో

## రిటైర్డ్ ఉద్యోగుల పునర్నియామకమా?



- రైల్వే శాఖపై తీవ్రంగా మండిపడిన అమర్‌జీత్ కౌర్
- సి,బి గ్రేడ్ ఉద్యగులనూ కాంట్రాక్టుపై తీసుకోవడమేమిటి?
- ఇది నిరుద్యోగ యువతకు శరాఘాతం
- తక్షణమే నియామకాలు చేపట్టాలని ఎఐటియుసి డిమాండ్

**న్యూఢిల్లీ :** పదవీ విరమణ చేసిన అధికారులనే కాకుండా, గ్రూప్ సి, బి పోస్టులతో సహా నాన్ గెజిటెడ్, పారిశ్రామిక ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తిరిగి నియమించుకోవాలనే నిర్ణయాన్ని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. దేశంలో కోట్లాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 1 నుంచి 9 పే లెవల్ రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి నియమించుకోవాలని రైల్వే బోర్డు విధాన పత్రాన్ని విడుదల చేయడం ఆందోళన కలిగిస్తుందని, ఇది వారి పాలిట శరాఘాతమని ఒక ప్రకటనలో అన్నారు. దేశంలోని

తరువాయి 2లో


పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి వేగంగా స్థలాల గుర్తింపు ప్రక్రియ







## రికార్డు స్థాయిలో ప్లాట్ల ధరలు

- గచ్చిబౌలి ప్రాంతంలో ఒక్కోప్లాట్‌కు రూ.33 కోట్లు
- 11 ప్లాట్లకు రూ.65.02 కోట్ల ఆదాయం
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల బహిరంగ వేలం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక కమర్షియల్ ప్లాట్‌కే ఏకంగా రూ.33 కోట్ల ధర పలికింది. మొత్తం 11 ప్లాట్లను హౌజింగ్ బోర్డ్ వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చింది. హైదరాబాద్‌లోని మరో ప్రాంతంలో రూ.13.51 కోట్ల ధరకు చేరుకున్నది. రెండు ఎంఐజి

తరువాయి 12లో

# ఊరించి... ఉసూరుమనిపించి

- వానలు లేక ఎండుతున్న మొలకలు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులకు తీవ్ర నష్టం
- పంట దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం



ప్రజాపక్షం/హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చేయడంతో రైతులు మురిసిపోయారు. ముందుగా రావడమే కాకుండా ఈసారి సమృద్ధిగా వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో మే నెల చివరి వారంలోనే ఏరువాక మొదలు పెట్టారు. రుతు పవనాల ఆగమనంతో ఊరించిన వర్షాలు ఆ తర్వాత మోహం చాటేయడంతో రైతులు ఉసూరుమంటున్నారు. జూన్ చివరి వారం మొదలైనా వర్షపు చుక్క జాడ లేకపోవడం, ఈ ప్రకృతి వైపరీత్యంతో సాగునీరు లేక అన్నదాతలు అల్లాడుతున్నారు. మరికొన్ని రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే వేసిన పంటలు మొత్తానికే నష్టపోవడమో, మొక్కల ఎదుగుదల లేక దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది సుమారు 1.37 కోట్ల ఎకరాల్లో పంట సాగు

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.37 కోట్ల ఎకరాల్లో వివిధ పంటల సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచన వేశారు. ఇందులో సింహభాగం వరి పంట సాగు కానుండగా రెండవ స్థానంలో పత్తి పంట సాగు అవుతున్నది. అయితే వరికి సంబంధించి నారు మళ్ల తర్వాత జూలైలో వరి నాట్లు ఊపుందుకోనుండగా, వాణిజ్య పంటలకు సంబంధించి మే నెల చివరిలో కురిసిన తొలకరితోనే ఏరువాక ప్రారంభమైంది. ముందస్తు వర్ష సూచనతో ఈ ఖరీఫ్‌లో వివిధ జిల్లాల్లో రైతులు వాణిజ్య పంటలైన పత్తి, కంది, సోయాబీన్, మొక్కజొన్న, పెసర, జొన్న, వేరు శనగ, మినుము, ఆముదం, సజ్జలు, రాగులు, నువ్వులు, పొద్దు తిరుగుడు తదితర పంటలను సాగు చేశారు. ఇందులో

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## కీవ్‌పై రష్యన్ డ్రోన్ల వరద : పదిమంది మృతి



**కీవ్ :** ఉక్రేన్ దేశ రాజధాని కీవ్ నగర ప్రాంతంలో రష్యా సోమవారం చేసిన గగనతల దాడుల్లో పదిమంది పౌరులు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఉక్రేన్ హోం శాఖామంత్రి ఇహోర్ క్లిమెంకో చెప్పారు. క్షిపణులు, డ్రోన్లతో రష్యా రాత్రికి రాత్రి ఈ దాడులు చేసిందని సోషల్ మీడియా వేదిక గా ఈ ప్రకటన చేశారు. సంబంధిత బాధితుల వీడియోలను కూడా పోస్టు చేశారు. ఈ దాడుల్లో భూగర్భ మెట్రోస్టేషన్ ప్రవేశద్వారం కూడా ధ్వంసమైంది. అదే విధంగా దక్షిణ ఉక్రేన్‌లోని బిలాట్సెర్వ్కా ప్రాంతంలో డ్రోన్ ఒకటి ఆసుపత్రి భవనాన్ని ధ్వసం చేయడంలో ఒక రోగి మరణించాడు. మరణించిన వారిలో ఆరుగురు పౌరులు బహుళ అంతస్తుల భవనంలో నిద్రలో ఉన్నవారే.

ఇటీవలి వారాల్లో ఉక్రేన్‌పై రష్యా తన దాడులను విపరీతంగా ఉధృతం చేసింది.

## ఇరాన్ పాలనమార్పుపై
# ట్రంప్ ప్రకటనకు వైట్‌హౌస్ వివరణ



**వాషింగ్టన్ :** ఇరాన్ ప్రభుత్వ పరిపాలనలో మార్పు సాధ్యమేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది. ఇరాన్ పాలనమార్పును తాము కోరుకోవడంలేదని వైట్‌హౌస్ ప్రకటించింది. అమెరికా దౌత్య చర్యలు చేపట్టినప్పటికీ పదే పదే ఇరాన్ గనుక తిరస్కరిస్తే, ఎందుకు ఇరాన్ ప్రజలు ఉగ్రవాద పాలకుపై తిరుగుబాటు చేయకూడదు, పాలనామార్పు కోరుకోకూడదన్నది ట్రంప్ మాటలలోని అంతరార్థమని వివరణ ఇచ్చింది. అణు శుద్ధి కేంద్రాలు, అణ్వాయుధ తయారీ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని, ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చాలన్నది తమ ఉద్దేశం కాదని మొదట చెప్పిన ట్రంప్ తర్వాత ''ఇరాన్‌లో పరిపాలన మార్పు అనే మాటను రాజకీయంగా ఉపయోగించడం సరైనది కాకపోవచ్చు, కానీ ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న పాలకులు గనుక ఆ దేశాన్ని ''మిగా'' (మేక్ ఇరాన్ గ్రేట్ ఎగైన్) గా మార్చలేకపోయినప్పుడు ఎందుకు అక్కడ పరిపాలనలో మార్పు రాకూడదు?''అని ప్రశ్నించారు. ఇరాన్‌లో పరిపాలన మార్పు జరుగుతుందని ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. దీనిపై వైట్‌హౌస్ మళ్ళీ తాజా వివర ణ ఇచ్చింది.

# ఇరాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండదు
## త్వరలో లక్ష్యాలు సాధిస్తాం : నేతన్యాహూ



**టెల్అవీవ్ :** ఇరాన్‌తో సుదీర్ఘమైన యుద్ధం ఉండదని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ ప్రకటించారు. తమ లక్ష్యాలను సాధించే వరకూ యుద్ధం చేస్తామని అన్నారు. తమ దేశాన్ని తుడిచిపట్టాలని గడచిన పది సంవత్సరాలుగా ఇరాన్ ప్రభుత్వం ఉద్ధృత సన్నాహాలు చేస్తున్నందువల్లనే మనుగడకోసం తాము లక్ష్యాలను నిర్దేశించుకుని దాడులు చేశామని అన్నారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' మేరకు ఇజ్రాయెల్ అనుకున్న లక్ష్యాలను త్వరలోనే చేరుకుంటుందని చెప్పారు. ముందుగా రికార్డు చేసిన ఆయన సంభాషణను, చెప్పాల్సిన విషయాలను మీడియాకు సోమవారం విడుదల చేశారు. అంచెలంచెలుగా తమ లక్ష్యాలను చేరుకుంటున్నా మన్నారు. ''ఫోర్డో అణు స్థావరంపై అమెరికా దాడి చేసింది, ఇప్పుడు మాకు ఆ భయం పోయింది, కొంతధీమా వచ్చింది, ఇరాన్‌తో ఇజ్రాయెల్ యుద్ధం ఊబిలో కూరుకుపోదు, యుద్ధం కొనసాగించదు, లక్ష్యాల సాధనమేరకే మా యుద్ధం పరిమితం, అప్పటిదాకా యుద్ధం ఆగదు, అదేసమయంలో గాజా నుండి మా దృష్టిని ఎటువైపుకూ మళ్ళించడంలేదు, ఇరాన్‌లో చేసిన దాడులవల్ల గాజాలో లక్ష్యాలు నెరవేరతాయి, ఇరాన్ సహాయం లేకుండా గాజాలో అవన్నీ కూలిపోతాయి, ఇరాన్‌లో సగానికి పైగా బాలిస్టిక్ క్షిపణి లాంచర్‌లను లేకుండా చేశాం, ఇక భవిష్యత్తులో గతంలో చేసుకున్న అబ్రహాం ఒప్పందాలను విస్తరించడానికి అవకాశాలు వస్తాయి, మధ్యప్రాచ్యంలో కొత్త అవకాశాలను మనం చూస్తాం, అద్భుతమైన సహాయ సహకారాలను, మార్పులను మనం చూడగలుగుతాం, మధ్యప్రాచ్యానికి మంచి భవిష్యత్తు, ఆర్థిక ప్రగతి ఉంది'' అని నేతన్యాహూ చెప్పారు.

**కవ్వింపులేని దురాక్రమణ అన్యాయం:పుతిన్**

ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకపోయినప్పటికీ ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఖండించారు. ఇరాన్ ప్రజలకు వీలైనంతవరకూ తాము సహాయం చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రస్తుతం మాస్కో పర్యటనలో ఉన్న ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి పుతిన్‌ను కలుసుకుని ఇరాన్‌లో పరిస్థితులను, ఇజ్రాయెల్, అమెరికా దురాక్రమణ చర్యలను వివరించారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు ఎంతమాత్రం సమర్థనీయం కాదు, ఇరాన్ ఎలాంటి కవ్వింపు చర్యలకూ పాల్పడటంలేదు, అందువల్ల ఈ విషయంలో ఇరాన్ ప్రజలకు సాయం చేసేందుకు మేం కృషి చేస్తాం'' అని పుతిన్ చెప్పారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఉల్లంఘించాయని అన్నారు.

**టెహ్రాన్ :** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో కూడా ముడిపడి ఉండటంతో మార్కెట్ వ్యవస్థలు కూడా తీవ్ర ఉత్కంఠతో ఈ పరిణామాలను గమనిస్తున్నాయి. ప్రపంచ దేశాల ఆర్థికమంత్రులు చమురు ధరల పెరుగుదల భయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పూర్వరంగంలో అమెరికా దాడుల తర్వాత ఇరా న్ ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకుంటుంది? అనే విషయంపైనే ప్రధానంగా అందరూ దృష్టి సారించారు. ఇరాన్ ప్రస్తుతం ఆత్మరక్షణలో పడిపోయింది. ఇరాన్‌కు ఆయువుపట్టులాంటి ఫోర్డో అణుస్థావరాన్ని సంపూర్ణంగా ధ్వంసం చేశామని అమెరికా చెబుతున్న దశలో పశ్చిమ ఆసియాలోని అమెరికా స్థావరాలను దెబ్బతీసేందుకు ఇరాన్ సన్నద్ధమవుతున్నది. ఇరాక్, జోర్డాన్, కువైత్, బహ్రైన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, సౌదీ అరేబియా, ఈజిప్టులలో అమెరికాకు స్థావరాలు ఉన్నాయి. ఖతార్, కువైత్‌లకు ఇప్పటికే ఇరాన్ నుండి హెచ్చరికలు వెళ్ళాయి. ఇరాన్

## ఖతార్, యుఎఇ, కువైత్, సిరియాలలో అమెరికా స్థావరాలపై దాడికి ఇరాన్ ప్రణాళిక?

ఐదు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుందని పాశ్చాత్య మీడియా నిపుణుల పరిశీలనాంశాలను చెబుతున్నది. ప్రధానంగా ఆ ప్రాంతంలో అమెరికా సహా ఇతర నాటో కూటమి దేశాల నౌకాస్థావరాలను ధ్వంసం చేయడం, అణ్వాయుధాలను యుద్ధప్రాతిపదికపై సమకూర్చుకోవడం, ఆసియా దేశాలలో నివసించే ప్రతి అమెరికా పౌరుడిపైనా దాడులు చేసి హతమార్చడం, హిజ్బొల్లా, హౌతీ, హమాస్ ఉగ్రవాదులకు ఉన్నదాంట్లోనే నిధులు సమకూర్చి నిర్దేశిత లక్ష్యాలపై వారిని ఉసిగొల్పి ఉగ్రవాద దాడులు చేయించడం, కీలకమైన అమెరికా అనుకూల చమురు, ఖనిజవాయు కేంద్రాలపై దాడులు చేయడం, ఇరాన్, సిరియాలలో కొన్ని కేంద్రాలను గగనతల ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఇరాన్‌కు ఉన్న అవకాశాలు. ఈ ప్రాంతంలోని బహ్రైన్‌లో అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ నావికాదళానికి చెందిన 9000 మంది సైనికులు తిష్ఠవేసుకుని కూర్చో వడం ఇరాన్‌కు పెద్ద సమస్యగా ఉంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా ఇంటిలిజన్స్ మిషన్స్ పనిచేస్తున్నాయి. కువైత్‌లో ప్రధానమైన అమెరికా ఆర్మీ స్థావరం, మెయిన్ లాజిస్టిక్స్, కమాండ్ హబ్ ఉన్నాయి. ఖతార్‌లో పశ్చిమాసియాలోనే అతిపెద్ద అమెరికా స్థావరం ఉంది. ఈ స్థావరంలో 10,000 మంది అమెరికా సైనికులు ప్రస్తుతం ఉన్నారు. ఈ స్థావరంలో 100 యుద్ధ విమానాలు, భారీసంఖ్యలో డ్రోన్లు నిల్వచేసి ఉంచింది అమెరికా ప్రభుత్వం.

## మధ్యాసియాలో భయంకరమైన మలుపు : భద్రతామండలిలో గుటెర్రెస్

**న్యూయార్క్ :** ఇరాన్‌పై అమెరికా బాంబుల దాడి చర్యలు మధ్యప్రాచ్యంలో భయంకరమైన మలుపు అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. అణ్వాయుధ నిరోధక ఒప్పందాన్ని మనం సంపూర్ణంగా గౌరవించి తీరాలన్నారు. భద్రతామండలి అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు.

15 సభ్యదేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు స్థావరాలపై బాంబుదాడులు చేయడంతో మధ్యప్రాచ్యంలో చరిత్ర కొత్త మలుపు తీసుకుంది, ఇది భయానకమైన, ప్రమాదకరమైన మలుపు, ఇప్పటికే ఈ ప్రాంతం అల్లకల్లోలంగా ఉంది, మధ్యప్రాచ్యంలో సైనికచర్యలను, సైన్యం మోహరింపు చర్యలను నేను పదే పదే అనేకసార్లు ఖండిస్తూ వస్తున్నా''అని గుటెర్రెస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం లో ప్రజలు ఇప్పటికే కష్టాల ఊబి లో కూరుకున్నారని, ఇక మరో విధ్వంసాన్ని చవిచూసేందుకు వారు సిద్ధంగా లేరని, అందు కు తగిన శక్తిసామర్థ్యాలు అక్కడ ప్రజలకు లేవని అన్నారు. ప్రతీకారం తర్వాత ప్రతీకారం దాడుల ప్రమాదంతో పరిస్థితి క్షీణించిపోతోందన్నారు.

# సిరియా చర్చ్‌లో ఇస్లామిక్ జీహదీ ఆత్మాహుతి దాడి : 22 మంది మృతి



**డమాస్కస్ :** సిరియాలో మళ్ళీ ఇస్లామిక్ స్టేట్ జీహదీ ఉగ్రవాదుల దాడులు ప్రారంభమయ్యాయి. దేశ రాజధాని డమాస్కస్‌కు సమీపంలో ఉన్న డ్వీలా నగరంలోని ఒక చర్చిలో జరిగిన ఆత్మాహుతి బాంబు పేలుడులో 22 మంది మరణించారు. మరో 52 మంది గాయపడ్డారు. గత ఏడాది డిసెంబరులో ఇరాన్ అనుకూల అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ పదవీచ్యుతుడైన తర్వాత సిరియాలో అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పడింది. ఇరాన్‌పై అమెరికా బి–2 స్టీల్త్ బాంబరు యుద్ధ విమానాలు మూడు కీలక అణుస్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత కొద్ది గంటలకే సిరియాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిరియా నగరం డ్వీలాలోని చర్చిపై ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. అల్ అస్సాద్ పదవీచ్యుతుడైన తర్వాత సిరియాలో శాంతియుత పరిస్థితులు నెలకున్నాయనుకున్న సమయంలో ఇరాన్‌పై దాడులవల్ల ఈ ఘటన సంభవించింది. డ్వీలాలోని గ్రీకు ఆర్థోడాక్స్ చర్చ్ గురువు ఎలియాస్‌పై మొదట కాల్పులు జరిపాడు. తర్వాత ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడినట్లు సిరియా ఆరోగ్యమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆదివారం సాయంత్రం ప్రార్థనల సందర్భంగా చర్చిలో ఈ ఘటన జరిగింది. ఒక వ్యక్తి ఆకస్మికంగా చర్చ్‌లోకి ప్రవేశించి కాల్పులు ప్రారంభించాడని, ఆతడిని వారించే ప్రయత్నం చేయబోగా ఆత్మాహుతి బాంబు బటన్ నొక్కి తనను తాను పేల్చుకుని భారీ పేలుడుకు పాల్పడ్డాడని ప్రత్యక్ష సాక్షి లారెన్స్ మామరి చెప్పారు. ఇరాన్ అనుకూల అల్ అస్సాద్ సిరియాను 13 సంవత్సరాలు పరిపాలించిన సమయంలో అతిదారుణమైన హింసాకాండ, అంతర్యుద్ధం దేశంలో కొనసాగాయి.

## నేడు నాలుగు రాష్ట్రాల సెంట్రల్ జోన్ కౌన్సిల్ సమావేశం

**న్యూఢిల్లీ :** నాలుగు రాష్ట్రాల సెంట్రల్ జోన్ కౌన్సిల్ సమావేశం మంగళవారంనాడు వారణాసిలో జరుగుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. కేంద్ర హోం వ్యవహారా మంత్రిత్వశాఖ, అంతర్రాష్ట్ర మండలి సచివాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఒక్కొక్క రాష్ట్రం నుండి ఇద్దరు సీనియర్ మంత్రులు పాల్గొంటారు. 1956 నాటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 15,22 సెక్షన్ల కింద దేశంలో ఈ విధంగా మొత్తం ఐదు సెంట్రల్ జోన్ కౌన్సిల్స్ ఏర్పడ్డాయి. ఈ అంతర్రాష్ట్రస్థాయి సమావేశాలు ప్రతి ఏడాది జరుగుతాయి. ఈ సమావేశాలలో అత్యవసర సత్వర ప్రతిస్పందన వ్యవస్థ అమలుతోపాటు ప్రాంతీయస్థాయిలో ఉమ్మడి ప్రయోజనాలు నెరవేర్చే పోషకాహారం, విద్య, ఆరోగ్యం, విద్యుత్, అర్బన్ ప్రణాళిక, సహకార వ్యవస్థ వంటి వివిధ సమస్యలను రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారు.

మహిళలు, పిల్లలకు వ్యతిరేకంగా జరిగే లైంకపరమైన దాడుల్లో కేసుల దర్యాప్తులు వేగంగా జరుగుతున్నాయా? లేదా? అని పరిశీలిస్తారు. బలమైన రాష్ట్రాలు ఉన్నప్పుడే బలమైన దేశం ఉంటుదన్న లక్ష్యంతో ఈ జోనల్ కౌన్సిల్ ఏర్పడ్డాయి. ఈ జోనల్ కౌన్సిల్స్‌లో రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలమధ్య ఉండే సమస్యలను లేదా కేంద్రం,రాష్ట్రం మధ్య ఉండే సమస్యలను చర్చిస్తారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలలో ప్రభుత్వాల సహాయంతో ఈ విధంగా గడచిన 11 సంవత్సరాలలో వివిధ జోనల్ కౌన్సిల్స్ స్థాయిలో 61 సమావేశాలు జరిగాయి.

## కేబినెట్ సమావేశాల పేరుతో.. ప్రభుత్వం కాలయాపన
### బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేబినేట్ సమావేశాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన కార్యక్రమంగా మార్చేసిందని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గత ఆరునెలలుగా ముఖ్యమైన ప్రజా సమస్యలపై చర్చ లేకుండా కేబినెట్ సమావేశాన్ని కబుర్లతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు ఏమైందని, కాళ్లేశ్వరంపై పిసిసి అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి సిబిఐ విచారణ కోరడాని, సిఎం అయ్యాక ఎందుకు సిబిఐకి అప్పగించడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల గురించి ఇప్పటివరకు కేబినెట్ సమావేశంలో ఎందుకు చర్చించడం లేదన్నారు. వాటిని అమలు చేసే ప్రణాళికను ఎందుకు సిద్ధం చేయలేకపోతున్నారన్నారు. ఇదే విషయాన్ని బిజెపి తరపున చాలాసార్లు స్పష్టంగా ప్రశ్నించామన్నారు.

అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా, ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చించకుండా, వాటిని అమలు చేసే దిశగా చర్య లు తీసుకోకుండా సమావేశం నిర్వహించడం, మళ్లీ మళ్లీ కాలయాపన చేయడం అంటే ఇదేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. అనేకమైన అంశాల్లో ఆరు గ్యారెంటీల విషయంలో చట్టబద్ధత కానీ, ముఖ్యమంత్రిగా మొదటి సంతకం పెట్టి అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత కూడా వాటి మీద ఇంకా ముందుకు తీసుకువెళ్ళకపోవడం బాధాకరమన్నారు.

## దేశ సమగ్రతకోసం బలిదానం చేసిన ముఖర్జీ
### కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సమగ్రతను కాపాడాలన్న సంకల్పంతో, ఆ ఆలోచనను పూర్తిగా కార్యరూపం దాల్చేందుకు ముందడుగు వేసిన డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ తన జీవితాన్ని బలిదానం చేశారని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడ జి.కిషన్‌రెడ్డి అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ లక్ష్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019లో నెరవేర్చారన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో పాటు జమ్ము కశ్మీర్లో దళితులకు, మహిళలకు దేశంలోని ఇతర ప్రాంతాలవారిలా సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. జమ్ము కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమైనప్పుడు అక్కడ ప్రత్యేక ప్రధానమంత్రి, ప్రత్యేక హక్కులు, ప్రత్యేక అధికారాలు ఎలా ఉంటాయంటూ డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రశ్నించారన్నారు. వీసా, పర్మిట్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, జమ్ము కశ్మీర్‌లో అడుగుపెట్టారని తెలిపారు. జమ్ము కశ్మీర్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయనను పర్మిట్ లేదన్న కారణంతో అరెస్ట్ చేశారని, తర్వాత ఆయన జమ్ము కశ్మీర్ లోనే అనుమానాస్పదస్థితిలో మృతి చెందారన్నారు. ఈ ఘటన హత్యేనన్న ఆరోపణలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు.

## బీకర పోరు
(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. పలు దేశాలకు చెందిన ఖైదీలు ఈ ఎవిన్ జైలులో బందీలుగా ఉన్నారు. ఈ జైలులో రాజకీయ ఖైదీలు ప్రధానంగా ఉన్నారు. పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్ ఈ జైలును నడుపుతోంది. ఈ జైలు తాలూకూ సమాచారాన్ని ఇరాన్ సర్వాధినేత ఖమేనికీ మాత్రమే నేరుగా తెలియజేస్తారు. ముఖ్యంగా అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు విధించిన ఆంక్షలను లక్ష్యంగా చేసుకుని ఈ జైలును ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జైలులో కొన్ని భాగాలు ధ్వంసమయ్యాయని, తర్వాత బృందాలు రంగంలోకి దిగి పరిస్థితిని నియంత్రించి వ్యవస్థను తమ అదుపులోకి తెచ్చుకున్నట్లు ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన వెబ్‌సైట్ ప్రకటించింది. శక్తిమంతమైన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్ (ఐఆర్‌జిసి)కి చెందిన థార్ అల్లా కేంద్ర కార్యాలయ కమాండ్ సెంటర్‌పై గగనతల దాడులను, ఎవిన్ జైలుపై దాడులను పలు దేశాలు ఖండించాయి.

ఇదిలా ఉండగా, ఇరాన్ అణుస్థావరాలపై దాడిచేసిన అమెరికా ఎలాం టి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించలేదని నాటో చీఫ్ మార్క్ రట్టో ప్రకటించారు. మరోవైపు చమురు ధరల పెరుగుదలపై ట్రంప్ ప్రకటన చేస్తూ ఈ ధరలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

**దాడికి ముందే అణు పదార్థాలను తరలించిన ఇరాన్**

అమెరికా దాడుల తర్వాత వియన్నాలోని ఐఎఇఎ ప్రధానకేంద్రంలో భయాలు నెలకున్నాయి. ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న ఫోర్డో కేంద్రం మరింత ధ్వంసమవుతుందని అంచనా వేస్తున్నట్లు ఐఎఇఎ ప్రధానాధిపతి రాఫెల్ గ్రాస్సి అన్నారు. కాగా ఫోర్డో అణుస్థావరం సహా మిగిలిన రెండు కేంద్రాలపై అమెరికా దాడులు చేయడానికి ముందుగానే అణుశుద్ధికి ఉపయోగపడే యురేనియమ్‌ను, ఇతర పదార్థాలను అక్కడి నుండి తరలించామని అనేకమంది ఇరాన్ అధికారులతోపాటు ఇరాన్ అణుశక్తిసంస్థ అధికార ప్రతినిధి బెహ్రౌజ్ కమల్వంది చెప్పారు. అణు పదార్థాలు, ఇతర అణుసంబంధ పరికరాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జూన్ 13వ తేదీకి ముందుగానే ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి తమకు తెలియజేశారని ఐఎఇఎ గవర్నర్స్ బోర్డు సమావేశంలో గ్రాస్సీ చెప్పారు.

సోమవారంనాడు ఇజ్రాయెల్‌పై కొత్తతరహాలో దాడులు చేసినట్లు ఇరాన్ పేర్కొంది. ''ట్రూ ప్రామిస్ 3'' ఆపరేషన్ పేరుతో ఈ దాడులు చేశామని ఇజ్రాయెల్‌లోని హైఫా, టెల్‌అవీవ్ నగరాలపై లక్ష్యంగా చేసకుని దాడులు జరిగాయని తెలిపింది. జెరూసలెంలో భారీ పేలుడు శబ్దాలు అందరికీ వినిపించాయి. ఈ దాడులకు ముందుగా సోమవారం ఉదయం ఇరాన్ సాయుధ బలగాల సంయుక్త ప్రధానాధిపతి జనరల్ అబ్దుల్‌రహీం మౌసావీ ఒక ప్రకటన చేస్తూ, అమెరికాకు, అమెరికా సైన్యానికి వ్యతిరేకండా దాడులు చేసేందుకు ఇరాన్ బలగాలకు సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

## ఎన్నికలపై తీర్పు రిజర్వ్
(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీలో సరైన పాలన లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు వాదించారు. పంచాయతీలకు పాలకవర్గం లేకుండా ఉండొద్దని సుప్రీంకోర్టు తీర్పులు చెబుతున్నాయని వాదించారు. రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గణన అంశాలతో ఎన్నికల నిర్వహణ ఆలస్యమైందని పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి 30రోజుల గడువు కావాలని ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం వెలువర్చిన తర్వాత ఎన్నికలు జరిపేందుకు 60రోజుల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. దీనిపై జోక్యం చేసుకున్న కోర్టు ఏడాదిన్నరగా ఎన్నికలు జరపకుండా ఏం చేస్తున్నట్లు ప్రశ్నించింది. ప్రభుత్వం ఆలస్యం చేస్తే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికలు నిర్వహించే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉంది కదా అని హైకోర్టు ప్రశ్నించింది. పోలింగ్ కేంద్రాలు, భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వ సహకారం అవసరమని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

## జోరందుకుంది (మొదటి పేజీ తరువాయి)

అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఉపాధి హామీ పనుల్లో 60 శాతం పనులు వ్యవసాయ అనుబంధ పనులు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా, వ్యవసాయ అనుబంధ పనులు 50 శాతంగా నమోదయ్యాయి. జిపి భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, సిసి రోడ్ల వంటి మలిక వసతుల కల్పన పనులు లక్షా 31 వేలకు పైగా కొనసాగుతున్నాయి. ఉపాధీ హామీ పనుల్లో ఉపాధి కల్పనతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన, ఆస్థుల సృష్టికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మే మాసం ముగిసే నాటికి ఉపాధి హామీలో భాగంగా రూ.1416 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అందులో రూ.1151.67 కోట్లు వేతనాలు కాగా, రూ.191.03 కోట్లు మేటీరియల్ కాంపోనెంట్ గా నమోదైంది. కేంద్రం నుంచి నిధుల విడుదలతో జాప్యం అయినా కూలీలకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వేతనాలను ఉపాధి కూలీల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు కూలీల ఖాతాల్లో 733.52 కోట్లు జమ అయ్యాయి. వ్యవసాయ అనుబంధ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుండటంతో ఉపాధి పనులకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పని దినాలను సగానికి కేంద్ర ప్రభుత్వం కుదించింది.

## రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని తెలంగాణ వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రపంచ శాంతి కోరుకునే వారు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కూనంనేనీ సాంబశివరావు (సిపిఐ), జాన్ వెస్లీ (సిపిఎం), పి.సూర్యం (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), పోటు రంగా రావు (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,) గాదగోని రవి (సిపిఐయు), మామిండ్ల రమేష్ రాజా (సిపిఐ ఎంఎల్ లిబరేషన్), సిహెచ్ మురహరి (ఎస్ యు సి ఐ (సి), జానకిరాములు (రివల్యూషనరీ సోషియస్ట్ పార్టీ), బి. సురేందర్ రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్,) ప్రసాద్ అన్న (సిపిఐ ఎంఎల్) సమిష్టిగా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా అమెరికా దాడులకు పాల్పడడం గర్హ నీయమన్నారు. అణ్వాయుదాలు తయారు చేస్తున్నద నెపంతో ఇరాన్‌పై అమెరికా దాడికి పూనుకోవడం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడమేనని వారు పేర్కొన్నారు. సా మ్రాజ్యవాద అమెరికా దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండించాలని, అమెరి కా ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి, యుద్ధాన్ని ఆపడంలో భాగస్వామి కావాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

## రూ.9000ల కోట్లు (మొదటి పేజీ తరువాయి)

ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, పేదలకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తోందని. రైతు భరోసాలో భాగంగా ఈ సీజన్ మొదలు కాగానే ఎకరాకు గతంలో రూ.10 వేలుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా రెండువేలు జోడించి.. రూ.12 వేలు ఇస్తున్నామని ఇందులో వాన పంట కాలనికీ గాను. కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రూ.6వేల చోప్పున రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. వ్యవసాయం యోగ్యమైన అన్ని భూములకు కేవలం 9 రోజుల్లోనే రైతు భరోసా వేయడం పూర్తి చేయడం జరిగింది. ఇంత తక్కువ కాలంలో రైతు భరోసాను పూర్తిగా వేయడం రాష్ట్ర చరిత్రలోనే ఇద తొలిసారని అన్నారు. కాంగ్రెస్ మండల కమిటీల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో కేవలం 9 రోజుల్లో కోటిన్నర ఎకరాలకు సుమారు 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను అందించిన విషయాన్ని వివరిచాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని డిప్యూటీ సిఎం కోరారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**నేడు రైతు భరోసా విజయోత్సవ సభ**

తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు భరోసాను విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో నేడు బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం ఆవరణలో రైతు భరోసా విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.రైతు భరోసా విజయోత్సవ సభ ఏర్పాట్లుకు సంబంధించి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖాల అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తో పాటు సహచర మంత్రులందరూ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లలను రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు , మంత్రి తెలిపారు. దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 70 వేల కోట్లు రుణమాఫీ జరిగితే తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతుల పంట రుణాలకు సంబంధించి రూ.21 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఏక కాలంలో చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల నుండి రైతు భరోసా పొందిన లబ్ధిదారులు పాల్గొననున్న నేపథ్యంలో రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితరు అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో కలిసి అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ కమిషనర్ పోలీస్ సివి ఆనంద్, అడిషనల్ డిజిలా అండ్ ఆర్డర్స్ ఎంఎం భగవత్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్,ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష,ఎస్‌పిడిసిఎల్ ఎండి ముష్రాఫ్ అలీ, వ్యవసాయ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

## పునర్నియామకమా?
(మొదటి పేజీ తరువాయి)

'యువశక్తి'ని తాము పట్టించుకుంటామని చెప్పుకునే బిజెపి ప్రభుత్వం, అన్యాయంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను దూరం చేస్తోందని మండిపడ్డారు. రైల్వేలలో దాదాపు 3 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రైల్వే రన్నింగ్ లైన్స్, ఆపరేషన్స్, రైల్వే వర్క్‌షాప్‌లు, ప్రొడక్షన్ యూనిట్లలో ఖాళీగా ఉన్న ఈ పోస్టులను భర్తీ చేయడానికి రైల్వే మంత్రిత్వ శాఖ పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైల్వేలలో భద్రతకు సంబంధించిన విభాగాలు అత్యంత ప్రమాదంలో ఉన్నాయని, లోకో పైలట్లు రోజుకు 12 నుండి 14 గంటలు పని చేయాల్సి వస్తోందని, వారు పని భారం తగ్గించాలని కోరుతున్నారని తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వంలో 15 లక్షల ఖాళీలు**

కేంద్ర ప్రభుత్వంలో మాత్రమే రైల్వేలు, రక్షణ, పోస్టల్, ఇతర విభాగాలలో కలిపి 15 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అమర్‌జీత్ కౌర్ తెలిపారు. బ్యాంకులు సహా ప్రభుత్వ రంగ పరిశ్రమలలో దాదాపు 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రస్తుత ఉద్యోగులు అదనపు పనిభారంతో సతమతమవుతున్నారని అన్నారు. పెద్ద సంఖ్యలో పెన్షనర్లను తిరిగి నియమించుకోవాలని రైల్వే బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులను కాంట్రా క్టు ప్రాతిపదికన, నిర్ణీత కాలానికి నియమించుకోవడం వంటి అన్యాయమైన పద్ధతులను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయడానికి నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తోంది. ఇందుకు పోరాటాన్ని ఉధృతం చేయాలని రైల్వే, అన్ని రంగాల ట్రేడ్ యూనియన్లకు ఎఐటియుసి పిలుపునిస్తోందని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బస్తీ దవాఖానా ఉద్యోగులకు పెండింగ్ వేతనాల చెల్లింపునకు డిమాండ్

ప్రజాపక్షం/హైదారబాద్ : బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్, నర్సింగ్ ఆఫీసర్, సపోర్టింగ్ స్టాఫ్‌ల 4 నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్తీ బస్తీ దవాఖానలో కాంట్రాక్టు విధానంలో నియామకమైన సపోర్టింగ్ స్టాఫ్‌ను ఈ మధ్య కాలంలో ఏజెన్సీ లకు అప్పగించారని తిరిగి వారికాంట్రాక్టు విధానం తీసుకు రావడం లేక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి కార్పొరేషన్ ద్వారా ప్రతినెల 1వ తేదీన బస్తీ దవాఖాన అన్ని క్యాడర్స్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో ఉద్యోగులు అందరితో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

### విత్తనోత్పత్తి రైతులకు

# నష్టపరిహారం చెల్లించండి

### రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



ప్రజాపక్షం/హైదారాబాద్ : జోగులాంబ గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీడ్ కంపెనీలను రైతు కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి ఆదేశించారు. ఈ మధ్యకాలంలో గద్వాల్ జిల్లాలో విత్తనోత్పత్తి చేసే రైతులకు జిఒటి పేరుతో సీడ్ కంపెనీలు మోసం చేస్తున్నాయని కమిషన్ దృష్టికి వచ్చిన విషయం తెలిసిందే. రైతుల ఫిర్యాదులతో ఈనెల జూన్ 13 న రైతు కమిషన్ గద్వాల్ జిల్లాలో పర్యటించి అక్కడి రైతుల నుండి అభిప్రాయాలను సేకరించింది. ఇదే క్రమంలో గద్వాల్ ఘటనపై సోమవారం రైతు కమిషన్ కార్యాలయంలో బిఆర్‌కెభవన్‌లో కంపెనీల ప్రతినిధులతో రైతు కమిషన్ సమావేశాన్ని నిర్వహించింది.

ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. సీడ్ కంపెనీలు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించకుండా రైతుల కోణంలో కూడా ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ విత్తనోత్పత్తికి అనువైన ప్రాంతమని, సీడ్ కంపెనీలు రైతులతో విత్తనోత్పత్తి చేయించుకోవడమే కాకుండా వారు నష్టపోయిన సమయంలో ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని గుర్తుచేశారు. రెండు రోజుల్లో గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో సీడ్ కంపెనీలు నిర్ణయం తీసుకోవాలన్నారు. సీడ్ కంపెనీలు ఏర్పాటుచేసుకున్న ఆర్గనైజర్ల తీరుపై కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్గనైజర్ల వ్యవహారంతోనే సీడ్ కంపెనీలు బద్నామ్ అవుతున్న విషయాన్ని ఈ సందర్భంగా సభ్యులు వివరించారు. రైతులతో ఆర్గనైజర్లు వడ్డీ వ్యాపారం చేయడం నేరమని హెచ్చరించారు. విత్తనోత్పత్తి కోసం సీడ్ కంపెనీలు రైతులకు ఇచ్చిన విత్తనమే.. జివోటి పరీక్షలో ఎట్లా ఫెయిల్ అవుతుందని కమిషన్ సభ్యులు ప్రశ్నించారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీడ్ కంపెనీలు రైతులకు నష్టపరిహారం ఇవ్వడానికి సుముఖత తెలిపాయి. ఈ సమావేశాని హాజరైన అలంపూర్ మాజీ ఎంఎల్ఏ సంపత్ కుమార్ తనకు ఉన్న అనుభవాన్ని, అక్కడి రైతు ల సమస్యలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.


ఈ సమావేశంలో రైతు కమిషన్ సభ్యులు రాము లు నాయక్, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహారెడ్డి, రామనుజేయులు, శ్రీనివాస్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోవిం దు, గద్వాల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.



# జూలై 9న దేశవ్యాపిత సమ్మె విజయవంతం చేయాలి

### కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త సమావేశం విజ్ఞప్తి

ప్రజాపక్షం / హైదరాబాద్: జూలై 9న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను తెలంగాణ రాష్ట్రంలో విజయవంతం చేయాలని కార్మికవర్గానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేష న్ల సంయుక్త కార్యాచరణ సమావేశం కోరింది. ఆరోజు హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు నుండి ఇందిరాపార్కు వరకు వేలాదిమందితో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నిరసన సభ జరుగుతుందని తెలియజేసింది. కార్మికవర్గానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల సంయుక్త సమావేశం సికింద్రాబాద్‌లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో సోమవారం జరిగింది. రాష్ట్రంలోని అన్ని యూనియన్లు ఈనెల 23 వరకు సమ్మె నోటీసులు ఇవ్వాలని, అన్ని యూనియన్లు, సంఘాలు, ఫెడరేషన్లు సదస్సులు, సభలు, సమావేశాలు, మీడియా సమావేశాలు నిర్వహించి జూలై 9న జరగనున్న సమ్మె విజయవంతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. జూన్ 25 నుండి 30లోపు పారిశ్రామిక ప్రాంతాలు, పని ప్రదేశాలు, గ్రామాలు, కాలనీలు, మండల, జిల్లా కేంద్రాలలో సమావేశాలు జరిపి సమ్మె విజయవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో పూర్తిగా సవరించి, కార్పొరేటు పెట్టుబడిదారులకు, బడా వ్యాపారులకు మరింత సంపద దోచిపెట్టేందుకు, 47కోట్ల మంది కార్మికుల జీవితాలను దుర్భరం చేస్తున్నారని విమర్శించారు. కరపత్రాలను ముద్రించి కార్మికులు, ప్రజలలో కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నేతలు ఎం.నరసింహా, శ్రీనివాస్, కృష్ణమూర్తి (ఎఐటియు సి), ఆర్.డి. చంద్రశేఖర్, విజయకుమార్ యాదవ్ (ఐఎన్‌టియుసి), పాలడుగు భాస్కర్, జె.వెంకటేష్ (సిఐటియు), రెబ్బ రామారావు, జి.వి.భాస్కర్‌రావు (హెచ్ఎంఎస్), అనురాధ(ఐఎఫ్‌టియు), ప్రవీణ్ కుమార్(టియుసియు),ఎం.కె.బోస్, ఎబిఆర్ మోహన్‌రావు (టిఎన్‌టియుసి), కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి వి.నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



టిపిసిసి డి లిమిటేషన్ తొలి సమావేశం గాంధీ భవన్‌లో చైర్మన్ సిడబ్ల్యుసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.. ఈ సమావేశంలో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డి లిమిటేషన్ అంశంపైన తీసుకోవాల్సిన విధి విధానాలను చర్చించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే డి లిమిటేషన్ కార్యక్రమంలో దక్షిణ తెలంగాణకు అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని చర్చించారు.

## ‘విశ్వకర్మ యోజన’ వివరాలు సిద్ధం చేయాలి : కేంద్రమంత్రి



ప్రజాపక్షం/హైదారాబాద్ : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి ఎస్ఎల్‌బిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎల్‌బిసి కన్వీనర్, వివిధ బ్యాంకుల జనరల్ మేనేజర్లు, వివిధ ప్రభుత్వ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బ్యాంకుల పనితీరును కేంద్ర మంత్రి సమీక్షించారు. గ్రామీణ అభివృద్ధిలో బ్యాంకుల పాత్రను చర్చించారు. ఇప్పటివరకు మంజూరైన రుణాల వివరాలను బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రుణాలు, పిఎం ముద్రా లోన్లు, పిఎం విశ్వకర్మ యోజన, పిఎం స్వనిధి, స్టాండప్ ఇండియా, ఇతర కేంద్ర పథకాల్లో రుణాల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. బ్యాంకులు ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాల వివరాలు తెలుసుకుని, కేంద్ర పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు ఎలా అందుతున్నాయన్న విషయాన్ని కేంద్ర మంత్రి స్పష్టంగా అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ‘విశ్వకర్మ యోజన’కు సంబంధించి పూర్తి వివరాలు తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.



## ‘కాళేశ్వరం’పై బండి సంజయ్ అసత్య ప్రచారం

ప్రజాపక్షం/హైదారాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ అసత్యాలను ప్రచార ం చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంఎల్‌సి డాక్టర్ దాసోజు శ్రవణ్, ఎంఎల్‌ఏలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కె. సంజయ్‌తో కలిసి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందా?, లేదా ఎన్‌డిఎ ప్రభుత్వం కొనసాగుతుందా? అనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. కెసిఆర్ ఇంకా సిఎంగా ఉన్నారనుకుని బండి సంజయ్ ప్రతి రోజూ బిఆర్ ఎస్‌పై విమర్శలు చేస్తున్నారా? అని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ తమ్మిడి హట్టి దగ్గర 165 టిఎంసిల నీళ్లు ఉన్నాయని సిడబ్ల్యూసి నివేదికను చదివి వినిపించారని, కానీ ఆ నివేదికలో కొద్ది భాగం మాత్రమే బండి చదివి వినిపించారని, ఆ పత్రంలోనే 63 టిఎంసిలు ఇతర రాష్ట్రాలకు కేటాయించామని, తెలంగాణకు కేవలం 44 టిఎంసిలే అని ఉన్నదని గంగుల వివరించారు. బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, కేవలం కెసిఆర్‌ను తిట్టడానికే బండి సంజయ్ పుట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ వాస్తవాలు దాచి కెసిఆర్‌పైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం,మహారాష్ట్ర రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వమే ఉన్నదని, తమ్మిడి హట్టి వద్ద 152 మీటర్ల వరకు అనుమతులు తీసుకురావాలని ఆయన బండి సంజయ్‌కి సూచించారు.

### తెలంగాణ ఉద్యమకారుల ఫోన్లు ట్యాప్ చేసిన కెసిఆర్, హరీశ్‌ను

# తక్షణమే అరెస్ట్ చేయండి

### తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక

ప్రజాపక్షం/హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గంలో కెసిఆర్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే, ‘మీ సంగతి’ చూస్తామని 2018 శాసనసభ ఎన్నికల్లో తమను హరీశ్‌రావు నివాసంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి బెదిరించారని తెలంగాణ అమరవీరుల కుటుంబాల రాష్ట్ర ఐక్యవేదిక, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎం.రఘుమారెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోన్లను ట్యాపింగ్ చేసి, అనేక చిత్ర హింసలకు గురిచేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై సమగ్రంగా విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఫోన్ ట్యాపింగ్ ప్రత్యేక విచారణ అధికారుల బృందానికి ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన కెసిఆర్, హరీశ్‌రావును, వారి అనుచరులను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. ఎవరు ఏం చేస్తున్నారో తమకు అంతా తెలుసని హరీశ్‌రావు తెలంగాణ ఉద్యమకారులను బెదిరించారని, తమ ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎన్నికల సమయంలో తెలంగాణ అమర వీరులు గజ్వేల్‌కు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో కూడా 500ల మందితో నామినేషన్లు వేసేందుకు ప్రయత్నిస్తే ఉద్యమకారుల ఫోన్ ట్యాపింగ్ చేసి, అనేక చిత్రహింసలకు గురిచేశారని, మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా తమ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు, వారి అనుచరులపైన చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కెసిఆర్ పాలనలో రాజకీయ నాయకులు, జర్నలిస్టు లు, ఉద్యోగ సంఘాల నాయకుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారన్నారు. ఇంటలిజెన్స్ విభాగాన్ని తమ స్వార్ధ రాజకీయాల కోసం వాడుకుని, ప్రత్యర్థులపైన అక్రమంగా నిఘా వేశారని, ఐపిసి, టెలికమ్యూనికేషన్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలకు మరోసారి తావు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ పూర్తయిన తర్వాత ఆ నివేదికను ప్రజల ముందు పెట్టాలని కోరారు.

# ఎన్నికల హామీల అమలుకు డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని దళిత హక్కు ల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం సమితి అధ్యక్షులు కె.ఏసురత్నం అధ్యక్షతన హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహద్దూర్ గౌర్ హాల్‌లో జరిగింది. సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళితుల సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేశారని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఒక్క లబ్ధిదారునికి కూడా రుణం ఇచ్చే పరిస్థితి లేదని, పారిశ్రామిక రుణాలను నిలిపివేశారని, గత నాలుగేళ్లుగా సబ్సిడీలు రావడంలేదని అన్నారు.

ఉపాధి పనులు పేదలకు దొరకడంలేదని, తగిన కూలీ ఇవ్వడంలేదని, అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, నిరుద్యోగ యువతకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందుబాటులో లేదని ప్రభుత్వ దవాఖానాలలో సర్వేలు నిర్వహించి పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడానికి పోరాడుతామన్నారు.

ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దళితులకు మొద టి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, అర్హులైన వారందరికీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి గురుకులాలను రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాల విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రాజ్ కుమార్, జె.కుమార్‌స్వామి, కె.సహదేవ్, వై. ఉష శ్రీ, టి.రామకృష్ణ, కె.రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి

# వేగంగా స్థలాల గుర్తింపు ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు అంగన్‌వాడీ భవనాల చొప్పున నిర్మించాలని లక్ష్యంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ధారించుకుంది. భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాల గుర్తింపును వేగంగా పూర్తి చేస్తుంది. గత ఏడాది నవంబర్‌లో లక్ష్యంగా నిర్దేశించుకోగా, స్థలాల గుర్తింపు, బదిలీ చేయడంలో జాప్యం కారణంగా అనుకున్న స్థాయిలో భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే గ్రామపంచాయతీ(జిపి) భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణాల కోసం స్థలాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పురోగతిని ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ కమిషనరేట్ అధికారులు, జిల్లా డిఆర్‌డిఏలతో సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో మొదటి త్రైమాసికంలోనే భవనాల నిర్మాణంకోసం స్థలాలను గుర్తించా రు. మొత్తం ఈ ఏడాది 1148 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటికే 813 అంగన్‌వాడీ భవనా ల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మరో 98 చోట్ల స్థలాలను గుర్తించాల్సి ఉందని అధికార వర్గాలు చెప్పుతున్నాయి. మిగిలిన భవనాలకు సంబంధించి గతంలో భవనాల నిర్మాణం మొదలు పెట్టగా అవి వివిధ దశల్లో ఉన్నాయి.

**జి.పి భవనాలకు స్థలాల గుర్తింపుకు ఆటంకాలు..**

ఇక జి.పి భవనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి మండలానికి రెండు చొప్పున మొత్తం 1144 జి.పి భవనాల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంగా మొదటి త్రైమాసికం ముగియక ముందే 549 గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మిగిలిన 84 చోట్ల ఇంకా స్థలాలను గుర్తించాల్సి ఉంది. మిగిలిన గ్రామాల్లో జి.పి భవనాల నిర్మాణా లు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రధానంగా యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి వంటి హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాలున్న ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో స్థలాల గుర్తింపున కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ జి.సృజన జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడుతూ స్థలాల గుర్తించి, అప్పగించాల ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో స్థల సేకరణ పూర్తవుతుందన్న నమ్మకంతో అధికారులు ఉన్నారు.

**ప్రత్యేక డిజైన్‌లతో భవనాల నిర్మాణం..**

జి.పి భవనాలు, అంగన్‌వాడీ భవనాలకు యూనిక్ మోడల్ ఉండాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ఆయా భవనాలను చూడగానే ప్రజలు అవి జి.పి భవనాలని, అంగన్‌వాడీ భవనాలని గుర్తించేలా ఉండేలా డిజైన్ రూపొందించాలని ఆదేశించా రు. దీంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం జి.పి భవనాలకు, అంగన్‌వాడీలకు వేర్వేరుగా డిజైన్లు రూపొందిస్తున్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణకోసం రూ. 20 లక్ష లు ఖర్చు చేయనున్నారు. అంగన్‌వాడీ భవనం కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా రూ. 8లక్షలు, 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులు రూ.2లక్షలు, మహిళా శిశు సంక్షేమం నుంచి రూ.2లక్షల నిధులు మొత్తం కలిపి రూ.12లక్షలు వెచ్చించనున్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేయ డం ద్వారా వచ్చే మార్చి నాటికి మొత్తం 1148 జి.పి భవనాలు, 1148 అంగన్‌వాడీ భవనాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది.

**పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క**

స్థలాల గుర్తింపు ప్రక్రియ చివరి దశలో ఉన్న నేపథ్యంలో, త్వరలో నూతన భవనాలకు శంకుస్థాపన చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. చివరి త్రైమాసికంలో భవనాల నిర్మాణాలు చేపట్టడంతో పనులు పెండింగ్‌లో మిగిలిపోతున్నాయన్నారు. అందుకే ఈ దఫా మొదటి త్రైమాసికంలోనే స్థలాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

యునిక్ డిజైన్‌తో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నూతన జి.పిలు, అంగన్‌వాడీ భవనాల కోసం వేగం గా స్థలాలు గుర్తించడానికి కృషి చేసిన శాఖ అధికారులను, జిల్లా కలెక్టర్లకు మంత్రి అభినందనలు తెలిపారు.


**టెన్త్ మెమో పోయినది**

నా క్లయింట్ అనగా, **పుప్పాల రాకేష్ S/o రాజా రెడ్డి,** గ్రామం సిర్పూర్, మండలం మల్లాపూర్, జిల్లా జగిత్యాల. తేదీ: 21.06.2025 రోజున మెట్‌పల్లి నుండి సిర్పూర్ గ్రామానికి వచ్చే క్రమంలో **టెన్త్ మెమో నెం. 1234113457** ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను పోగొట్టుకున్నాడు. ఎంత ప్రయత్నించినా దానిని కనుగొనలేక పోయాడు. ఇట్టి విషయంపై మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా దొరికినచో పై చిరునామాలో తెలియజేయగలరు. సెల్: 8466024280.

సం/- ఒజ్జల శ్రీనివాస్
అడ్వకేట్, నోటరీ

**పాస్‌పోర్టు పోయినవి**

నా క్లయింట్ అనగా, **తెనుగొండ సాయిలు S/o ఎల్లయ్య,** గ్రామం గుండంపల్లి, మండలం మల్లాపూర్, జిల్లా జగిత్యాల. ఇంటి సామాను షిఫ్ట్ చేస్తున్న సమయంలో పాస్‌పోర్ట్ ఎక్కడో పోయింది. ఇట్టి విషయమై మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో, జగిత్యాల ఎస్పీ కార్యాలయంలో 17.06.2025 రోజున ఫిర్యాదు చేశారు. ఎవరికైనా దొరికినచో పై చిరునామాలో తెలియజేయగలరు. సెల్: 8106897342.

సం/- ఒజ్జల శ్రీనివాస్
అడ్వకేట్, నోటరీ

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

**NIT No.** 13, **పని పేరు:** జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో 03 పనులకు RCC బాక్స్ డ్రెయిన్ కూల్చివేత మరియు మరమ్మతులు, ప్రస్తుత BT రోడ్డు విస్తరణ మరియు రైజింగ్ ఆఫ్ పాత్‌వేస్, **అంచనా విలువ / ఇసివి:** రూ.31.15 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 25.06.2025న మ.2.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 28.06.2025న మ.2.45గం.ల వరకు, **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి, సెల్ నెం. 9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్),
DIPR R.O. No. : 4027-PP/CL/ADVT/1/2025-26, Date: 23-06-2025 జిహెచ్ఎంసి.

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.యస్.యస్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 23.06.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:30.06.2025 సోమవారము రోజున ఉ.11.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 04.07.2025 నుండి 03.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
DIPR R.O. No. : 3999-PP/CL/ADVT/1/2025-26, Date: 23-06-2025 కార్యనిర్వహణాధికారి

**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయం,**
బోయినపల్లి, సికింద్రాబాద్.

నెం. వ్య.మా.క.బో/ఎస్ట్ /టెండర్/136/2023-24 టెండరు నోటీసు తేది: 23.06.2025

ఇందుమూలముగా తెలియపరచునది ఏమనగా, వ్యవసాయ మార్కెట్ కమిటి, బోయినపల్లి నందు ఈ దిగువ పనికి కేటాయించిన తేది నుండి ఒక సంవత్సరము కాలమునకు నిర్వహణ కొరకై సీలు వేసిన టెండర్లు ఈ మార్కెట్ కమిటీ కార్యాలయమునందు తేది: 01.07.2025న మధ్యహ్నం 12.00 గం.ల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 12.30 గం.కు హాజరయిన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. ఇందుకు సంబంధించిన టెండరు షెడ్యూళ్లు తేది: 24.06.2025 నుండి తేది: 30.06.2025 తేదీలలో దరఖాస్తు ద్వారా మార్కెటు కమిటి కార్యాలయము నుండి పొందవచ్చును.

| క్ర.సం. | కాంట్రాక్టు పేరు | ఈ.యం.డి. విలువ | దరఖాస్తు విలువ |
|---|---|---|---|
| 1 | మార్కెట్ యార్డులో ఫాగింగ్ నిర్వహణ | రూ. 1,00,000/- | రూ. 2,000/- |

ఎట్టి కారణము లేకుండానే టెండరు ప్రక్రియను నిలుపుదల చేయుటగాని లేదా రద్దు పరుచుటగాని మార్కెట్ కమిటికి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయము పని వేళలలో స్వయముగా గాని లేదా ఫోన్ నెం. 7330733208 ను సంప్రదించి తెలుసుకొనవచ్చును. ॥నిజాప్రతి॥

సం/- (యం. వెంకన్న),
ఉన్నత శ్రేణీ కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి,
DIPR R.O. No. : 4021-PP/CL/ADVT/1/2025-26, Date: 23-06-2025 బోయినపల్లి.

ప్రజాపక్షం
మంగళవారం, 24 జూన్

# ఇరాన్‌పై ట్రంప్ టెర్రర్

ఇరాన్ అణు కార్యక్రమాన్ని నాశనం చేయటం ద్వారా మధ్య ప్రాచ్యంపై తమ అనుంగు మిత్ర దేశం ఇజ్రాయెల్‌కు తిరుగులేని ఆధిపత్యం కట్టబెట్టే వ్యూహాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిస్సిగ్గుగా అమలు చేస్తున్నాడు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి చాప్టర్‌ను బరితెగించి ఉల్లంఘించి ఇరాన్ అణు శుద్ధి వసతులపై అమెరికన్ స్టీల్త్ బాంబర్లతో ప్రత్యక్ష బాంబుదాడులకు బాహాటంగా ఒడిగట్టాడు. ఇన్నాళ్లు ఇజ్రాయెల్ దుందుడుకు కృత్యాలకు వెనుక నుంచి మద్దతిస్తున్న, వీటో అధికారాన్ని ఉపయోగించి ఐరాస భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌పై ఈగ వాలకుండ కాపాడుతూ వస్తున్న అమెరికా, అధ్యక్షుడు ట్రంప్ రెండవ టరంలో ముసుగు తొలగించుకుని తానే స్వయంగా దురాక్రమణ పూరిత విధ్వంసక దాడులకు పాల్పడింది. ఒకపక్క పాలస్తీనియన్‌లకు చెందిన గాజా ప్రాంతాన్ని సర్వనాశనం చేస్తున్న ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని కప్పిపుచ్చుకుంటూ శాంతి వచనాలు పలుకుతున్న ట్రంప్ వత్తాసుతో రెచ్చిపోతున్నది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేయడమే పనిగా, ఎటువంటి కవ్వింపు లేకుండా ఇజ్రాయెల్ 13 రోజుల క్రితం ఇరాన్ అణు వసతులున్న ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. అయితే తమ అణుశుద్ధి కార్యక్రమాన్ని విడనాడుతూ ఇరాన్ తాము గీత గీసిన చోట సంతకం చేయాలని కోరుకుంటున్న ట్రంప్ ఆశించింది జరగలేదు. తమకు భారీ నష్టాలు జరిగినప్పటికీ ఇరాన్ తలవంచలేదు. ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో ఎదురుదాడి సాగిస్తున్నది. ఇరాన్ ఇప్పటికైనా తమతో ఒప్పందానికి రావాలని ట్రంప్ హెచ్చరించినా ఇస్లామిక్ ప్రభుత్వ నాయకత్వం లొంగుబాటు ప్రదర్శించలేదు. ఓర్మి నశించిన ట్రంప్ తమ స్టీల్త్ బాంబర్లను, బంకర్ బస్టర్ బాంబుల సామర్థ్యాన్ని పరిరక్షించాలనుకున్నాడో ఏమో అర్ధరాత్రి దాడులను ఆదేశించాడు. ఇప్పటికైనా ఒప్పందానికి రాకపోతే సర్వనాశనం తప్పదని హెచ్చరికతో పాటు ఇరాన్ నాయకత్వాన్ని మార్చుతామనే (ఇరాక్‌లో లాగా) ఉద్దేశాన్ని వెల్లడించాడు ట్రంప్. ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధానికి ఇప్పుడు ఇరాన్‌పై బాంబు దాడులకు పోలిక ఉంది.

గతంలోకి వెళ్తే అధ్యక్షుడు బుష్ టెర్రరిజం నిర్మూలన పేరుతో 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధానికి ఒడిగట్టిన తదుపరి 'ప్రభుత్వాల మార్పు' అంటూ ఇరాక్, లిబియాలపై సైనిక దాడి చేశాడు. 21 సంవత్సరాల ఆక్రమణ తదుపరి అమెరికా సైన్యాలు ఆఫ్ఘాన్ నుండి ఆకస్మికంగా విరమించుకోగా తాలిబన్‌లు తిరిగి అధికారం స్వాధీనం చేసుకున్నారు. అమెరికా దాడుల తదుపరి ఇరాక్ (2003), లిబియాల్లో (2011) అస్థిరత, అరాచకం కొనసాగుతున్నాయి. ఇరాన్ ఒప్పందానికి రాకపోతే దురాక్రమణ యుద్ధానికి దిగి, ఇస్లామిక్ విప్లవ అధినేత మత నాయకుడు అయతుల్లా ఖమేనీని కూలదోసి (హతమార్చి) కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నది ట్రంప్ హెచ్చరిక సారాంశం.

ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఆది నుంచీ ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఐరాస ఆర్థిక ఆంక్షలు విధించింది. సుదీర్ఘమైన చర్చల అనంతరం, 2015లో ఇరాన్ తమ అణు కార్యక్రమంపై కఠినమైన పరిమితులకు అంగీకరిస్తూ పి5+1 దేశాలతో సంయుక్త సమగ్ర కార్యచరణ ప్రణాళిక (జెసిపిఒఎ)పై సంతకం చేసింది. భద్రతా మండలిలోని 5 శాశ్వత సభ్య దేశాలు—చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్‌ఏ ప్లస్ జర్మనీ ఆ ఒప్పందం భాగస్వాములు. పర్యవసానంగా ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఐరాస సడలించింది. అయితే డోనాల్డ్ ట్రంప్ తొలి దఫా అధ్యక్షునిగా ఎన్నికైన తదుపరి, 2018లో ఆ అంతర్జాతీయ ఒప్పందం నుంచి అమెరికాను ఉపసంహరించి, ఆంక్షలు విధించాడు. ఇప్పుడు రెండవసారి అధ్యక్షుడైనాక ఇరాన్ అణు కార్యక్రమం ధ్వంసం లేదా ఇరాన్‌కు వినాశం అనే మొండి వైఖరి చేబట్టాడు. కాబట్టి ఈ యుద్ధం ఎంత కాలం సాగుతుందో, పర్యవసానమేమిటో వేచి చూడవలసిందే.

అయితే తమ లక్ష్యాల సాధనకై ప్రత్యర్థులపై సైనిక బలాన్ని ఉపయోగించే ఆటవిక నీతి అత్యంత గర్హనీయం. అందునా ప్రపంచ నాయకుడినని విర్రవీగుతున్న అమెరికా పాలకులు అందుకు ఒడికట్టడం అంతర్జాతీయ సంబంధాలలో రాజ్య టెర్రరిజం అవుతుంది. ఇరాన్‌పై అమెరికా దాడిని సమర్థించిన దేశాలు బహు తక్కువ—కానీ తప్పుని తప్పు అని గట్టిగా చెప్పిన దేశాలనూ వ్రేళ్లపై లెక్కించవచ్చు— సంయమనం పాటించాలి, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సన్నాయి నొక్కులు నొక్కిన నేతలే అత్యధికులు. ట్రంప్ తాను చెప్పుకుంటున్నట్లు శాంతిదూతనా, యుద్ధోన్మాదియా? పాకిస్తాన్ నామినేట్ చేసినట్లు నోబెల్ శాంతి బహుమతికి పాత్రుడా, అపాత్రుడా? ఒకపక్క సుంకాల యుద్ధం, రెండోవైపు మిలటరీ యుద్ధం. ట్రంప్ ఏలుబడిలో అంతర్జాతీయ సంబంధాలు అధోగతి.

# మరింత దిగజారిన లింగ అంతరం: జిడిపికి అపారనష్టం!



ఎం. కోటేశ్వరరావు

ఇన్ని మంచి విషయాలు చెప్పారు కదా మీ వాడిలో ఉన్న రెండు లోపాలు చెబుతారా అని పిల్లనివ్వటానికి వచ్చిన పెద్దలు తండ్రిని అడిగారట. ఓస్ అంతేనా ఒకటి వాడికి తెలియదు, రెండు ఇతరులు చెప్పేది వినడు అన్నాడట. కొందరు పాలకులను చూస్తుంటే అదే అనిపిస్తోంది. పదకొండు సంవత్సరాల నరేంద్రమోదీ పాలన విజయోత్సవాలంటూ బిజెపి, దాని మిత్రపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయి. సగం మందిగా ఉన్న మహిళల స్థితి బాగుపడకుండా ఎన్నికబుర్లు చెప్పినా అది నిజమైన వృద్ధి కాదు. పచ్చి నిజం ఏమిటంటే నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత దేశంలో లింగఅంతరం తగ్గలేదు కదా, అంతకుముందు ఉన్నదానికంటే దిగజారింది. దీనివలన జిడిపికి జరుగుతున్న నష్టం మామూలుగా లేదు. 2015లో మెకెన్సీ గ్లోబల్ సంస్థ చెప్పినదాని ప్రకారం (2015 సెప్టెంబరు 25వ తేదీ టైమ్స్ ఆఫ్ ఇండియా) పురుషులతో సమంగా ఉపాధి, సమానపనికి సమానవేతనం గనుక అమలు జరిపితే ప్రపంచ జిడిపికి 2025నాటికి 12లక్షల కోట్ల డాలర్లు తోడవుతుందని, దానిలో ఎక్కువ మొత్తం 2.9లక్షల కోట్ల డాలర్లు భారత్‌లో తోడవుతుందని స్పష్టంగా పేర్కొన్నది. అది నాటి వేతనాలు, ద్రవ్యోల్బణం తదితరాల ప్రాతిపదికన వేసిన అంచనా అది. ఈ మొత్తం ఇప్పుడు అంచనా వేస్తున్న 4.187లక్షల కోట్ల డాలర్లకు అదనం, జర్మనీని కూడా దాటి మూడో స్థానంలోకి వెళ్లిపోయి ఉండేది. అసమానతల తగ్గింపు కృషికి మోదీని ఎంపిక చేసినట్లు చెప్పటం మరొక ప్రహసనం. అధికారానికి వచ్చిన మూడేండ్లకే అలాంటి నిర్ణయానికి సియోల్ బహుమతి ఎంపికదార్లు ఎలా వస్తారు. ప్రధాని నరేంద్రమోదీకి 2018 సియోల్ (దక్షిణ కొరియా) శాంతి బహుమతి ఇచ్చారు. దేని కటా! 2018 అక్టోబరు 24వ తేదీ మన విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో పెట్టిన సమాచారం మేరకు మోడినోమిక్స్ ద్వారా ప్రపంచ ఆర్థిక పురోగతిని పెంచటానికి, ఆర్థిక వృద్ధితో భారతీయుల మానవాభివృద్ధిని వేగవంతం చేసేందుకు, ప్రజాస్వామ్య వృద్ధి, దేశంలో పేదలు, ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చేసిన కృషిని బహుమతి కమిటీ గుర్తించి ఎంపిక చేసిందని పేర్కొన్నారు.

పదేండ్ల అనుభవం ఏమిటి ? 1961లో మన దేశంలో ధనికులుగా ఉన్న ఎగువ ఒకశాతం మంది వద్ద జాతీయ సంపదలో 12.9శాతం పోగుపడితే అది ఇప్పుడు 40శాతం దాటింది. నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన 1991లో 20శాతంగా ఉన్న కేంద్రీకరణ మోదీ అధికారానికి వచ్చే నాటికి 30శాతానికి చేరింది, మోదీ దాన్ని 40శాతానికి చేర్చారు, అసమానత తగ్గింది ఎక్కడ? దిగువ 50శాతం మంది సంపద 1961నుంచి 2023 మధ్య 11.4 నుంచి 6.5శాతానికి దిగజారింది, మధ్యతరగతి అనుకొనేవారిది కూడా 43.7 నుంచి 29శాతానికి దిగజారింది, అంటే వారు కూడా పేదల్లోకి వచ్చారు. చిత్రం ఏమిటంటే ఇంత అసమానతలు పెరుగుతుంటే నిష్టదారిద్ర్యం నుంచి పాతిక కోట్ల మందిని మెరుగైన స్థితిలోకి నెట్టామని చెప్పుకుంటున్నారు. ఇదొక ప్రహసనం, అంకెల గారడీ !

కేంద్రంలోనూ, మెజారిటీ రాష్ట్రాలలో మేము, మా మిత్రులు ఉన్నాం అని చెబుతున్న నరేంద్రమోదీ గుజరాత్ సిఎంగా అనుభవం ఉన్నప్పటికీ మెకెన్సీ నివేదిక చెప్పిందేమిటో అర్ధం కాలేదా, వారేమిటి మాకు చెప్పేది అని ఖాతరు చేయలేదా? ఇంతవరకు లింగ అంతరం, ఆర్థిక అసమానతల తగ్గింపునకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? మోదీ విజయగీతాలాపనలో తలమునకలుగా ఉన్న మీడియాలో ఎక్కడా దీని ప్రస్తావన కనిపించదు, వినిపించదు. 2014లో ప్రపంచ ఆర్థికవేదిక విడుదల చేసిన నివేదిక ప్రకారం లింగఅంతరంలో 142 దేశాల్లో మన స్థానం 114, వచ్చిన పాయింట్లు 0.6455 కాగా అదే సంస్థ విడుదల చేసిన 2025 నివేదికలో 148దేశాలకు గాను 131వ స్థానంలో ఉన్నాం, వచ్చిన మార్కులు 0.644, గతం కంటే తగ్గాయి. జపాన్ కంటే ఈ ఏడాది కొన్నివేల కోట్ల డాలర్లు ఎక్కువగా ఉండి నాలుగో స్థానంలోకి వస్తుందన్న అంచనాలను చూసి పండగ చేసుకున్న వారు లింగ అంతరం దిగజారటం గురించి మాట్లాడరేం ! మహిళలంటే చిన్నచూపు, నిర్లక్ష్యం, దీని గురించి చర్చ జరిగితే మోదీ విజయ బండారం బయటపడుతుందని తప్ప మరొక కారణం ఏముంది ?

పదకొండు సంవత్సరాలుగా ఎన్ని కబుర్లు చెప్పినా తరతరాలుగా జరుగుతున్న అన్యాయానికి అంతం లేదు. ఉట్టికొట్టలేనయ్య స్వర్గానికి ఎగురుతాడా అన్నట్లుగా 2047నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతానని చెబుతున్నారు. లింగ అంతరం అంటే స్త్రీ, పురుషుల మధ్య ఉన్న సమానత్వంలో ఉన్న తేడా మదింపు. అవకాశాలు, విద్య, ఆరోగ్యం, రాజకీయ సాధికారత, బతికి ఉండటం సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇచ్చే మార్కుల ఆధారంగా సూచికలను తయారు చేస్తారు, వాటికి ఆయా దేశాలు ఇచ్చే సమాచారమే ప్రాతిపదిక. ఆర్థికభాగస్వామ్యం, విద్య, వైద్యం, రాజకీయ సాధికారత అనే నాలుగు అంశాలపై విడివిడిగా సూచికలు రూపొందిస్తారు, వాటన్నింటిని కలిపి సాధారణ లింగఅంతర సూచికను తయారు చేస్తారు. వీటిలో కొన్ని పెరుగుదల తగ్గుదల ఉన్నప్పటికీ పది సంవత్సరాలలో మొత్తం మీద స్వల్ప తగ్గుదల నమోదైంది. పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బిల్లు ఆమోదించినప్పటికీ గత ఎన్నికలలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. అందువలన మహిళా సాధికారత సూచికలో 2023 కంటే 2025లో 14.7 నుంచి 13.8కి పాయింట్లు తగ్గిపోయాయి. మహిళలకు మంత్రి పదవులు కూడా 6.5 నుంచి 5.6శాతానికి పడిపోయాయి. మరోవైపు త్వరలో జిడిపిలో మూడో స్థానానికి ఎదుగుతాం, అభివృద్ధి చెందిన దేశంగా మారనున్నాం అని అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు మన ఇరుగు పొరుగుదేశాల స్థితి గతులను చూద్దాం. అన్నింటికంటే అధమ స్థానంలో ఉన్న పాకిస్తాన్‌తో 148తో పోల్చుకుంటే 131లో మెరుగ్గా ఉన్నాం. తాజా సూచికలో ఏకంగా 75 స్థానాలను మెరుగు పరచుకొన్న బంగ్లాదేశ్ 24, చైనా 103, భూటాన్ 119, నేపాల్ 125, శ్రీలంక 130, మాల్దీవులు 138వ స్థానంలో ఉన్నాయి.

> **భేటీ పడావో బేటీ బచావో (ఆడపిల్లల్ని చదివించండి, ఆడపిల్లల్ని రక్షించండి) అంటూ పదేండ్ల క్రితం పెద్దగా ఒక పథకాన్ని నరేంద్రమోదీ ప్రారంభించారు. దానికి కేటాయించిన నిధులే స్వల్పం కాగా ఆ మొత్తాన్ని కూడా ఖర్చు చేయటం లేదు. ఆరేండ్లలోపు బాల బాలికల నిష్పత్తి 1961 నుంచి మన దేశంలో పడిపోతోంది. 1991లో ప్రతి వెయ్యి మంది బాలురకుగాను 945 మంది బాలికలు ఉండగా క్రమంగా తగ్గుతూ 2011 నాటికి 918కి పడిపోయింది, తరువాత ఇంతవరకు జనాభా లెక్కలు జరగలేదు గనుక కేవలం అంచనాలు మాత్రమే చెబుతున్నారు. 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అంతకు ముందు 2015–16తో పోల్చితే 919 నుంచి 929 పెరిగిందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 934, తెలంగాణలో 894 మంది ఉన్నారు. కేంద్ర గణాంక శాఖ 2023లో విడుదల చేసిన భారత్‌లో స్త్రీ, పురుషులు అనే నివేదిక ప్రకారం 2036నాటికి ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 952 మంది ఆడ పిల్లలు ఉంటారని అంచనా వేశారు.**

లింగ అంతరంలో ఆడపిల్లలు బతికి బట్టకట్టటాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు, ఈ పథకంలో బేటీ బచావో అన్నా అదే. అందుకే ఈ పథకం వైఫల్యం కూడా అంతరం మరింతగా పతనం కావటానికి దోహదం చేసిందని చెప్పాల్సి వస్తోంది. ఈ పథకానికి కేటాయించిన నిధులతో నరేంద్రమోదీ బొమ్మతో ప్రచారానికే ఎక్కువ ఖర్చు చేశారు. ఏడాదికి రెండు పాయింట్ల చొప్పున మెరుగుదల సాధించాలన్నది లక్ష్యం. అది జరిగినట్లు కనిపించటం లేదు. మహిళా సాధికారతపై పార్లమెంటరీ కమిటీ 2021 సమీక్షలో ఈ పథకానికి కేటాయించిన సొమ్ములో కేవలం 25.13శాతమే ఖర్చు చేసినట్లు, వాటిలో కూడా 80శాతం ప్రకటనలకే వెచ్చించినట్లు, ప్రత్యేకించి పంజాబ్, హర్యానాలతో పాటు అనేక రాష్ట్రాలలో పథక లక్ష్యాలు నెరవేరలేదని కూడా తేలింది. కాగ్ నివేదికలు కూడా దీన్నే సూచించాయి. పదేండ్లు దాటుతున్నా దీని అమలు గురించి సర్వేలే చేయలేదు. 2019లో ప్రభుత్వమే పార్లమెంటుకు ఈ విషయాన్ని చెప్పింది.

2024 లింగ అంతరం నివేదిక ప్రకారం పురుషుడు రూ.100 సంపాదిస్తే అదే పనికి మహిళకు ఇస్తున్నది రూ.39.80 మాత్రమే. ఇది ఒక్క చిన్న చిన్న ఉపాధి, ఉద్యోగాలకే కాదు, టెక్నాలజీ, క్రీడలు, సినిమా రంగాల్లో కూడా ఇదే పరిస్థితి అంటే అతిశయోక్తి కాదు. ప్రఖ్యాత హీరోయిన్ దీపికా పదుకొనె 2021 ఆగస్టులో ప్రతిఫల చెల్లింపులో వివక్షను ప్రశ్నించారు. తన భర్త రణవీర్ సింగ్ ఎంత కష్టపడతారో తానూ అదే చేస్తానని తనకు తక్కువ మొత్తం ఇవ్వచూపినందుకు సంజయ్ లీలా బన్సాలీ సినిమా బైజు బావరాలో నటించేందుకు తిరస్కరించినట్లు ఆమె బహిరంగంగా చెప్పారు. ఆమె ఒక స్థాయికి ఎదిగారు గనుక అలా చెప్పగలిగారు, ఎందరికి అలాంటి అవకాశం ఉంది. నిజానికి ఇది బాలీవుడ్‌లోనే కాదు దేశంలోని అన్ని సినిమా రంగాల్లో, ఇతర చోట్ల ఉంది. హాకీలో పది రెట్లు ఉన్నట్లు ఫెమినిజమ్ ఇండియా నివేదిక అదే ఏడాది పేర్కొన్నది. 2015లో కేరళలో జరిగిన జాతీయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో బహుమతిగా పురుషులకు రూ.1.2లక్షలు, మహిళలకు రూ.50వేలుగా నిర్ణయించటాన్ని నిరసిస్తూ తాను పోటీలలో పాల్గొనటం లేదని దీపికా పాలికల్ నిరాకరించింది. మనదేశ శ్రమశక్తి మార్కెట్‌లో వేతన వ్యత్యాసం పెద్ద సమస్యగా ఉంది. నరేంద్రమోదీ తన మన్‌కీ బాత్‌లో ఎన్నడూ దీని గురించి ప్రముఖంగా ప్రస్తావించినట్లు, తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎక్కడా కనిపించదు. కరోనా సమయంలో అంతకు ముందున్నదానికంటే వేతన వ్యత్యాసం ఏడుశాతం పెరిగిందని పిఎల్‌ఎఫ్‌ఎస్ సర్వే సమాచారం వెల్లడించింది.

ఉద్యోగాల్లో చేరటంలో ఒకే స్థాయిలో 46శాతం ఉన్నప్పటికీ సిఇఒ, సిఎఫ్ఒ, సిఒఒ వంటి ఉన్నత స్థానాల్లో 25శాతానికి మించి మహిళలు లేరని కెపిఎంజి, మరియు ఏఐఎంఏ 2024 సర్వేలో తేలింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్నవారిలో మహిళలే ఎక్కువగా ఉన్నప్పటికీ వారికి సమానవేతనాలు లేకపోవటం ప్రసూతి సెలవు వంటి సామాజిక భద్రత లేని విషయం తెలిసిందే. శ్రామిక మహిళలకు 26వారాల ప్రసూతి సెలవు ఇవ్వాలనే చట్టసవరణ తరువాత అనేక మంది యజమానులు పిల్లల్ని కనేవయస్సులో ఉన్నవారిని పనిలో పెట్టుకోవటం తగ్గించటం లేదా రాజీనామా చేయించి తరువాత చేర్చుకోవటం వంటి పనులకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయి. స్త్రీని దేవతగా పూజించే దేశం కదా! కొన్నిదేశాల్లో తండ్రులకు కూడా పిల్లల సంరక్షణ సెలవులు ఇస్తున్న కారణంగా మహిళల నియామక వివక్ష కొంత మేర తగ్గింది. మనదేశంలో సైతం ఎందుకు దాన్ని ప్రవేశ పెట్టకూడదు? ఒకవైపు పురోగమనంలో ఉన్నామని చెబుతూ మహిళలను అణచివేసిన సనాతన ధర్మాన్ని, మనువాదాన్ని తలకెత్తుకుంటున్న శక్తులు రెచ్చిపోతున్న తరుణంలో పురుషులతో సమంగా స్త్రీలను చూసేందుకు అంగీకరిస్తారా !

# జనాభా కూర్పులో మార్పులు – సవాళ్లు

గ్యాన్ పాఠక్

ఐక్యరాజ్యసమితి సంస్థ అంచనా ప్రకారం భారతదేశ జనాభా పొందిక చాలా శీఘ్రంగా మారుతున్నది. 2025 ఏప్రిల్ నాటికి దేశ జనాభా 146 కోట్ల 39 లక్షలకు చేరినట్లు యుఎన్ఎఫ్‌పిఎ వారి 2025 ప్రపంచ జనాభా స్థితి నివేదిక (ఎస్ఒడబ్ల్యుపి) తెలిపింది. భారతదేశ సొంత నిపుణుల అంచనా 141 కోట్లు. వృద్ధిరేటు అంచనా కన్నా వేగం గా ఉండటం ముందున్న సవాళ్లలో ఒక భాగం మాత్రమే. రానున్న సంవత్సరాల్లో భారతదేశం ఎదుర్కోనున్న అసంఖ్యాక వాస్తవ సమస్యలను ఆ నివేదిక వెల్లడించింది.

కొట్టొచ్చినట్లు కనిపించే మార్పు ఫలదీకరణ రేటు 1.9కి పడిపోవటం. ఇది పునరుత్పత్తి ద్వారా జనాభా రిప్లేస్‌మెంట్ రేటు 2.1 కన్నా తక్కువ. అయినా సుమారు 40 సంవత్సరాల్లో జనాభా 170కోట్లకు చేరి, అక్కడనుండి తగ్గుదల మొదలవుతుంది. అధిక జనాభా, తక్కువ జనాభా అనే దానికన్నా ఫలదీకరణ లక్ష్యాలు చేరుకోలేకపోవటం నిజమైన సంక్షోభం. 2027 మార్చినెలలో జనాభా లెక్కలు సేకరణ ముగిసినపుడు జనాభా గూర్చి కచ్చితమైన సంఖ్యలు తెలుస్తాయి.

దీని అర్థం భారతదేశం ఆకలితీర్చాల్సిన కడుపుల సంఖ్య పెరుగుతుంది. వైద్యం, విద్య, ఉపాధి కల్పనకు అధిక నిధులు అవసరం. భారత్ తన దుర్భర దారిద్ర్యం స్థాయిని 2011–12లోని 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గించిందని ప్రపంచబ్యాంక్ 2025 జూన్ నివేదికలో చెప్పినప్పటికీ, సవాళ్లు కొనసాగుతాయి, వాటిని అధిగమించటం చాలా కష్టం. ప్రపంచబ్యాంక్ దారిద్ర్యరేఖ ఇప్పటికీ రోజుకు రూ.250 (3డాలర్లు). అంతేగాక, వినిమయస్థాయిలో ప్రభుత్వం 80కోట్లమందికి ఇస్తున్న ఉచిత ఆహార ధాన్యాలు సహా సంక్షేమ కార్యక్రమాలు చేరి ఉన్నాయి. జీవనోపాధి మార్గాలు లేనందునే కదా ఆ 80కోట్లమంది ఇప్పటికీ ఆహారధాన్యాలు కొనుక్కోలేని స్థితిలో ఉన్నారు.

సాంఘిక సంక్షేమ పథకాలు దారిద్ర్యాన్ని భరించగల స్థితిలో ఉంచుతాయి. అయితే వాటిని దారిద్ర్య నిర్మూలనగా పరిగణిస్తున్నారు. పేదలు తాము జీవించటానికి అవసరమైన ఆర్జన చేయగలిగినప్పుడే దారిద్ర్యం తగ్గుతుంది. జనాభా పెరుగుదలతో ఈ సమస్యలు అనేక రెట్లు పెరుగుతాయి. అందువల్ల భారతదేశం తన ప్రజలకు ఆహారం, వైద్యం, విద్య, ఉపాధులు లభ్యం చేయటానికి సంసిద్ధం కావాలి.

ఎస్ఒడబ్ల్యుపి ప్రకారం 1970వ దశకంలో భారతదేశంలో మహిళలు సగటున దరిదాపు ఐదుగురు సంతానం కలిగి ఉన్నారు. ఇప్పుడది ఇద్దరికి చేరువలో ఉంది. 31 రాష్ట్రాలు/యుటిల్లో ఫలదీకరణ రేటు రిప్లేస్‌మెంట్ రేటు (2.1) కన్నా తక్కువగా ఉంది. అయితే బీహార్ (3.0), మేఘాలయ (2.9), ఉత్తరప్రదేశ్ (2.7)రేటు హెచ్చుగా ఉంది. పట్టణ–గ్రామీణ వ్యత్యాసం కొనసాగుతున్నది. 7 రాష్ట్రాలు గ్రామీణ ప్రాంతాల్లో రిప్లేస్‌మెంట్ ఫెర్టిలిటీ రేటును చేరుకోవాల్సి ఉంది. (రిప్లేస్‌మెంట్ రేటు అంటే చనిపోయేవారి సంఖ్యను జననాలు భర్తీ చేయటం).



ఈ వ్యత్యాసాల్లో ఇతర కోణాలూ ఉన్నాయి. అనేకమంది సంతానం కోరుకుంటారు, అయితే వారు కోరుకున్నప్పుడు పిల్లలు పుట్టరు. ఇతరులు గర్భధారణ కూడదనుకుంటారు, కాని నివారించలేరు. ఈ రెండు సమస్యలను చాలా మంది తమ జీవితకాలంలో ఎదుర్కొంటారు. కౌమార ప్రాయంలో గర్భధారణ రేటు హెచ్చుగా 15–19 సంవత్సరాల మహిళలు 1000 మందికి 14.1గా ఉంది. ఇది తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదకరం, అంతేగాక విద్య, ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తుంది.

సంతానోత్పత్తి కోరుకోకపోవటానికి ఆర్థిక అభద్రత ప్రధాన ప్రతిబంధకంగా ఉంది. 10మందిలో నలుగురు దీన్ని ప్రధాన కారణంగా చెప్పారు. ఇంటి సమస్యలు (22 శాతం), ఉద్యోగ అభద్రత (21శాతం), పిల్లల్ని పెంచే శక్తి లేకపోవటం (18శాతం), ఆరోగ్య కారణాలు (15శాతం), గర్భధారణ జరగకపోవటం (13శాతం), గర్భసంబంధ సంరక్షణలు తగినంతగా లేకపోవటం ఇతర కారణాలు. భారత జనాభాలో 3.9శాతం నుంచి 16.8 శాతం వరకు గర్భధారణ రహిత స్థితిని ఎదుర్కొంటున్నారని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. మరో వైరుధ్యం–బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కోరుకోని గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం లేకపోవటం సర్వసాధారణంగా ఉండ గా, తమిళనాడు, కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో అనేకమంది దంపతులు ఖర్చులు, ఉద్యోగ పని ఒత్తిళ్ల కారణంగా సంతానాన్ని వాయిదా వేసుకుంటున్నారు. లేదా ఎడం పెంచుతున్నారు. గర్భధారణ రహిత సమస్యలకు భారతదేశం ప్రాధాన్యత ఇవ్వటంలేదు. ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాల్లో దీన్ని చేర్చాలి. 2 కోట్ల 75లక్షల మంది దంపతులు గర్భధారణకు నోచుకోవటంలేదని అంచనా. అయినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు పరిమితం. ప్రైవేటు వైద్యం ప్రధానంగా పట్టణాలకు పరిమితం, వ్యయం అపరిమితం. గర్భధారణ సంభవించకపోవటం భార్యాభర్తలు ఇద్దరి సమస్య అయినప్పటికీ సామాజిక దూషణ ఆడవారిపైనే (గొడ్రాలు) పరుషంగా ఉంటుంది. భారతదేశంలో భవిష్యత్ గూర్చి ఉన్న ఆందోళనలు సంతానోత్పత్తికి ఒకరకంగా అవరోధమవుతున్నాయని సుమారు 30శాతం మంది చెప్పినట్లు ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొన్నది. అన్ని జీవనరంగాలకు, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు సంబంధించిన బహుముఖ సవాళ్లను సంఖ్యలు దాచిపెడుతున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ఉదాహరణగా సామాజిక – రాజకీయ సవాలును నివేదిక ప్రస్తావించింది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయటాన్ని నిషేధించిన గత చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు రద్దు చేసింది. కుటుంబ నియంత్రణను విజయవంతంగా పాటించినందుకు తమ పార్లమెంటు సీట్లు తగ్గుతున్నాయని దక్షిణాది రాష్ట్రాలవారు గోసపెడుతున్నారు. లింగ సమానత్వం, మానవహక్కులు, వనరుల పంపిణీ, జనాభా పొందికను బట్టి ప్రత్యేక శ్రద్ధ వంటి సవాళ్లున్నాయి. ఉదాహరణకు 2025లో 0–14 వయోగ్రూపులో బాలల జనాభా 24శాతంగా, 10– 19 వయో గ్రూపులో 17శాతంగా, 10–14 గ్రూపులో 24శాతంగా, 15–64 వయో గ్రూపులో జనాభా 68శాతంగా, 65సంవత్సరాలకు పైన 7శాతంగా ఉన్నారు. కాబట్టి జనాభా పొందికలో వృద్ధుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వారి కోసం పథకాలతో ప్రభుత్వం సిద్ధం కావాలి. మనదేశ జనాభా చాలాపెద్దగా ఉన్నందున దాని జనాభా మార్పు సవాళ్లు కూడా పెద్దగానే ఉంటాయి. అధిక జనాభాను అధిక ప్రయోజనదాయకంగా దేశం మలుచుకోవాలి.

(ఐపిఎ సర్వీస్)

# డిఇఒలను నియమించండి.. పర్యవేక్షణ పెంచండి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరగా 2011లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేశారు. వారంతా ప్రస్తుతం ప్రమోషన్లు పొంది ఉన్నత హోదాలో ఉన్నారు. వారిలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా పని చేస్తున్న జి. రమేష్, అడల్ట్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న జి.ఉషారాణి, ఇతర ఉన్నత హోదాలో ఉన్న సోమిరెడ్డి, ఎ. సుబ్బారెడ్డి తదితరులను ఈ సందర్భంగా ఉటంకించవచ్చు. వీరంతా అప్పటి నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన వారే. అప్పటినుండి ఇప్పటివరకు ఆ పోస్టులు మళ్లీ భర్తీకి నోచుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లందరూ ఇన్‌ఛార్జిలే కావడం గమనార్హం. అట్లే 612 మండలాలలో 90 నుంచి 95 శాతం వరకు ఆయా మండలాలలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులుగా ఇన్‌ఛార్జ్ విధులు నిర్వహిస్తున్నారు. వారంతా ఒకపక్క పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూ అదనంగా మండల విద్యాశాఖ అధికారులుగా కొనసాగుతున్నారు. వీరే కాకుండా 33 జిల్లాలకు గాను 26 జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఇన్‌ఛార్జిలే ఉండడం వల్ల విద్యాశాఖలో పర్యవేక్షణ పడకేసిందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయునికి మండల విద్యాధికారిగా ఇన్చార్జ్ బాధ్యతలను ఇవ్వడం వల్ల తన బడికి హెడ్‌మాస్టర్‌గానే కాకుండా తరగతి బోధకుడిగా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, పిఎం శ్రీ నోడల్ అధికారిగా ఇలా బహుళ పాత్రలను పోషించాల్సిన పరిస్థితి రావడంతో సొంత పాఠశాల పర్యవేక్షణ గాల్లో దీపంగా మారిపోయింది. పైపెచ్చు పెరిగిన పని ఒత్తిడి వల్ల బోధన చేయడం సాధ్యం కాకుండా పోతుంది. ఫలితంగా ఉపాధ్యాయుల పనితీరు, బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు తదితర అంశాలను పర్యవేక్షించే తీరికే లేకుండా పోతుంది. అట్లే ఒక జిల్లా విద్యాధికారి రెండు, మూడేసి జిల్లాలకు జిల్లా విద్యాధికారిగా కొనసాగుతుండడంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నామని, అట్లే తమ మాతృసంస్థలకు కూడా సరియైన న్యాయాన్ని చేకూర్చలేకపోతున్నామని చాలామంది ఇన్చార్జిలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అట్లే జిల్లా విద్యాధికారుల కింద ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు కూడా ఇన్‌ఛార్జిలే కావడం గమనార్హం. ఇలా పర్యవేక్షణ అధికారులందరూ ఇన్‌ఛార్జిలుగా కొనసాగుతుండటంతో వికేంద్రీకరణకు బదులుగా కేంద్రీకరణ ఎక్కువగా జరుగుతున్నదని, విద్యావ్యవస్థకు మేలు కన్నా కీడే ఎక్కువ అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

గత విద్యా సంవత్సరం సుమారు 11 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కావడంతో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులను కూడా చేపట్టడంతో కొంతమేర విద్యాబోధన గాడిలో పడినట్లయింది. బోధనా నైపుణ్యాల పెంపు కోసం ఎస్సీఈఆర్టీ ఉపాధ్యాయులకు వేసవి సెలవులలోనే వృత్త్యంతర శిక్షణను సైతం అందించింది. అయితే కేవలం బోధనా నైపుణ్యాలను పెంచడం ద్వారా మాత్రమే సత్ఫలితాలను ఆశించలేమని నిరంతరం పటిష్ట పర్యవేక్షణ కూడా అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారుల ద్వారా అనుకున్న ఫలితాలు రాబట్టలేమని వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కొత్త నోటిఫికేషన్ ద్వారా ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చునని, ఆ భర్తీ ప్రక్రియలో ఇప్పటికే క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉండి, బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు కొంత వెయిటేజ్ ఇవ్వడం బాగుంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అట్లే ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల పోస్టులను కూడా భర్తీ చేయడం ద్వారా విద్యా వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రక్షాళనకు నోచుకునే అవకాశం ఉందని పలువురు విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు.

ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం ద్వారా పూర్తిస్థాయిలో పర్యవేక్షణపై దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం ఏర్పడుతుంది. మండల స్థాయిలో ఎంఈఓ పాత్ర పోషిస్తున్న సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల స్థానంలో రెగ్యులర్ ఎంఈఓ ల నియామకం ద్వారా మరింత పర్యవేక్షణను పెంచవచ్చునని, తద్వారా ఇప్పుడున్న ఇన్‌ఛార్జిల మీద పని భారం తగ్గుతుందని మనో విజ్ఞానవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అట్లే ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని విద్యాశాఖకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులను కేటాయింపు చేయడం ద్వారా మౌలిక వసతులను కూడా కల్పించడానికి అవకాశం ఏర్పడుతుంది. కొఠారి కమీషన్ సిఫార్సుల మేరకు 30శాతం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి. కనీసం 20 శాతం అయినా కేటాయింపులు చేయడం ద్వారా తెలంగాణ విద్యా కమిషన్ చేసిన సూచనలకు సార్థకత లభించినట్లవుతుంది. ఇటు నిధుల కేటాయింపు ద్వారా విద్యా వ్యవస్థ పరిపుష్టికి దారి తీయగా అటు ఖాళీల భర్తీ ద్వారా పర్యవేక్షణ అధికారుల కొరత తీరి పర్యవేక్షణ పటిష్టంగా నిర్వహించబడుతుంది. తద్వారా విద్యా వ్యవస్థ తప్పక గాడిలో పడుతుందని ఆశించవచ్చు.

– భాస్కర్ యలకంటి
8919464488

# ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
9705309583

దేశంలో సుసంపన్నమైన ఖనిజ సంపదకు పెట్టింది పేరైన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో సాయుధ తిరుగుబాట్లను తుడిచిపెట్టడమే లక్ష్యంగా భద్రతా దళాలు మావోయిస్టులపై పూర్తిస్థాయి యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలలో విస్తరించిన కర్రెగుట్ట అటవీ ప్రాంతం ఇప్పుడు వార్‌జోన్‌గా మారిపోయింది. పదివేల మందికిపైగా సైనికులు ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను ఏరివేసే పనిలో నిమగ్నమయ్యారు. అటు కేంద్రంలోనూ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ కనీసం 400 మంది మావోయిస్టులను హతమార్చింది.

దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నది. మావోయిస్టులతో పాటు గిరిజనుల నెత్తురు ఏరులై పారుతున్నది. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్ ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. చిన్న అలికిడి జరిగినా, బూట్లచప్పుడు వినిపించినా వణికిపోయే పరిస్థితి. 'మావోయిస్టు రహిత భారత్' కోసమంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్' నిజంగా నక్సల్స్‌ను నిర్మూలించడం కోసమేనా? అదే నిజమైతే ఆదివాసులను అడవుల నుంచి తరిమేయడం దేనికి? యథేచ్ఛగా మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న ఈ మారణహోమం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? ప్రజల్లో ఉద్భవిస్తున్న ఇలాంటి ప్రశ్నలకు కేంద్ర సర్కార్ సమాధానం చెప్పగలదా? ఎందుకంటే, స్వాతంత్ర్యం వచ్చినప్పటి ప్రభుత్వాలెన్నో మారినా మునుపెన్నడూ లేని విధంగా దేశం లో రాజ్యహింస పెచ్చరిల్లింది. దీనికి కారణాలేంటని లోతుగా పరిశీలిస్తే, అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అప్పణంగా అటవీ సంపదను దోచి పెట్టేందుకే ఈ నరమేధం. 'ఖనిజ' వేట అందులో భాగమే.

ఛత్తీస్‌గడ్‌లో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి, డోలమైట్, బాక్సైట్ నిక్షేపాలకు ప్రసిద్ధి. దేశంలో టిన్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం ఇదే. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదపై దేశ బడా కార్పొరేట్ల కన్నుపడింది. అత్యున్నత స్థాయి గ్రేడ్ ఇనుప ఖనిజం (హెమటైట్)ను వారికి కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం ఒప్పందం కూడా చేసుకుంది. ఈఏడాది జనవరిలో ఏడువేల ఎకరాల్లో నాలుగు పదమూడవ ఖనిజ బ్లాకుల వేలానికి సిద్ధమైంది. అయితే ఈ ఖనిజ తవ్వకాలతో ఎక్కువ నష్టం జరిగేది అక్కడ నివసించే ఆదివాసులకే. అడవిని, వారిని విడదీసి చూడలేం. ఈ తెగలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వాలు చేయని కుట్రలేదు. అందుకే ఆదివాసులు ఎన్నికష్టనష్టాలు ఎదురైనా అడవిని వదిలిపెట్టరు. పైగా ఇది మావోయిస్టులకు కూడా ఆసరాగా మారింది. ముందు మావోయిస్టులను నిర్మూలిస్తే, ఆదివాసులు వారంతావారే వెళ్లిపోతారని పాలకుల భావన! నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, కర్రెగుట్టల ప్రాంతాల్లో జరిగిన, జరుగుతున్న ఎన్ కౌంటర్లన్నీ ఆ కోవకు చెందినవే. ఇప్పటికే మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు సహా చాలామంది చనిపోయా రు. అయితే ఈ ఎన్‌కౌంటర్లకు కోవర్టులు, పోలీసుల నిఘా వ్యవస్థలే కారణం తప్ప, అక్కడున్న ఆదివాసులు ఎంతమాత్రం కాదు. అత్యాధునిక యంత్రాలతో సిఆర్‌పిఎఫ్, కోబ్రా బెటాలియన్, డిఆర్‌డిఓ సహా ఇరవై నాలుగు వేలమంది జవాన్లు మావోయిస్టుల కోసం వేటాడుతున్నారు. ఆపరేషన్ కగార్ ఇక మావోయిస్టులకు ఆఖరి మజిలీ అంటూ మీడియాలో, మాధ్యమాల్లో పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 2026 మార్చి నాటికి 'మావోయిస్టు రహిత భారత్' నిర్మిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటల వెనుక దాగున్న 'ఆంతర్యం' కూడా ఇదే. అయితే, ఇది చివరిదా, మొదటిదా అనే చర్చకన్నా భారతదేశ ప్రజల హక్కుగా, వారి అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఖనిజాలను బహుళజాతి సంస్థలకు అప్పగించే చర్య ల్ని వ్యతిరేకించడంతో పాటు అడ్డుకోవడం ముఖ్యం. తక్షణం 'ఆపరేషన్ కగార్' వంటి పేర్లతో ఆదివాసీ ప్రాంతాలలో సాగిస్తున్న అన్ని రకాల సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని, ఆదివాసీ ప్రాంతాల వనరుల రక్షణకు, ఆదివాసీ ప్రాంతాల హక్కుల పరిరక్షణకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రభుత్వం వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆర్‌జెడి అధ్యక్ష పదవికి మరోసారి లాలూ యాదవ్ నామినేషన్



**లక్నో :** బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్.. మరోసారి పార్టీ జాతీయ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేశారు. ఆయన ఇప్పటివరకు 12 పర్యాయాలు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు 13వ సారి పార్టీ అధ్యక్షుడు కాబోతున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ వెల్లడించారు. లాలూజీ మరోసారి పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడంతో పార్టీలో కార్యకర్తల నుంచి నాయకుల వరకు ప్రతిఒక్కరిలో సంతోషం వెల్లివిరిసిందని తేజస్వి అన్నారు. లాలూ నేతృత్వంలో బిహార్‌లో మరోసారి ఆర్‌జెడి అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రతిపక్షాలపై మోదీ చిన్నచూపు

## ప్రజలు సహించరు : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**రాయ్‌చూర్ :** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలను చిన్నచూపుగా చూస్తున్నారని విమర్శించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాలకు ఆయన గైర్హాజరు కావడంపై మండిపడ్డారు. ప్రధాని గైర్హాజరు ప్రతిపక్షాల పట్ల ఆయనకున్న గౌరవాన్ని ప్రతిబింబిస్తుందని ఖర్గే అన్నారు. సోమవారం కర్నాటకలోని రాయ్‌చూర్‌లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఖర్గే పర్యటించారు. అక్కడ ఆయన అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రాయచూర్ విశ్వవిద్యాలయం నామకరణకార్యక్రమానికిఅధ్యక్షతవహించారు.బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని కాల్చిచంపారని, ప్రతిగా భారత సాయుధ దళాలు పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశాయన్నారు. దేశాన్ని రక్షించడానికి యావత్ భారత దేశ ప్రజలు, సాయుధ దళాలు ఐక్యంగా పనిచేసినప్పటికీ, కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత ఘనత పొందేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. అటువంటి వారు ఆర్మీలో కెప్టెన్, కల్నల్ లేదా లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసి ఉంటే గొప్ప పని చేసినందుకు, దేశం కోసం పోరాడినందుకు అభినందనలు తెలియజేస్తామని, కానీ అలాంటి వ్యక్తులు కాదు కదా అని ఖర్గే ఎవరినీ నేరుగా పేర్కొనకుండా వ్యాఖ్యానించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన తొలి పార్టీ కాంగ్రెస్ అని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు చెప్పారు. రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రధానమంత్రి హాజరు కాలేదని, అంత తీరిక లేకుండా ఉన్నారా అని ప్రశ్నించారు. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు నాయకులు సమావేశానికి హాజరు కావడానికి ముఖ్యమైన పనులన్నింటినీ వదిలివేశారని, అయితే ప్రధానమంత్రి దేశంలో ఉన్నప్పటికీ హాజరు కాకూడదని నిర్ణయించుకున్నారని ఆరోపించారు. అఖిలపక్ష సమావేశానికి హాజరు కాకుండా బిహార్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని, దాని అర్థం ఏమిటి అని నిలదీశారు. దేశం, సైనికులు ఒకవైపు పోరాడుతుండగా, ప్రధానమంత్రి మరో వైపు ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారని, తమను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించి ప్రధాని అలా చేయడం తగదన్నారు. అటువంటి వైఖరి మంచిది కాదని హెచ్చరించారు. ప్రతిపక్షాన్ని తక్కువ చేసి మాట్లాడటానికి ప్రయత్నిస్తే, నాయకులు, ప్రజలు, ముఖ్యంగా ఈ దేశ యువత సహించదని ఘాటుగా స్పందించారు. అమెరికా ప్రతీకార పన్నులు విధించకుండా ఆపడంలో విఫలమైనందుకు ఖర్గే ప్రధానిని కూడా విమర్శించారు. 'మోదీ 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్' (అమెరికా ఎన్నికల సమయంలో) అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. కానీ ట్రంప్ భారతీయ వస్తువులపై భారీ పన్నులు విధించారు. దీనిపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని దుయ్యబట్టారు.

### ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి

ఇరాన్ తన ఇంధన అవసరాలలో 50 శాతం అక్కడి నుండే దిగుమతి చేసుకుంటున్నందున, ఇరాన్ ఎల్లప్పుడూ భారతదేశానికి మద్దతు ఇస్తుందని కాంగ్రెస్ చీఫ్ ప్రధానమంత్రికి గుర్తు చేశారు. 'ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటం జరుగుతోంది. దానిని ఆపడానికి మనం ప్రయత్నాలు చేసి ఉండాలి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నారు. మోదీ 'విశ్వ గురువు' కాబోతున్నాడనేది ఆయన దృఢ నినాదమని ఖర్గే అన్నారు. మీరు విశ్వ గురువు అయినా లేదా ఇంట్లో గురువు అయినా, ప్రజలు కోరుకునేది పెట్రోల్, డీజిల్, ఆహారం, బట్టలు, తలపై పైకప్పు అని, వీటి కోసం కృషి చేయాలని కోరుతున్నామన్నారు. విద్యను కాషాయీకరణ చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. నేడు విశ్వవిద్యాలయాలు, మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలలో ఆర్‌ఎస్‌ఎస్ సిలబస్ బోధిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు తమ పిల్లలకు పోస్టింగ్‌లు పొందుతున్నారని, మరికొందరు మనుగడ కోసం కష్టపడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసంకాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న విధంగా, దేశంలో ఎక్కడా బిజెపిఆవిధంగా చేయలేదని పేర్కొన్నారు.

## యుపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా అరవింద్ స్వరూప్



**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా అరవింద్ రాజ్ స్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రధాని మోదీల ద్వయాన్ని ఓడించాలని, వామపక్ష లౌకిక ప్రజాస్వామ్యప్రతిఘటనను నిర్మిం చాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభలు మథురలో జరిగాయి. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మహాసభను ప్రారంభించగా, జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండ, డాక్టర్ గిరీశ్ చంద్ర శర్మ, సీనియర్ నాయకులు ఇంతియాజ్ అహ్మద్ ప్రసంగాలు చేశారు.

## ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించలేరా? : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వం ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించకపోవడం, ఇజ్రాయెల్ దురాక్రమణను విమర్శించకపోవడం పట్ల కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. మోదీ సర్కార్ కనీసం నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాలని ఎద్దేవా చేసింది. అంతేకాదు, 'ఇరాన్–ఇజ్రాయెల్‌లు ఘర్షణలకు బదులుగా దౌత్య చర్చలు జరపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హితబోధ చేశారు. కానీ తన మాటనే అపహాస్యం చేస్తూ ఇరాన్‌పై నేరుగా వైమానిక దాడి చేశారు' అని విమర్శించింది. 'ఇరాన్‌తో భారత్ తక్షణమే దౌత్య, చర్చలు జరపాల్సిన ఆవశ్యకత ఉంది. భారత ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్నదాని కంటే ఎక్కువ నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాలి' అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'ఇరాన్‌పై అమెరికా చేసిన బాంబుదాడిని, ఇజ్రాయెల్ దురాక్రమణను, అది చేసే బాంబు దాడులను, టార్గెటెడ్ హత్యలను మోదీ ప్రభుత్వం నిస్సందేహంగా విమర్శించలేదు. ఖండించలేదు' అని జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. గాజాలోని పాలస్తీనియన్లపై జరుగుతున్న మారణ హోమంపై కూడా మోదీ సర్కార్ మౌనం వహిస్తోందని జైరాం రమేశ్ అన్నారు. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అనే మూడు ప్రధాన అణుకేంద్రాలపై అమెరికా బాంబు దాడులు చేసి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

## పంజాబ్, గుజరాత్‌లో 'ఆప్' విజయం

### దేశంలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడి



**న్యూఢిల్లీ :** నాలుగు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఈనెల 19న ఐదు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. గుజరాత్‌లోని విశావదర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆప్ అభ్యర్థి గోపాల్ ఇటాలియా విజయం సాధించగా, పంజాబ్‌లోని లూథియానా పశ్చిమ స్థానాన్ని కూడా పార్టీ నిలుపుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కేరళలోని అధికార ఎల్‌డిఎఫ్ నుండి నీలంబూర్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకుంది. గుజరాత్‌లోని అధికార బిజెపి కాడి స్థానాన్ని నిలుపుకోగా, పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలోని కాళిగంజ్ అసెంబ్లీ స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గుజరాత్ యూనిట్ మాజీ అధ్యక్షుడు ఇటాలియా జునాగఢ్ జిల్లాలోని విశావదర్ స్థానంలో తన సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి కిరీత్ పటేల్‌ను 17,554 ఓట్ల తేడాతో ఓడించారు. రాష్ట్రంలో దాదాపు పూర్తి ఆధిపత్యం ఉన్నప్పటికీ, 2007 నుండి బిజెపి విశావదర్ స్థానాన్ని గెలుచుకోలేదు. అప్పటి ఆప్ శాసనసభ్యుడు భూపేంద్ర భయానీ రాజీనామా చేసి అధికార బిజెపిలో చేరడంతో డిసెంబర్ 2023లో ఆ స్థానం ఖాళీ అయింది. పంజాబ్‌లో అధికార ఆప్ లూథియానా పశ్చిమ అసెంబ్లీ స్థానాన్ని మరో సారి కైవసం చేసుకుంది. పార్టీ అభ్యర్థి సంజీవ్ అరోరా తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ అషుపై 10,637 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, అరోరా 35,179 ఓట్లు సాధించగా, అషు 24,542 ఓట్లు సాధించారు. బిజెపికి చెందిన జీవన్ గుప్తా 20,323 ఓట్లు సాధించగా, శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి పరుప్కర్ సింగ్ ఘుమాన్ 8,203 ఓట్లు సాధించారు. జనవరిలో ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సీ గోగి మరణంతో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. ఇక షెడ్యూల్డ్ కుల అభ్యర్థులకు రిజర్వ్ చేయబడిన మెహ్సానా జిల్లాలోని కడి స్థానాన్ని బిజెపికి చెందిన రాజేంద్ర చావ్డా కాంగ్రెస్‌కు చెందిన రమేష్ చావ్డాపై 39,452 ఓట్ల తేడాతో గెలుచుకున్నారు. బిజెపి ఎమ్మెల్యే కర్సన్ సోలంకి మరణంతో ఫిబ్రవరిలో కడి స్థానం ఖాళీ అయింది. కేరళలో, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ నీలంబూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని 11,077 ఓట్ల తేడాతో కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆర్యదన్ షౌకత్ సిపిఐ(ఎం) నేత ఎం. స్వరాజ్‌పై విజయం సాధించారు. ఎల్‌డిఎఫ్ మద్దతుగల స్వతంత్ర అభ్యర్థి, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పివి అన్వర్ రాజీనామా చేయడంతో నీలంబూర్ స్థానం ఖాళీ అయింది. పశ్చిమ బెంగాల్ లో, నదియా జిల్లాలోని కాళిగంజ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార తృణమూల్ కాంగ్రెస్ అలీఫా అహ్మద్ గెలుపొందారు. తన ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి అశీశ్ గోష్‌పై 50,049 ఓట్ల మెజారిటీ సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సిట్టింగ్ టిఎంసి ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన కుమార్తె అలీఫా అహ్మద్‌ను పార్టీ బరిలోకి దింపింది.

## ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించిన ఎస్‌పి

### బిజెపితో సంబంధాలున్నాయని ఆరోపణ

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) కీలక నిర్ణయం తీసుకున్నది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఈ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతోపాటు బిజెపితో వారికి సంబంధాలున్నట్లు ఆరోపించింది. గోసాయిగంజ్ ఎమ్మెల్యే అభయ్ సింగ్, గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేష్ ప్రతాప్ సింగ్, ఉంచహార్ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ పాండేను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎక్స్‌లో పేర్కొంది. కాగా, ఈ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, మతపరంగా విభజన సృష్టించే ప్రతికూల భావజాల పార్టీతో సంబంధం కలిగి ఉన్నారని సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. తమ రాజకీయ వైఖరిని పునఃపరిశీలించేందుకు ఇచ్చిన సమయం ముగిసినట్లు పేర్కొంది.నేపథ్యంలో పార్టీతోపాటు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. బహిష్కరించిన ఎమ్మెల్యేలు2024లోజరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలోపార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఓటు వేశారని ఆరోపించింది.


## ఆ ఇద్దరికీ ఐదు రోజుల రిమాండ్

**శ్రీనగర్ :** పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన నలుగురు ముష్కరులకు ఆశ్రయమిచ్చిన నిందితులను జమ్ము కోర్టుఐదు రోజులపాటు ఎన్ఐఎ రిమాండ్‌కు అప్పగించింది. నిందితులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌లను ఎన్ఐఎ అధికారులు సోమవారం జమ్ము కోర్టులో హాజరుపర్చగా.. అదనపు న్యాయమూర్తి, సెషన్ జడ్జిలు ఐదురోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో నలుగురు ముష్కరులు పర్యాటకులే లక్ష్యంగా మారణహోమం సృష్టించారు. మహిళలను, చిన్నారులను వదిలేసి పురుష పర్యాటకులు ఒక్కొక్కరిని పేర్లు అడుగుతూ కాల్చిచంపారు. మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 25 మంది భారతీయులు కాగా, ఒక నేపాలీ ఉన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం దర్యాప్తు అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆ ఉగ్రవాదులకు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ అనే ఇద్దరు వ్యక్తులు ఆశ్రయం ఇచ్చినట్లు గుర్తించిన అధికారులు రెండు రోజుల క్రితం అరెస్ట్ చేశారు. ఇవాళ జమ్ముకోర్టులో హాజరపర్చగా ఐదురోజులపాటు ఎన్ఐఎ రిమాండ్‌కు అప్పగించారు.

## హార్ముజ్ మూసివేత అంత సులభమేనా?

### ప్రపంచానికి చమురు కష్టాలొస్తాయా?

### ఐదు నెలల గరిష్ఠస్థాయికి పెరిగిన చమురు ధర



**టెహ్రాన్ :** శత్రుదేశాలను ఎదురు దెబ్బ తీసేందుకు చాలా తక్కువ ప్రత్యామ్నాయాలు ఉండటంతో హార్ముజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ సన్నద్ధమవుతోంది. ఈ జలసంధి ద్వారా ప్రతి రోజూ 2.10 కోట్ల బ్యారెళ్ళ ముడి చమురు రవాణా అవుతూ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా 21శాతం ముడి చమురు హార్ముజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతోంది. కానీ జలసంధిని మూసివేయడం అంత సులభమైనదేమీ కాదని మధ్యప్రాచ్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచానికి చమురు కష్టాలు వస్తాయా? అనే విషయం పైనే ప్రధానంగా అన్ని దేశాల్లో ఆర్థిక నిపుణులు చర్చ చేస్తున్నారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధీమాగా ఉన్నప్పటికీ హార్ముజ్ జలసంధి మూసేస్తే ఆ దేశానికి కూడా చమురు కష్టాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ జలసంధిని మూసివేసేందుకు ఆదివారంనాడు ఇరాన్ పార్లమెంటు ఆమోదముద్రవేసిన నేపథ్యంలో ముడిచమురు ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. ఐతే ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతావిభాగం నుండి ఇంకా అనుమతి రావాల్సి ఉంది. ఒకవేళ హార్ముజ్ జలసంధిని మూసేస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. అమెరికాకు కూడా ఈ సెగ తగులుతుంది. అందువల్ల హార్ముజ్ జలసంధి తీరప్రాంతాల వెంబడి పశ్చిమ ఆసియాలో అమెరికా స్థావరాలలో ఉన్న సైన్యం మళ్ళీ దాడులు చేసే అవకాశాన్ని నిపుణులు తోసిపుచ్చడంలేదు. ఈ గందరగోళ పరిస్థితులమధ్య ఎర్లీ ట్రేడింగ్‌లో ముడిచమురు ధరలు ఐదు నెలల గరిష్ఠస్థాయికి పెరిగాయి. తదుపరి ఇరాన్ ఎలాంటి ప్రతీకార చర్యలకు దిగుతుందా? అని మార్కెట్ వ్యవస్థలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. తొలుత బ్రెంట్ క్రూడ్ ధర 5.7 శాతం పెరిగింది. దీంతో ఒక బ్యారెల్ ధర 81.40 డాలర్లకు చేరింది. తర్వాత ఉద్రిక్తతలు కొనసాగినప్పటికీ కూడా ఇరాన్ తదుపరి చర్యల ప్రకటన రాకపోవడంతో ఈ ధర 78 డాలర్లకు తగ్గింది. బహ్రెయిన్‌లో అమెరికాకు చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ నావికాదళం తిష్టవేసుకుని ఉన్నందువల్ల అంతసులభంగా హార్ముజ్ జలసంధిని మూసివేయడం ఇరాన్‌కు సాధ్యంకాదన్న విషయం వ్యాప్తిలోకి వచ్చింది. తొలుత ఆసియా ట్రేడింగ్‌లో కూడా బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్లకు పెరిగింది. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం 11వ రోజు కూడా కొనసాగుతున్నది.

#### ఇరాన్‌ను ఆపండి : చైనాకు అమెరికా విజ్ఞప్తి

హార్ముజ్ జలసంధిని మూసివేయకుండా ఇరాన్‌ను అడ్డుకోవాలని చైనాకు అమెరికా విజ్ఞప్తి చేసింది. హార్ముజ్ జలసంధి ద్వారా ప్రతి రోజూ రవాణా అయ్యే ముడి చమురు, ఖనిజవాయువులో 70 శాతం పైగా చైనా దేశానికే రవాణా అవుతుంది. గత నెలలో గణాంకాల ప్రకారం చైనా దేశం ఇరాన్ నుండి రోజుకు 10.80 లక్షల బ్యారళ్ళ కంటే ఎక్కువగా ముడి చమురు దిగుమతి చేసుకుంది. తర్వాత స్థానాల్లో భారత్, జపాన్, దక్షిణ కొరియా దేశాలున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న చమురు నిక్షేపాలకు అతిపెద్ద ప్రధాన కొనుగోలుదారు చైనా దేశమే కావడంతో ఇరాన్‌ను అడ్డుకోవాలని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఈ విజ్ఞప్తి చేశారు. ఇరాన్‌లో అత్యున్నతస్థాయిలో నిర్ణయం తీసుకునే జాతీయ భద్రతా మండలి ఆమోదం లభిస్తే ఇక తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ హార్ముజ్ జలసంధి మూతపడినట్టే. ఇరాన్‌తో చైనాకు సన్నిహిత సంబంధాలు ఉండటం, అతిపెద్ద చమురు కొనుగోలుదారు చైనాయే కావడంతో ఆ దేశాన్ని సంప్రదించకుండా ఇరాన్ ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేనందువల్ల తాము ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు మార్కో రుబియో ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ జలసంధిని మూసేస్తే ప్రపంచానికి చాలా తీవ్రమైన నష్టాలు, ఆర్థిక సమస్యలు సంభవిస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రపంచంలో 21 శాతం చమురు, ఖనిజ వాయువు రవాణా ప్రతి రోజూ ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. కనీసం కొన్ని గంటలు, రోజులు ఈ జలసంధి మూతపడినాగానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రనష్టం సంభవిస్తుంది.


## అంగన్‌వాడీ లబ్ధిదారులకు ముఖ గుర్తింపు వద్దు : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అంగన్‌వాడీ లబ్ధిదారులకు ముఖ గుర్తింపు ప్రామాణీకరణను తప్పనిసరి చేయాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించడంపై కాంగ్రెస్ మండిపడింది. సమాజంలోని అత్యంత దుర్బల వర్గాలను సామాజిక సంక్షేమ హక్కుల నుండి తప్పించడానికి ఒక క్రమపద్ధతిలో సాంకేతికతను ఉపయోగిస్తోందని ఆరోపించింది. డిజిటల్ ఇండియా అమలు కావాలి, దానిని నిర్వీర్యపరచకూడదు కానీ, ఇది 'ప్రీచ్ ఇంక్లూజన్ ప్రాక్టీస్ ఎక్స్‌క్లూజన్ (పిఐపిఇ) కల'గా మిగిలిపోకూడదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. అంగన్‌వాడీ కేంద్రాలలో రేషన్ పంపిణీ, పిల్లల హాజరు పర్యవేక్షణ కోసం తప్పనిసరి ముఖ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలని మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. గత నెలలో మంత్రిత్వ శాఖ జారీ చేసిన లేఖ ప్రకారం పోషన్ ట్రాకర్ అప్లికేషన్‌లోని లబ్ధిదారుల ప్రొఫైల్‌లలో ముఖ గుర్తింపు ఫీచర్ ఇప్పుడు అందుబాటులో ఉంటుంది. ఇకపైనే, ఫోటో క్యాప్చర్ కోసం ట్రాకర్ సిటిజన్ మాడ్యూల్‌ని ఉపయోగించి లబ్ధిదారులు స్వీయ నమోదు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్పందించారు. సమాజంలోని అత్యంత దుర్బల వర్గాలను సామాజిక సంక్షేమ హక్కుల నుండి తప్పించడానికే మోదీ ప్రభుత్వం క్రమపద్ధతిలో సాంకేతికతను ఉపయోగిస్తోందని ఆరోపించారు. మొదట ఉపాధిహామీ పథకం నుండి కోట్లాది మంది కార్మికులను నిరోధించడానికి ఆధార్‌ను ఆయుధంగా ఉపయోగించారన్నారు. యాసిడ్ దాడి బాధితులు ఆధార్‌లో నమోదు చేసుకోవడానికి కోర్టులో పోరాడాల్సి వచ్చిందని, దేశవ్యాప్తంగా ఆదివాసీలు ఇప్పటికీ సాంకేతిక లోపాల కారణంగా రేషన్ కోల్పోతున్నారని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పుడు, గర్భిణీలు ఎన్ఎఫ్ఎస్ఎ కింద ప్రాథమిక, చట్టపరమైన హక్కుల కోసం ముఖ గుర్తింపు సాంకేతికతతో కొత్త అడ్డంకిని ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో ఎబిపిఎస్ ప్రవేశపెట్టడం వల్ల అర్హులైన లబ్ధిదారులు (అంటే గర్భిణీలు, పాలిచ్చే మహిళలు) ఈ పథకం నుండి ప్రయోజనం పొందే సామర్థ్యంపై ప్రభావం చూపిందని, విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 365వ నివేదికలో పేర్కొన్నట్లు ఆయన ఎత్తి చూపారు. మోదీ ప్రభుత్వం మరో వివక్షత కలిగిన సాంకేతికతను తీసుకువస్తుందన్నారు.



నాసిక్ :సిపిఐ మహారాష్ట్ర రాష్ట్ర 25 వ మహాసభలు నాసిక్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభ ప్రారంభసూచికగా వేలాది మందితో భారీ ప్రదర్శన జరిగింది. ర్యాలీకి ముందు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు 'జై భీమ్.. లాల్ సలాం..' నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సిపిఐ జెండాను జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో ఆవిష్కరిచగా, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఈ మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. మహారాష్ట్ర నలుమూలల నుండి 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాజన్ క్షీరసాగర్, మహారాష్ట్ర సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సుభాష్ లాండే, నాయకులు రామ్ బహేతి, రాజు దేశాలే, తుకారాం భాస్మే, ప్రకాష్‌రెడ్డి, తదితరులు మహా సభలో ప్రసంగించారు.



# మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో నూతనంగా ఎన్నుకోబడిన మహిళా సంఘాల సభ్యులు , లీడర్ల శక్తివంతీకరణకు తోడ్పడే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా రూపొందించిన శిక్షణ మాడ్యూల్ను ఈ రోజు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడిన శిక్షణ మాడ్యూల్లో మహిళా సంఘాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, ఆర్థిక నిర్వహణ, స్వయం సహాయ గ్రూపుల పని తీరు మెరుగుపరచే పాఠ్యాంశాలు పొందుపరచబడ్డాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల శక్తివంతీకరణ దేశ అభివృద్ధికి బలం అని అన్నారు. ఈ మాడ్యూల్ మహిళలకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో మహిళలు అధికారబద్ధంగా వ్యవహరించేలా ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్డిఓ నాగి రెడ్డి, అడిషనల్ డిఆర్డిఓ జంగా రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు శిక్షణా బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 68 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరం

## సేనోటూ డ్రగ్స్ ట్యాగ్తో మొక్కలు నాటిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** పాఠశాలలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాఠశాలలో హీల్ యువర్ మైండ్ అండ్ ప్లాంట్ ఎ ట్రీ (సే నో టూ నో డ్రగ్స్) నినాదంతో పాఠశాలో మొక్కలు నాటి ట్యాగ్ వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంటి డ్రగ్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ప్రతి విద్యార్థి చెడును మానుకొని మంచి మార్గం నడవాలని కోరారు. అనంతరం పాఠశాలలో జిల్లాస్థాయి టాఫర్గా నిలిచిన తాళ్లురి రేఖ శ్రీని నగదు బహుమతితో అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సలీంషరిఫ్, పాఠశాల ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్కేం డేయ, మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరుతపమ్మ సుధీర్, బషీర్, అభినవ్ తల్లిదండ్రులు, మేకల వెంకటేశ్వర్లు, అరుణ, కొమరగిరి రంగారావు, సీతయ్య, పైడిమర్రి సత్యబాబు, నయీం పాల్గొన్నారు.

# సమస్యలకు తక్షణ పరిష్కారం

## నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 52 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహారించాలన్నారు.

# ఇష్టానురాజ్యంగా పుస్తకాలను అమ్ముతున్న శ్రీ చైతన్య, నారాయణ

## తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యాసంస్థలలో ఇష్టానురాజ్యంగా పుస్తకాలను అమ్ముతున్న శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలపైచర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల,నారాయణ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అక్రమంగా అమ్ముతున్న పుస్తకాలను పట్టుకోని ధర్నా చేశారు.ఈ సందర్భంగా సంఘం వారు మాట్లాడుతూ శ్రీ చైతన్య,నారాయణ విద్యార్థుల దగ్గర అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాల అమ్మకూడదు అని ఉన్నప్పటికీ పుస్తకాలు అమ్మడం సరైనది కాదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో బహిరంగంగా పుస్తకాల అమ్ముతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గాదపాక సూర్య తేజ, గాత్రి క్,వాసు,ఆమెర్,నవీన్,మహేష్ తదితరులు ఉన్నారు.

# లక్కీ డ్రా పేరిట మోసం

## పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకున్నారు. నెలనెలా లక్కీ డ్రా పేరిట విలువైన బహుమతులను ఆశ చూపారు. ఊరారా ఏజెంట్లను పెట్టుకోని మరీ కోట్ల రూపాయలు కొల్లగొట్టడమే టార్గెట్గా పెట్టుకున్నారు. డ్రా పూర్తయిన వాయిదాలు చెల్లించిన సభ్యులకు వస్తువులు ఇవ్వకుండా శఠగోపం పెట్టారు ముగ్గురు. వారి ఉచ్చులో చిక్కి మోసపోయిన బాధితులు న్యాయం చేయాలంటూ పోలీసుల చుట్టు తిరుగుతున్నారు. మిర్యాలగూడకు చెందిన కె.కోటేశ్వర్‌రావు, కె.నరేష్, బి.శ్రీనివాస్ అనే ముగ్గుర వ్యక్తులు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆర్కె ఎంటర్ ప్రైజెస్ పేరిట దుకాణం తెరిచారు. అదృష్టం బాగుంటే లక్కీ డ్రాలో విలువైన కార్లు, బైక్‌లు, బంగారు నగలు అన్ని మీవేనంటూ ఊదరగొట్టారు. 15నెలల కాలపరిమితి నెలకు రూ.1000 ప్రతినెలా లక్కీ డ్రాలో మీరే విజేతలని పది మంది ఏజెంట్ల ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. మొత్తం మీద 2600 మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. మొదట కొంత మందికి గిఫ్టులు అందించి నమ్మించారు. ఆ తరువాత టార్గెట్ రీచ్ కాగానే బోర్డు తిప్పేసి పత్తా లేకుండాపోయారు. మొత్తంమీద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్కి డ్రా పేరిట అమాయక ప్రజల నుంచి రూ.3.90కోట్లు కొల్లగొట్టినట్లు తెలిసింది. డ్రా ముగిసి ఆరు నెలలు అవుతున్నా గెలిచిన గిఫ్టులు రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన ఏజెంట్లు, సభ్యులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. పోలీసు అదుపులో ఉన్న సదరు కేటుగాళ్లు రాజకీయ పలుకుబడితో రాజీ చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తుంది.



# అర్జీలకు అధిక ప్రాధాన్యం

## యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 99 అర్జీలను, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 54 వ్యవసాయ శాఖ 17, జిల్లా గ్రామీణ అభివృద్ధికి 6, జిల్లా పంచాయతీ శాఖ 5, సర్వే లాండ్స్ 4, జిల్లా పరిషత్ 4, మున్సిపాలిటీ 2,జిల్లా వైద్య ఆరోగ్య 2, ట్రాన్స్కో, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా అటవీ శాఖ, ఆర్ అండ్ బి, ఎంప్లాయిమెంట్ ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఎరువులు, భూ భారతి, ఆయిల్ ఫామ్ సాగు వంటి వాటి పై కలెక్టర్ సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగు పై రైతులకు అవగాహన కల్పించి, పంటలు వేసుకునేలా చూడాలన్నారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులందరూ తమ శాఖలకు సంబంధించిన పనుల పై దృష్టి సారించాలన్నారు. జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ పాల్గొన్నారు.

# విద్యా సంస్థలను నిరంతరం సందర్శించాలి

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని విద్యా సంస్థలు, హాస్టళ్లను నిరంతరం సందర్శించి పాఠశాలల్లో ఎక్కడ వాన నీరు, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో మాట్లాడుతూ పరిశుభ్రత లోపం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని, అందువల్ల మండలాల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు వారి మండలంలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని,మూసీ పరీవాహక ప్రాంతంలో విష పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని, అందువల్ల అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు వృధాగా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లయితే గుర్తించి వాటివల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా కూలగొట్టాలని చెప్పారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీ 2025 గోడపత్రికను ఆవిష్కరించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌పై జిల్లాలోని ప్రజలు అందరికీ అవగాహన కల్పించాలని స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరూ పయనించే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని అంశాల పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ సోమవారం ప్రజావాణిలో మొత్తం 129 దరఖాస్తులు రాగా, అందులో జిల్లా అధికారులకు 57, రెవెన్యూ శాఖకు సంబంధించి 72 దరఖాస్తులు వచ్చాయి.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,జెడ్ పీ ఇన్చార్జి సీఈఓ శ్రీనివాస రావు, ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

# నల్లగొండ డిసిసిబికి రూ.100 కోట్ల బడ్జెట్ తీసుకొచ్చాం


## డిసిసిబి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గత ఆర్థిక సంవత్సరంలో టిజిసి ఏబి నుండి మిగతా డిసిసిబిల కంటే అత్యధికంగా రూ 100.00 కోట్ల బడ్జెట్ను తీసుకు వచ్చి సంఘాలకు ఇవ్వడం జరిగిందని డిసిసిబి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.సోమవారం నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 104వ జనరల్ బాడీ సమావేశం జిల్లా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుకు సంబంధించి 2024/25 బ్యాంకు సాధించిన పురోగతిని విశ్లేషించుకోవడం జరిగిందని 2024/25 ఆర్థిక సంవత్సరంలో మంచి పురోగతిని సాధించిందని ఇందుకోసం సహకరించిన బ్యాంకు పాలకవర్గాన్ని, బ్యాంకు సిబ్బందిని సొసైటీ చైర్మన్ లను అభినందించడం జరిగిందని తెలిపారు. సొసైటీలకు డివిడెంట్ రూపాయలు ఒక కోటి పది లక్షలు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు.గత ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్ల పెరుగుదల కొరకు సహకార సమృద్ధి సహకార లక్ష్మీ అని రెండు కొత్త డిపాజిట్ల స్కీమ్లను ప్రవేశపెట్టుకొని రూ 100.00 కోట్లు సేకరించడం జరిగిందని గత ఆర్థిక సంవత్సరంలో టిజిసి ఏబి నుండి మిగతా డిసిసిబిల కంటే అత్యధికముగా రూ 100.00 కోట్ల బడ్జెట్ను తీసుకువచ్చి సంఘాలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు.సహకార సంఘాలకు నాబార్డ్ రిఫైనాన్స్ ద్వారా కిసాన్ డ్రోన్స్ స్కీమ్ ప్రవేశపెడుతున్నాము. ఈ స్కీమ్ ద్వారా ఇచ్చు ఋణముపై వడ్డీని నాబార్డ్ కన్సిషనల్ వడ్డీ రేటు క్రింద తక్కువ వడ్డీకే ఇచ్చుటకు ప్రయత్నిస్తామన్నా రు. ఈ స్కీమ్కి రాష్ట్ర ప్రభుత్వము బడ్జెట్ అలాట్ చేసినచో 40శాతం సబ్సిడి ఇచ్చుటకు వీలవుతుందన్నారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు గొంగిడి మహేందర్ రెడ్డి,పాశం సంపత్ రెడ్డి,అందెల లింగం యాదవ్, సొసైటీ చైర్మన్లు , బ్యాంకు సీఈఓ శంకర్ రావు ఇతర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

## డిఎస్పి ప్రసన్నకుమార్ కేసు వివరాలు వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తుంగతుర్తినియోజకవర్గం నాగారం మండలంలోని ఈటూర్ గ్రామం నంగునూరి బయ్యమ్మ ఇంట్లో ఈనెల 17వ తేదీన చోరీ జరిగింది. ఆమె నిద్రిస్తున్న సమయంలో ఇంటి వెనుకల గోడదూకి దొంగలు తమవెంట తెచ్చుకున్న కట్టర్తో కరెంట్‌ను కట్‌చేసి ఆమె మెడమీద ఉన్న నల్లపూసల గొలుసు, చేతిగాజులు చోరీ చేశారు. ఆమె లేవకుండా చేతులను చీరెతో కట్టి అరవకుండా కట్టేసి ఇంట్లో మరికొంత నగదును కూడా తీసుకొని పరారయ్యారు. దీంతో మరుసటి రోజు ఆమె నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం ఆమె ఇంట్లో దొంగలించిన సోత్తును అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండగా నేరస్తులు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సిఐ రఘువీర్‌రెడ్డి , నాగారం ఎస్ఐ అయిలయ్యలు వారి నుండి ఎపి28ఎజడ్ 0721 కారు స్విఫ్ట్, నల్లపూసల గొలుసు, ఐదు సెల్‌ఫోన్లు, కట్టర్లను సీజ్‌చేశారు. ఐదుగురినిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా హైద్రాబాద్‌లోని మేడ్‌పల్లికి చెందిన బోడ వెంకటేష్, స్వస్థలం నాగారం మండలం ఈటూరు, పోతురాజు నాగరాజు మేడ్‌పల్లి హైద్రాబాద్ స్వస్థలం తిరుమలగిరి మండల మాలిపురం, ఏడ్ల శేఖర్ కాంచనపల్లి గ్రామం,అడ్డగూడురు మండలం యాదాద్రి భువనగిరి జిల్లా, కొమ్ము సోమయ్య మేడిపల్లి హైద్రాబాద్ స్వస్థలం మాచిరెడ్డిపల్లి నాగారం మండలం. వడ్డె పున్నం మాచిరెడ్డిపల్లి గ్రామం చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వృద్ధురాలు భయమ్మ ఇంట్లో నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులంతా జీవనోపాధి కోసం చెన్నైలో స్థిరపడగా ఆమె ఒక్కతే ఈటూరు గ్రామంలో నివాసం ఉంటుంది. ఆమె ఒంటిరిగా ఉన్న విషయం తెలుసుకుని చోరికి పాల్పడినట్లు విచారణలో చెప్పారు. విచారణ అనంతరం నిందితులను కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగారం సిఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ అయిలయ్య పాల్గొన్నారు.

# నట్టేట ముంచి చిట్టీల వ్యాపారి పరార్

## 70 మంది సభ్యుల నుంచి రూ.4కోట్లతో ఉడాయింపు

## పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నమ్మించి అదను చూసి నమ్మిన వారిని నట్టేట ముంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టి రాత్రికి రాత్రే కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి పరారైన ఓ ప్రైవేట్ చిట్టీల వ్యాపారి సంఘటన మిర్యాలగూడలో సోమవారం జరిగింది. దీంతో బాధితులు సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శాంతినగర్‌కు చెందిన కటకం సైదిరెడ్డి గత 15 ఏండ్లకు పైగా చిట్టీల వ్యాపారం సాగిస్తున్నాడు. స్థానికులతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకోని చిట్టీల వ్యాపారం మొదలుపెట్టాడు. 70 మందికి పైగా సభ్యులను ఏర్పాటు చేసుకోని రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు చిట్టీలు నడుపుతూ కొంతకాలంగా సక్రమంగా చెల్లింపులు చేస్తూ వస్తున్నాడు. గత కొద్ది నెలలుగా చిట్టీలు పాడిన సభ్యులకు డబ్బులు చెల్లించక కాలయాపన చేశాడు. ఇంటికి వెళ్లిన లేకపోవడం సెల్ ఫోన్ స్విచాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇది తెలిసిన చిట్టీల వ్యాపారి కటకం సైదిరెడ్డి రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా ఉండాయించాడు. మొత్తం మీద 70 మంది సభ్యుల నుంచి రూ.4కోట్లకు పైగా వసూలు చేసి పరారైనట్లు తెలుస్తుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చిట్టీల వ్యాపారి సైదిరెడ్డి వేటలో ఉన్నారు.

# అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ:** అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో నివసిస్తున్న నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పబ్బు వీరస్వామి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. నల్లగొండ మండల పరిధిలోని పానగల్ అన్వేష్ పురం పుట్ట వద్ద సర్వే నెంబర్ 33 లో ఎకరం ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న నిరుపేదలను విచారణ చేసి ఈ సర్వే నెంబర్ లో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కొద్ది కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు సాగర్ రోడ్ లోని మాతృక భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని వీరికి ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, బాధితులు విశ్వనాధుల లెనిన్, పి సుజాత, విజయ,ధనలక్ష్మి, వీరయ్య, మల్లయ్య, దోటి పాండరి, వెంకటేష్, కాంతి కుమార్, సునీత, తదితరులు ఉన్నారు.

# బాధితులకు భరోసా : సూర్యాపేట ఎస్పి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** తమకు జరిగిన అన్యాయంపై పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా ఎస్పి కె.నర్సింహా పోలీసులకు సూచించారు. ఆధునిక పోలిసింగ్ నిర్వర్తించాలన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల నిర్వాహణ సిబ్బందికి, పోలీస్ స్టేషన్ నిర్వహణ సెక్షన్ ఇన్‌ఛార్జి సిబ్బందికి విధుల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పోలీస్ యూనిఫాంకు ప్రత్యేకత ఉందన్నారు. సిబ్బంది ప్రవర్తనపై, సేవలపై ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ వస్తుందన్నారు. ప్రజలకు గౌరవంగా పనిచేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును అంతర్జాలంలో నమోదు చేసి బాధితులకు రసీదు ఇవ్వాలన్నారు. రిసెప్షన్‌లో మహిళ సిబ్బందిని నియమించి బలోపేతం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరి బాబు, ఐటికోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, రిషెప్షన్ పని విభాగం కోఆర్డినేటర్ ఎస్ఐ మహిశ్వర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 99 దరఖాస్తులు

## జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ప్రజావాణిలో దరఖాస్తులను పరిష్కరించేటప్పుడు ఖచ్చితమైన సమాధానం అర్జిదారులకి తెలియజేయాలని, అధికారులకు జిల్లా కలెక్టర్ తెజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కమిటి శాఖల వారిగా పరిశీలించి పరిష్కరించాలని ఈ కమిటిలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో డిఆర్‌డిఏ పిడి,జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అడిటింగ్ అధికార్లతో కలిసి కమిటి ఏర్పాటు చేసి ప్రతి శాఖకి సంబంధించి ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించటంలో నాణ్యత పాటిస్తున్నారా లేదా అని పరిశీలించాలని తెలిపారు. దరఖాస్తులు ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధికారులు వారి శాఖ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యాలయంలోని అధికారులకి విధుల విభజనపై తెలియజేయాలని అన్నారు. జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న లోకాయుక్తా, మానవహక్కుల కమిషన్, ఎస్‌సిఎస్‌టి కమిషన్, స్థానిక కోర్టు కేసులకి సంబంధించి కౌంటర్ ఫైల్, కేసు, క్లోజ్, కోర్ట్ ఆర్డర్ అమలు లాంటివి తప్పని సరిగా అమలు చేయాలని, ప్రతి కార్యాలయంలో ఒక సీనియర్ అధికారిని కోర్టు కేసులను చూసేందుకు నియమించుకోవాలని కోరారు. ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 34, ఇరిగేషన్ 6, మున్సిపాలిటి 2, డిపివో4, డిడబ్ల్యూవో 4, ఇతర శాఖలకు సంబంధించినవి 49 మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి వివి అప్పారావు, డిఎఫ్‌వో సతీష్‌కుమార్, డిపివో యాదగిరి, ఆడిటింగ్, అధికారి శ్యామ్‌సుందర్, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిడబ్ల్యూవో నర్సింహరావు, డిఈవో అశోక్, సిపివో కిషన్, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకు ఊపిరి ఎర్రజెండా



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం ఎర్రజెండా పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో సిపిఐ తంగడపల్లి శాఖ మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా గాలయ్య మాట్లాడుతూ బ్రిటిష్ కబంధహస్తాల్లో మగ్గుతున్న భారతదేశానికి స్వాతంత్రం కోసం పోరాడిన సిపిఐ నాటినుండి నేటి వరకు 100 సంవత్సరాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. అధికారంలో ఉన్న పాలకులు ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ విస్తరించడానికి ప్రజాసంఘాలను ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, తంగడి పల్లి శాఖ కార్యదర్శి దాసరి అంజయ్య, నీల బిక్షపతి, దాసరి కృష్ణ, ఉబ్బు దర్శన్, నీల రాము, దాసరి యాదయ్య, మనోహర్, నీళ్ల జంగయ్య, నీళ్ల అశోక్ పాల్గొన్నారు.

## ఇల్లు పేద ప్రజల ఆత్మగౌరవ ప్రతీక

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** వాస్తవమైన సంక్షేమ పాలనను చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గృహ కలలను నిజం చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు సోమవారం 59వ డివిజన్ రాయపురలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు అనేది ఒక్క నివాసం మాత్రమే కాదని, అది ఓ కుటుంబానికి గౌరవం, భద్రత, గుర్తింపు అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఆత్మగౌరవానికి బలమైన పునాది వేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం ఒక్కటేనని, ప్రతి అర్హత గల కుటుంబానికి స్వగృహం అందించాలనే రాష్ట్రవ్యాప్తంగా రూ.20 లక్షల ఇళ్లను మూడున్నర సంవత్సరాల్లో నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామని, మొదటి దశలో రూ.4.5 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, దీపక్ రెడ్డి,రవికిరణ్, సుగుణ కిషోర్, మదార్, శ్రీనివాస్, శ్రీకర్ పాల్గొన్నారు.

## నేడు రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నేడు రైతులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖాముఖీ కార్యక్రమం ఉంటుందని,ఈ కార్యక్రమానికి రైతు వేదికల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వానాకాలం పంట సాగుకు రైతు భరోసా నిధులను విజయవంతంగా రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా 24న మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి రైతు వేదిక వద్ద ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు వేదికల వద్దకు ప్రజాప్రతినిధులు రైతులు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసేంత వరకు ఉద్యమం ఆగదు

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/ కమలాపూర్:** సంవత్సరాలు గడుస్తున్నప్పటికి అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించాలని ఎన్నో సంవత్సరాలుగా సిపిఐ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసనలు, ఆమరణ నిరాహార దీక్షలు చేపడితే గత ప్రభుత్వం, అధికారులు హామీలు ఇచ్చి విస్మరించారని, ఇప్పటికైనా నిజమైన అర్హులను గుర్తించి ఇండ్లు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎదుట సిపిఐ మండల కార్యదర్శి నకిర్త ఓదెలు ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు బయటయించి ఆందోళన చేపట్టారు. అక్కడే ఛాయ్ చేసి నిరసన తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే ఇండ్లు పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ.... గల ప్రభుత్వం అర్హులైను గుర్తించి పట్టాలు పంపిణీ చేసి అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికి డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేసి అర్హులకు అందజేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తి చేసి అందజేస్తామని తెలిపారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు పేదవానికి నిలువ నీడ, విద్య, వైద్యం ఆదుకోవడంలో అందించడంలో గత పాలక ప్రభుత్వాలు అందించకపోవడంతో తీవ్ర నిర్లక్ష్యంతో ఇళ్ళ స్థలాలు లేక ఇండ్లు లేక అద్దె కట్టలేని పరిస్థితిలో దుర్భర జీవితాన్ని పేదవారు వెల్ల దీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కు రాజు గౌడ్, మండల కార్యదర్శి నకిర్త ఓదెలు, కొలుగూరు బాలరాజ్, మహేందర్, బొజ్జం లక్ష్మి, జేరిపోతుల శిరీష, నిరుపేద మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాషా ముక్త్ భారత్ అభియాన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ కి అలవాటు పడుతూ వ్యసనాలకు బలి అవుతున్నారని తెలిపారు. ఈ భయంకరమైన వ్యసనాల నుండి ప్రజలను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దీని ప్రభావం కుటుంబాల మీద, సమాజం మీద పడుతోందని,. అందుకే అందరూ చైతన్యంతో డ్రగ్స్ నిర్మూలనకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కలెక్టర్ ఈ సందర్భంగా నాషా ముక్త భారత్ లక్ష్యాలను వివరించి, డ్రగ్స్ మహమ్మారి నియంత్రణకు శాఖల వారిగా చెప్పట్టాల్సిన అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను గుర్తు చేశారు. సమాజంలో యువతను వ్యసనాల నుంచి రక్షించే దిశగా విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు కలిసికట్టుగా పని చేయాలని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, ఆబ్కారీ ఈ ఎస్ శ్రీనివాస్, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరుగు క్రీడలో రాణించిన కానిస్టేబుల్‌ను అభినందించిన సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సాయిరాం గత వారంలో క్లాషిల్లా వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ నిర్వహించిన అతి పెద్ద పరుగు పోటీలో సాయిరాం పాల్గొని సిల్వర్ మెడల్ ను సాధించాడు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సాయిరాం ను అభినందించడంతో పాటు రాబోవు రోజుల్లో మరిన్ని పతకాలను సాధించాలని, క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులను ప్రోత్సాహం అందించడం జరుగుతుందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్ రాజ్ హాజరైనారు.

## ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి



**ప్రజాపక్షం/గణపురం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని లక్ష్మారెడ్డి పల్లి గ్రామంలో సోమవారం విషాదం చోటు చేసుకుంది. లక్ష్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఓద్దుల రాం రెడ్డి (47) తన పొలంలో ట్రాక్టర్ కల్టివేటర్ కొడుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ మీద పడడంతో రాంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కుమారుడు కూతురు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి



కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** ప్రజావాణి దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డియార్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి, ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి, నర్సంపేట ఉమారాణిలు పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 121 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ 53, హౌసింగ్ 14 దరఖాస్తులు వచ్చాయని మిగతా శాఖలకు సంబందించిన దరఖాస్తులు 54 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, పరిష్కరించుటకు వీలుకాని సమస్యలను ఎందుకు పరిష్కరించబడవో దరఖాస్తుదారునికి వివరించే ప్రయత్నం చేయాలని , ప్రజావాణి దరఖాస్తుల పరిష్కరించిన వివరాలు దరఖాస్తుదారుడి మొబైల్‌కి సాంకేతికంగా సమాచారం అందించేలా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఐ పెండెన్సీ లేకుండా చూడాలని, గ్రీవెన్స్ పోర్టల్ లో పెండెల్సీ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఈ ఫైలింగ్ విధానాన్ని అమలుచేయాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పని సరి అని జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. వ్యవసాయ, ఆరోగ్య, విద్యా శాఖ తదితర శాఖలు శాఖపరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నిర్ణీత గడువులోగాపనులుచేయించాలని పనులపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసి లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యా శాఖ విషయంలో టాయిలెట్లు, వాష్ రూమ్‌లో ఏవైతే మరమత్తులు చేయవలసి ఉన్నట్లైతే ఆయా స్కూళ్లను పరిశీలించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పనులు పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న నీటి ట్యాంక్ లను క్లీనింగ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ని, ఆర్ సి ఓ లను ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా కో.పరేటివ్ అధికారి నీరజ, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వప్రసాద్, వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, హార్టికల్చర్ అధికారి అనసూయ, డిబిసిడివో పుష్పలత, జ్ఞానేశ్వర్,అధికారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిస కాకూడదు




**ప్రజాపక్షం/వరంగల్‌క్రైమ్ :** అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం భాగంగా సోమవారం గవర్నమెంట్ మర్కజి హై స్కూల్ లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వలన వాటిల్లే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తద్వారా నేరాలకు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, నష్టాలు విద్యార్థులకు తెలిసి ఉండాలని, గంజాయి ఎవరైనా అమ్ముతున్నా, తాగుతున్నట్లు తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి తెలపాలని, హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరశురాములు, ఉమెన్ ఏ ఎస్సై లక్ష్మి , సిబ్బంది, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

## అన్ని కులాల అభ్యున్నతే ధ్యేయం



ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** అన్ని కులాల అభ్యున్నతే తన ధ్యేయం అని, ప్రజలిచ్చిన అవకాశాన్ని వారి అభ్యున్నతి,అభివృద్ధి కోసమే నిత్యం పాటుపడతానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ అలంకార్ జంక్షన్ వద్ద రూ.705.84 లక్షల సీఎంఏ నిధులతో నిర్మించనున్న ఉమ్మడి జిల్లా మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి గెలిపించిన వారందరికీ రుణ పడి ఉంటానని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి మున్నూరు కాపుల డిమాండ్ తీసుకు వెళ్లి ఈ రోజు ఇంతటి మహోత్తర కార్యక్రమానికి ఆజ్యం పోసుకున్నానని తెలిపారు. మీరిచ్చిన ఈ అవకాశాలను ప్రతి సందర్భంలో ప్రజల కోసమే పనిచేయాలని కృతనిశ్చయంతో ముందుకు వెళ్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరం శంకుస్థాపన చేసిన ప్రతి పనిని నిర్ణీత సమయంలో పూర్తిచేస్తున్నామని, కాలయాపన చేసేతత్వం మా ప్రభుత్వానికి లేదని అన్నారు. సకాలంలో కాపు భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తే ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తానని, వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. రాజకీయంగా,వ్యక్తిగతంగా నాకున్న మిత్రులలో అధికులు మున్నూరు కాపు వారేనని, నా అభ్యున్నతి ఆలోచనల్లో చాలా వరకు భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ జిల్లా నాయకులు, కార్పొరేటర్‌లు, కాంగ్రెస్ నాయకులు ఈవి శ్రీనివాస రావు, తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, వేల్పుల మోహన్ రావు, గండె క్రిష్ణ, కనుకుంట్ల రవికుమార్, పుప్పల రజినీకాంత్, బక్కి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


## నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అనుమతులను తుంగలో తొక్కి, జీవో నెంబర్ 1,10,92,42 లను ఉల్లంఘించి ఇష్టానుసారంగా ఫీజులు పెంచి , పెంచిన ఫీజులను నోటీసు బోర్డులో పెట్టకుండా , నియమ నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, వరంగల్ జిల్లాలో ఉన్నటువంటి నారాయణ విద్యా సంస్థలను ప్రభుత్వ అధికారులు తనిఖీలు చేసి అనుమతి లేని వాటిని మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, విద్యార్థి నాయకులు అనిల్, రాజు ,రాకేష్ పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ దాసరి వెంకటరాములు, సింగు కాలనీల శాఖా మహాసభ అక్కినపల్లి శ్రీను, గుగులోత్ వీరేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు రిజిష్ట్రేషన్ లేకున్నా పట్టాలు లేకున్నా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన సర్టిఫికెట్ కావాలని, 67గజాల్లోనే కట్టాలని అధికారులు కొర్రీలు పెట్టి మంజూరి అయిన ఇండ్లను లాగేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులతో చర్చలు జరిపి పేద ప్రజలకు ముఖ్యంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరి అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలతో పెరుగు కుమార్,చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, ఎర్రోజు పద్మ, ఆలేటి మహేష్, అక్కినపల్లి శ్రీనివాస్,గుగులోత్ వీరేందర్, హట్యానాయక్, దస్తగిరి, కేదాసు లావణ్య, చెక్కల సురేష పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ స్నేహ శభరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** హైదరాబాద్ బంజార హిల్స్ రోడ్ నెం 14 కెబిఆర్ పార్క్ కు ఎదురుగా గల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (యుపిఎస్‌సి) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సియస్ఎటి) 202526 విద్యా సంవత్సరం ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం కరపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ 33 జిల్లాలకు చెందిన నిరుద్యోగులైన, అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాల వారు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ. 3లక్షలు మించకుండా ఉన్నటువంటి వారు http://tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్ లో మాత్రమే 07–07–2025 వరకు దరఖాస్తు జేసుకోవలసిందిగా సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 13–07–2025 రోజున ఎంపిక పరీక్షా నిర్వహించడం జరుగుతుందని, ప్రవేశ పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ప్రవేశం కల్పించి యస్సీ స్టడీ సర్కిల్ బంజార హిల్స్ హైదరాబాద్ లో సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు 10 మాసాల పాటు ఉచిత వసతి భోజనంతో కూడిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరి కోరారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డిఆర్‌ఓ వై.వి.గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, నారాయణ, డి ఆర్ డి ఓ మీనా శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి బి నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, తెలంగాణ యస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖా సంచాలకులు డాక్టర్.కె. జగన్ మోహన్, కనకన్న తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కట్కూరి అశ్విని జ్ఞాపకార్థం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2024 2025 పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్తన్న మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి తొలి పరీక్ష అని తన ప్రతిభకు తొలి పట్టా అని,విద్యార్థి జీవితంలో తొలి మధుర జ్ఞాపకమని ఏ విద్యా ఫలితంలోనైనా ముగ్గురి కఠోర శ్రమ దాగి ఉంటుందని గురువు, విద్యార్థి, తల్లిదండ్రుల సమిష్టి కృషి ప్రోత్సాహం వల్లే ఉత్తమ ఫలితాలు సాధించడం జరుగుతుందని అన్నారు.6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలో ఉంటూ కష్టపడి చదివి మొదటి స్థానం సాధించడం చాలా గొప్ప విషయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇష్టంతో మంచి ఉన్నతమైన చదువులు చదివి పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవ చేసే స్థాయికి ఎదగాలని కోరారు. విద్యా సముపార్జన ద్వారా మాత్రమే మనిషి ఉన్నత స్థాయికి చేరుకోగలడని, తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో డయేరియా క్యాంపెయిన్ 2025ను ప్రారంభించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 16వ తేదీ నుండి జులై 31 వరకు చేపడుతున్న డయేరియా ప్రచారం విస్తృతంగా చేపట్టాలని, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో, సబ్ సెంటర్లలో, పీహెచ్‌సీలలో, జిల్లా స్థాయిలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

**ప్రజా సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి**

ప్రజా సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల వద్ద నుండి విజ్ఞాపనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 74 విజ్ఞప్తులు రావడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి సాధించాలన్నారు. ఈ గ్రీవెన్స్‌డేలో డిప్యూ కలెక్టర్లు సుహాసిని, హనుమంత్ నాయక్, ఆర్డీవోలు గోపిరామ్, డీఎస్ వెంకన్న, డీఆర్డీవో వసంత, అధికారులు పాల్గొన్నారు.

## మృతుడికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ 65వ డివిజన్ పరిధిలోని నిరూపునగర్ తండాకి చెందిన భూక్య శంకర్‌నాయక్ తండ్రి భూక్య మంజ్య అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు మహ్మద్ చోటే, పోలెపల్లి బుచ్చిరెడ్డి, 65వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యాల రాంరెడ్డి, 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు,రమేశ్‌గౌడ్, విజయ్‌నాయక్, సదానందంగౌడ్, రవినాయక్, తిరుపతి నాయక్, వీరస్వామి నాయక్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడదాకా వచ్చిన సమస్యల పరిష్కారమవుతాయనే ఎంతో ఆశతో దరఖాస్తులు సమర్పిస్తుంటారని, వారి ఆశలను అడియాశలు చేయరాదన్నారు.
ప్రతి దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై నివేదికలు ఇవ్వాలన్నారు.

## డ్రోన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రస్తుత సమాజంలో డ్రోన్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మహిళలకు డ్రోన్లపై శిక్షణ అందించనున్నట్లు, ఆసక్తి గల మహిళలు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా ప్రాంగణ అధికారి వెల్పుల విజేత సోమవారం తెలిపారు. పంటల సాగులో డ్రోన్లను వినియోగిస్తున్నారని ఆమె తెలిపారు. పొలంలో విత్తనాలు వేయుటకు, పురుగు మందు పిచికారి చేయుటకు నేటి ఆధునీక సమాజంలో డ్రోన్ పరికరాలను విరివిగా వినూత్నంగా ఉపయోగిస్తున్నారన్నారు. పదవ తరగతి చదువుకున్న మహిళలకు డ్రోన్ శిక్షణ మహిళా ప్రాంగణంలో అందించనున్నట్లు ఆమె తెలిపారు. రాబోయే కాలంలో వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా ఉన్న మహిళలు ఈ శిక్షణ తీసుకుంటే వారికి శిక్షణతో పాటు డ్రోన్ పరికరాన్ని కూడా సబ్సిడీలో అందిస్తామని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న పదవ తరగతి పూర్తి చేసిన మహిళలంతా మహిళా ప్రాంగణం టేపాంగణం (ఖమ్మం) నందు ఈనెల 24 నుంచి 28 లోపు తమ దరఖాస్తులను అందించాలన్నారు.ఏమైనా సందేహాలు ఉంటే 7660022512 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.



## అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/కారేపల్లి :** అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉసిరికాయల పల్లి గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు ఎస్‌కె.అమీర్ జమాల్‌పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన అమీర్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అమీర్ నిబద్ధత గల కార్యకర్త అని, క్రమశిక్షణ కలిగి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని కొనియాడారు. అదేవిధంగా భాగ్యనగర్ తండాకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు గుగులోతు మాంగో ఇదే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడని తెలుసుకొని ఫోన్లో ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. ఆయన వెంట సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబు, కె.సారయ్య, ఏపూరి లతాదేవి, శివ రామకృష్ణ, సిపిఐ నాయకులు బంధం నాగయ్య, ఉంగరాల సుధాకర్, పాపినేని సత్యనారాయణ, పుచ్చకాయల శ్రీనివాసరావు, బట్టు సంగయ్య, దల్‌సింగ్, పుచ్చకాయలపల్లి శాఖ కార్యదర్శి అమరు, సహాయ కార్యదర్శి రెడ్డిబోయిన రవి, పలువురు సిపిఐ కార్యకర్తలు, సానుభూతిపరులు అమీర్ భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.



## తక్షణమే రహదారి మరమ్మతులు

### సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ వైరా మధిర ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన ప్రజావాణిలో ప్రత్యేక అధికారులను సోమవారం కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైరా మధిర ప్రధాన రహదారిపై బోనకల్ క్రాస్ రోడ్డు, రావల్లి స్టేజ్, బ్రాహ్మణపల్లి, కలకోటల వద్ద రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోడ్డుపై పెద్ద గుంటలు పడడంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లో రోగులను మధిర, ఖమ్మం ప్రాంతాలకు చేర్చడానికి ప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. రోడ్డు దెబ్బతిని గుంటలపడ్డ ప్రదేశాల్లో వర్షపు నీరు చేరి ప్రమాదంగా మారాయని అన్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం మండల సమితి సభ్యులు కొంగర భాస్కర్‌రావు, గుంపుల జయ రాజు, జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం రోడ్డెక్కిన నిరుపేదలు

### వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సొంతగూడు ఏర్పడుతుందని భావించిన నిరుపేదలకు నిరాశే మిగిలిందని, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో నిరుపేదలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. సోమవారం వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించగా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్, సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో సుమారు 729 ఇండ్లు మంజూరు కాగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏలూరుగూడెం గ్రామానికి సుమారు 39ఇండ్లు మంజూరయ్యాయని, మండల పరిధిలోని 40 గ్రామ పంచాయతీల్లో ఏ ఒక్క గ్రామంలో అర్హులకు ఇండ్లు రాలేదని ఆరోపించారు. గ్రామంలో సుమారు 55ఇండ్లు మంజూరుకాగా, దానిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు, కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన ప్రజాపంథా నాయకులకు ఇల్లు కేటాయించారని, ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరుమలాయపాలెం ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమకు ఇల్లు కేటాయించాలని అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు చామకూరి రాజు, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, చల్ల వెంకటేశ్వర్లు, పప్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### సిపిజి జిల్లా కౌన్సిల్ మెంబర్ ఫహీమ్ దాదా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మిషన్ భగీరథ పనులు అంటూ రామవరం మార్కెట్ లోని రోడ్డును రెండు సార్ల తొవ్వి ఆలస్యం అవుతుంటే రామవరం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఫహీమ్ దాదా అన్నారు. మిషన్ భగీరథ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ. రామవరం మెయిన్ మార్కెట్ అయినటువంటి రోడ్డును గత రెండు మూడు నెలల క్రితం మిషన్ భగీరథ పైప్లైన్ కొరకు జెసిబి లతో తవ్వి మరల ఇప్పుడు తవ్వి పనులు ఆలస్యం అవుతుంటే రామవరం వ్యాపారస్తులు స్కూల్స్, కాలేజీలకు, వెళ్లే విద్యార్థులకు రామవరం ప్రజలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని త్వరగా పనులు పూర్తి చేయాలని బగిరాధ సిబ్బంది ని ఆయన కోరారు. ప్రజా నాయకులు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు గత నెల క్రితం రామవరం వచ్చి రోడ్డును చూసి త్వరగా పనులు పూర్తి చేసి రామవరం వ్యాపారస్తులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డును నిర్మించాలని అధికారులను ఆదేశించారని ఆయన వ్యాపారస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దబ్బేటి గురుమూర్తి, ఖయ్యూం, మర్రి గోపి, వంశీ, దాసు, రణధీర్, అల్లకొండ గోపి, శ్యామ్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అనంతరం సిసి రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలల ప్రహరీ గోడలు, అంతర్గత రహదారుల విస్తరణ, గ్రామీణ విద్యుత్ సరఫరా, విద్యుత్ లైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా రూ.12వేలు పెట్టుబడి సాయం, మహిళా శక్తివంటి ప్రత్యేక పథకాలు, సన్నరకం వరి ధాన్యానికి బస్తాకు రూ.500బోనస్ అందించడం, గ్యాస్ సబ్సిడి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, విద్యార్థులకు మెరుగైన విద్య వంటి తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించడం అత్యవసర సర్జరీ కోసం ఎల్ఓసి రూపంలో ఉచిత ట్రీట్మెంట్ అందించడంలో రాష్ట్ర వ్యాప్తంగా ముందు వరుసలో ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ డిఇ శ్రీధర్, ఎఈ అక్షిత్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డి.సలీం, ఎఇ సతీష్, మండల మాజీ అధ్యక్షులు తుమ్మా రాంబాబు, మండల నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, ఫణి, మిండ హరి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు : సిపిఐ

**ప్రజాపక్షం/ఖమ్మం :** నగరంలో సొంత ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా డిమాండ్ చేశారు. జీవనోపాధి కోసం నగరానికి వచ్చిన పేద, మధ్యతరగతి ప్రజలు నివాస స్థలాలు లేక, ఉండేందుకు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం వన్‌టౌన్ ఏరియా సమావేశం వన్‌టౌన్ సిపిఐ కార్యాలయంలో సాధునాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా పట్టణంలో ఉన్న పేదలకు నివాస స్థలాల పంపిణీ జరగలేదని, పేదలందరికీ నివాస స్థలాలు పంపిణీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ మహాసభలను పూర్తిచేసుకోవడం జరిగిందని వన్‌టౌన్, త్రీటౌన్, హవేలీ ఏరియా మహాసభలను పూర్తి చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. నగర మహాసభలో పార్టీ పోరాట కార్యాచరణను రూపొందించుకుని అందుకు అనుగుణంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, వన్‌టౌన్ ఏరియా నాయకులు మాలకొండయ్య, మాదుగుల నాగేశ్వర రావు, సిద్ది శ్రీను, సామ్యూల్, భూపాల్ రెడ్డి, రవి, నాగమణి, శీలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం నగరం పంపింగ్ వెల్ రోడ్డు గ్రెయిన్ మార్కెట్ ప్రాంతానికి చెందిన కొప్పు ప్రభావతి, కొప్పు పద్మావతి, కొప్పు సంపత్‌కుమార్‌లు తమ ముగ్గురికీ 30వ డివిజన్‌లో సర్వే నెం.135, 136లో 4,716 గజాల స్థలం ఉందని, ఇందులో 616 గజాలు నగర పాలక సంస్థ అక్రమించి పార్కు కట్టారని, తమ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చింతకాని గ్రామానికి చెందిన పి.జగన్నాథం తాను నిరుపేద దివ్యాంగుడినని, తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన సిహెచ్.రామారావు సర్వే నెం. 220లో 2.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దీనిని కాలువ ఎలైన్‌మెంట్ కోసం సేకరణ చేశారని, మారిన ఎలైన్‌మెంట్ ప్రకారం 1.20 ఎకరాలు మాత్రమే సేకరించారని, సేకరించిన భూమిలో 1.07 ఎకరాల భూమి మిగిలి ఉందని, తిరిగి దానిని తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం బొట్లకుంట గ్రామానికి చెందిన గుర్రం అమృతమ్మ తన భర్తకు అంగవైకల్యం ఉందని తాము చాలా పేదరికంలో ఉన్నామని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులు పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వొ ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివొ సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎవొ సిహెచ్.స్వామి పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన బాల నాగన్న(41) ప్రతిరోజులాగానే సోమవారం ఉదయం 8గంటల సమయంలో పాటి వెంటేశ్వరరావు పొలంలో ఉన్నతాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో చెట్టు పై నుంచి జారిపడి తలకు, కుడికాలుకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టుగా తెలిపారు. భార్య బాలనాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

### ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అనుమతి లేకుండా పాఠశాల నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు చట్టాన్ని ఉల్లంఘిస్తూ స్టేషనరీ పేరుతో బుక్ స్టోర్‌ను ఏర్పాటు చేసిన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ వారం రోజుల క్రితం నారాయణ పాఠశాలలోని స్టేషనరీ గోడౌన్‌ను విద్యాశాఖాధికారులు సీజ్ చేశారని, అయినా దొడ్డిదారిన బుక్స్ విక్రయాలు కొనసాగిస్తున్నారన్నారు. నారాయణ పాఠశాలకు ప్రైమరీ సెక్షన్‌కు అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. అనుమతి లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు మాత్రం ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రామకృష్ణ ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తున్న నారాయణ విద్యా సంస్థలతో పాటు అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, గోపి, హరికృష్ణ, విజయ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

### విద్యార్థులతో సిపి సునిల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సిపి పాల్గొని మాట్లాడారు. తొలుత విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ సరదాగా అలవాటు అయిన మత్తుపదార్థాలు తరువాత బానిసలుగా మారుస్తాయన్నారు. గతంలో సిగరెట్టు, మద్యంతో సరిపెట్టుకునే యువత నేడు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు యువత బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సమాజంలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో యువత భాగస్వాములు కావాలన్నారు. వీటి నిర్మూలన కోసం నషాముక్త్‌భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహించి మత్తుపదార్థాల వాడకం కలిగే అనార్థలను తెలియజేస్తున్నామన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసలైనట్లు గుర్తిస్తే వెంటనే తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో (టిజిఎ ఎన్‌బి) టోల్ ఫ్రీ నెంబర్ 1908, డయల్ 100కు కానీ సమీపంలోని పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఎసిపి ఎస్‌వి.రమణమూర్తి, టూటౌన్ సిఐ బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశాంత, మండల విద్యాశాఖాధికారిణి శైలజాలక్ష్మి, ఉపాధ్యాయులు కట్టా శేఖర్‌రావు, సుజాత, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

### సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి.కళావతిబాయి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే అవకాశం ఉందని వీటి నియంత్రణకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు అవగాహన లేకుండా ఉండడం వల్ల, సరైన పారిశుధ్యం లేని ప్రాంతాల్లో అధికంగా వస్తుంటాయని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో నియంత్రించగలమన్నారు. చికిత్స కంటే నివారణ ఎంతో మేలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వల్ల డయేరియా అధికంగా వస్తుందని ఇది పిల్లలకు తొందరగా అటాక్ అవుతుందన్నారు. ప్రతి పిహెచ్‌సి సబ్ సెంటర్ల వద్ద అవసరానికి మించి 10శాతం బఫర్ స్టాక్‌తో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో దీనిపై చర్చ పెట్టాలన్నారు. గత సంవత్సరం అధికంగా కేసులు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా ఎంపిక చేసి అక్కడ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల వద్ద ఎటువంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరగకుండా స్పెషల్ శానిటేషన్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని తక్కువ ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ప్రజాపక్షం/కామేపల్లి :** కామేపల్లి ఇల్లందు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇల్లందు నియోజకవర్గ ఎంఎల్‌ఎ కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కామేపల్లిలో పలు గ్రామాలకు మంజూరైన, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ అని, మొదటి విడతలో ఇండ్లు రాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని అన్నారు. రానున్న మూడేళ్లలో దశల వారీగా, అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరు చేసి ఆదుకుంటామన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, తహసీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపిడిఒ జీ రవీందర్, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ షాపు డీలర్లతో తహసీల్దార్ సమీక్షా సమావేశం

### రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కి తరలిస్తే కఠినచర్యలు

### రేషన్ బియ్యం తరలింపుపై కలెక్టర్ సీరియస్

### వైరా తహసీల్దార్ శ్రీనివాసరావు

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/వైరా :** ప్రజాపంపిణీ బియ్యం పక్కదారి పడుతూ ఉంది. దళారులు డీలర్ల మిల్లర్లతో కుమ్మక్కై తరలిస్తున్నారనే కథనాన్ని 'ప్రజాపక్షం' దినపత్రికలో వరుసగా ప్రచురించడం జరిగింది. ఈ కథనంతో స్పందించిన సివిల్ సప్లై, రెవిన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం వైరా తహసీల్దార్ శ్రీనివాసరావు మండలంలోని డీలర్లను పిలిపించి తహసీల్దార్ కార్యాలయం నందు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపు నుండి బియ్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు చేరాలి. లబ్ధిదారులు రేషన్ కార్డులు నుంచి వేలిముద్రలు వేయించుకొని డబ్బులు ఇచ్చి బియ్యం ఉంచుకోవడం, దళారులకు బియ్యం అమ్మడం, మిల్లర్లతో కుమ్మకు కావడం లాంటివి జరిగితే సహించేది లేదని, ఇప్పటికే రేషన్ షాపుల నిర్వాహణపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బియ్యాన్ని విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ప్రతీ రేషన్ షాపు వద్ద నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు రేషన్ ఇవ్వాలి. అలాకాకుండా రేషన్ ఇవ్వకుండా వేలిముద్ర వేసుకొని డబ్బులు ఇచ్చి పంపిస్తున్న విషయం తెలిస్తే సహించేది లేదన్నారు. కొంతమంది డీలర్లు, దళారులు డీలర్ షాపులు పెట్టుకొని పంపిస్తున్న విషయం మా దృష్టికి వస్తుందని, అలాంటివి మరల పునరావృతం అయితే సహించేది లేదని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, విక్రమ్ పాల్గొన్నారు.

# క్రీడ


## ఇతర రాష్ట్రాలకు ఆడాలని ఉంది

### దయచేసి ఎన్‌ఓసి ఇవ్వండి : పృథ్వీ షా



దేశవాళీ సీజన్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ భారత యువ క్రికెటర్ పృథ్వీ షా కీలక నిర్ణయం తీసుకున్నాడు. కొన్నాళ్లుగా ముంబై ప్రాతినిధ్యం వహిస్తున్న షా కొత్త జట్టుకు మారాలనుకుంటున్నాడు. అందుకని ఆలస్యం చేయకుండా ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు లేఖ రాశాడు. తనకు ఈ సీజన్‌లో రాష్ట్ర జట్టుకు ఆడాలనే ఉద్దేశం లేదని.. ఇతర రాష్ట్రాల జట్టు నుంచి ఆఫర్ వస్తున్నాయని ఆ లేఖలో పేర్కొన్నాడు షా.. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అభ్యర్థించాడు. గత సీజన్‌లో ఫిట్‌నెస్ లేదంటూ అతడిని రంజీ ట్రోఫీ స్క్వాడ్ నుంచి తప్పించింది ఎంసీఏ. దాంతో, ఈసారి కూడా పక్కనపెడితే తన భవిష్యత్ నాశనం అవుతుందనుకున్న షా.. ముంబైని వీడేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని సోమవారం ఎంసీఏ మీడియాకు వెల్లడించింది. 'ఎన్‌ఓసీ కావాలని పృథ్వీ షా మాకు ఉత్తరం రాశాడు. ఈ విషయాన్ని మేము అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాం. అతడికి తప్పకుండా ఎన్‌ఓసీ మంజూరు చేస్తాం' అని ఎంసీఏ సెక్రటరీ తెలిపాడు. క్రిక్‌బజ్ కథనం రాసుకొచ్చింది. ఎన్‌ఓసీ కోసం రాసిన లేఖలో షా తన కెరియర్ పుంజుకొనే అవకాశాన్ని ప్రస్తావించాడు. తనకు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడేందుకు అవకాశాలు వస్తున్నాయని తెలిపాడు. 'ప్రస్తుతం నా కెరియర్ మీద దృష్టి సారించాలనుకుంటున్నా. ఇతర రాష్ట్రాల బోర్డుల తరఫున ప్రొఫెషనల్ క్రికెట్ ఆడాలనుకుంటున్నా. నన్ను నేను మెరుగుపరుచుకోవడంతో పాటు క్రికెటర్‌గా మునుపట్లో ఆడినట్టు ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా. కాబట్టి దయచేసి నాకు ఎన్‌ఓసీ ఇవ్వండి. అప్పుడు నేను అధికారికంగా దేశవాళీ సీజన్‌లో ఇతర జట్టుకు ఆడగలను' అని షా తన లేఖలో వెల్లడించాడు.

## ఈ సీజన్‌లో నా లక్ష్యమదే : నీరజ్



ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ సీజన్‌ను ఘనంగా ఆరంభించాడు. 90 మీటర్ల మార్క్ అందుకున్న జావెలిన్ స్టార్ ప్యారిస్ డైమండ్ లీగ్ టైటిల్ విజయంతో రికార్డు నెలకొల్పాడు. అంతటితోనే సంతృప్తి చెందకుండా తన తదుపరి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడీ బడిసె వీరుడు. ఈసారి వరల్డ్ ఛాంపియన్‌షిప్ గెలుపొందడమే టార్గెట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పాడు నీరజ్. మంగళవారం జరుగనున్న గోల్డెన్ స్పైక్ అథ్లెట్ సమావేశంలో నా అల్టిమేట్ గోల్‌ను నిర్ధయించుకుంటానని తెలిపాడీ ఛాంపియన్. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెంజీని కోచ్‌గా నియమించుకున్నా. ఆయనతో కలిసి నా ఆట, టెక్నిక్‌ను మరింత మెరుగుపరుచుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ఈ మధ్యే 90 మీటర్ల దూరం ఈటెను విసిరాను. దాంతో, సీజన్‌లో మరిన్ని అద్భుత ఫలితాలు సాధిస్తాననే నమ్మకంతో ఉన్నాను. చెక్ రిపబ్లిక్‌లోని నింబక్‌లో శిక్షణ సంతృప్తికరంగా సాగింది. ఈ సీజన్‌లో నా ప్రధాన లక్ష్యం సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలవాలని భావిస్తున్నా అని నీరజ్ వెల్లడించాడు.

## ఐపిఎల్ విజయోత్సవాలపై బిసిసిఐ కఠిన నిబంధనలు



బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవ వేడుకలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 50 మంది కిపైగా గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఐపీఎల్ విజేతలు సెలబ్రేషన్స్‌కు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను రూపొందించింది. ఈ విషయాన్ని సోమవారం బోర్డు సెక్రెటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. తొక్కిసలాట ఘటనను బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తోందని వెల్లడించారు.



## దూకుడు పెంచిన రాహుల్, పంత్

హెడింగ్లే టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత జట్టు భారీ స్కోర్ దిశగా సాగుతోంది. నాలుగో రోజు తొలి సెషన్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8) ఔటైనా.. కేఎల్ రాహుల్(54 నాటౌట్) సంయమనంతో ఆడుతున్నాడు. మూడో రోజు కళ్లుచెదిరే కవర్ డ్రైవ్‌తో అలరించిన రాహుల్.. బ్రాండన్ కార్సే బౌలింగ్‌లో రెండు రన్స్ తీసి అర్ధ శతకం బాదేశాడు. మరోవైపు వైస్ కెప్టెన్ రిషభ్ పంత్(17 నాటౌట్) కూడా దూకుడు పెంచాడు. వీళ్లిద్దరు ఇప్పటికే నాలుగో వికెట్‌కు 34 రన్స్ జోడించారు. డ్రింక్స్ బ్రేక్ సమయానికి 3 వికెట్ల నష్టానికి 118 రన్స్ స్కోర్ చేసిన టీమిండియా 124 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప ఆధిక్యం సాధించిన టీమిండియా.. మ్యాచ్‌పై పట్టుబిగించే దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోర్ 90/2తో నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు కార్సే షాకిచ్చాడు. గిల్‌ను బౌల్డ్ చేసి ఇంగ్లండ్‌కు బ్రేకిచ్చాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన రిషభ్ పంత్(17 నాటౌట్) కూడా ఒక కార్సే ఓవర్లో లైఫ్ లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్(147), పంత్(138), యశస్వీ జైస్వాల్(101) సెంచరీలతో చెలరేగగా టీమిండియా 471 రన్స్ కొట్టింది. అనంతరం జస్ప్రీత్ బుమ్రా ధాటికి ఆతిథ్య జట్టు 465 పరుగులకు ఆలౌటయ్యింది. ఆ జట్టులో ఓలీ పోప్(106), హ్యారీ బ్రూక్ (99), బెన్ డకెట్(62)లు రాణించారు.

# ఫోకస్ | యువతరంగం


## ఎఐతో భావోద్వేగ అనుబంధం!

ఆశ్చర్యం కలిగించేదే అయినప్పటికీ, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ)తో ప్రజలు, ప్రధానంగా యువతీ యువకులు భావోద్వేగ అనుబంధాన్ని పెంచుకుంటున్నారు. తాజా అధ్యయనాల ప్రకారం ఇది సమాజిక పరిణామాలను, మానసిక విశ్లేషణ అంశాలను ప్రతిబింబిస్తున్నది. 21వ శతాబ్దం అనేది యంత్ర మానవ సంబంధాల శకం అని చెప్పవచ్చు. ఎఐ పట్ల మానవుల ప్రవర్తనలో అనేక మార్పులు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో, ఈ ఎఐ టూల్స్ పట్ల భావోద్వేగమైన అనుబంధం ఏర్పడుతోంది. ఇది ఏకకాలంలో సాంకేతిక, మానసిక, సామాజిక అంశాలు కలసిన



విస్మయకర దృశ్యం. మానసిక కోణాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. ఇటీవలి కాలంలో జీవనేతర వస్తువుల్లో (వస్తువులు, మిషన్లు) మానవ లక్షణాలు ఊహించే లక్షణాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని మానవీకరణ (Anthropomorphism)గా పేర్కొంటారు. ఫోన్లు, టేన్లు, కుర్చీలు, వాహనాలు, ఇతరత్రా వస్తువులతో మాట్లాడడం కొత్తేమీ కాదు. ఈ వస్తువులన్నీ తమను అర్థం చేసుకుంటాయని నమ్మేవారు ఉన్నారు. ఫలానా పెన్నుతో రాస్తే ఎక్కువ మార్కులు వస్తాయని, ఫలానా వస్తువను వెంట తీసుకెళితే విజయాలు సొంతమవుతాయని భావించే వాళ్లు నిత్య జీవితంలో ఎంతో మంది కనిపిస్తారు. ఈ నమ్మకాలకు అర్థం లేదు. కానీ, ఒంటరితనంలో ఉన్నవారు తమ మానసిక ఉల్లాసం కోసం ఏదైనా ప్రత్యామ్నాయం వెదుకుతారు. ఎఐ చాట్‌బాట్స్ నెమ్మదిగా ఆ ఖాళీని నింపే ప్రయత్నం చేస్తూ, వారిలో ఒక మానవతా భ్రమను కలిగిస్తాయి. మానవ మానసిక శాస్త్రంలో ఉన్న ఆత్మీయత సిద్ధాంతం ప్రకారం, మనిషి మనోజీవితానికి అనుబంధాలు అవసరం. ఈ అవసరాన్ని కొంతవరకు ఎఐ అనుకరణాత్మకంగా తీరుస్తోంది. మానసిక కోణంతోపాటు సామాజిక కోణాన్ని కూడా ప్రస్తావించుకోక తప్పదు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా మనం ఏర్పరుచుకునే బంధాలను డిజిటల్ ఇంటిమసీ అంటారు. ఈ తరహా సంబంధాలు వాస్తవిక సంబంధాల స్థానంలో నిలుస్తున్నాయి. ఇవి ఒకవైపుగా ఉండే భావోద్వేగ సంబంధాలు పెరుగుతాయి. ఉదాహరణకు సెలబ్రిటీ, యూట్యూబర్, లేదా ఎఐ చాట్‌తో. యూజర్, ఎఐతో సన్నిహితమైన అనుభూతి కలిగి ఉన్నా, మరోవైపు అది పూర్తిగా నిర్మితమైన బోధన. సాంప్రదాయ బంధాలు తగ్గిపోతున్న ఈ కాలంలో, ఎఐ బాట్స్ వంటి వాటి ద్వారా సాంస్కృతిక స్థాయిలో కొత్త రకాల 'సహచరత్వం' తలెత్తుతోంది. ఇది ప్రత్యేకించి జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. యువత ఇలా యంత్రాలతో, యాంత్రిక వ్యవస్థలతో భావోద్వేగ సంబంధాలను పెంచుకోవడం కొన్ని సందర్భాల్లో ప్రతికూల పరిస్థితులకు దారితీయవచ్చు. ఈ వైఖరి నైతిక, మానవ విలువలను ప్రశ్నిస్తుంది. ఎఐతో ఉన్న సంబంధం సత్యం కాని సాంత్వనమన్నది నిజం. కాబట్టి, ఎఐతో సంబంధాలు నిజమైన మానవ సంబంధాల స్థానాన్ని ఎన్నటికీ భర్తీ చేయలేవు. దీనివల్ల ప్రేమ, అనుబంధం, బాధ్యత వంటి భావాలు అర్థహీనమవుయి. కొన్ని విపరీత ఘటనలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఉదాహరణకు ఎఐ వ్యక్తిగత సహచారిగా పనిచేసే రెప్లికా యాప్‌తో చాలా మంది వినియోగదారులు పెళ్లి చేసుకున్నట్టు భావించారు, తమ ప్రేమ, కష్టాలు ఇందులో పంచుకున్నారు. చాలా మంది వినియోగదారులు చాట్‌జిపిటికి కూడా 'నీవు నాకు అత్యంత సమీప మిత్రుడివి' అని సందేశాలు పంపుతున్నారు. వీరిలో అత్యధికులు యువతీయువకులే అన్నది నిజం. ఏదిఏమైనా ఎఐతో మానవులు ఏర్పరుచుకునే భావోద్వేగ బంధాలు నూతన యుగపు మార్పు సంకేతం. ఇవి సమాజంలో ఒంటరితనం, డిజిటల్ ఆధారిత జీవితం, సంబంధాల మార్పు అనే అంశాలను ప్రతిబింబిస్తున్నాయి. అయితే, మానవ సంబంధాల సౌందర్యం, లోతు, బాధ్యతలను పూర్తిగా భర్తీ చేయలేవు. ఎఐ అనేది మనిషికి తోడు, ప్రత్యామ్నాయం కాదు అనేది గుర్తుంచుకోవాలి.

## విద్యానాణ్యత అవసరం





విద్య అనేది వ్యక్తి జీవితం, సమాజ అభివృద్ధి యొక్క పునాది. కానీ కేవలం విద్య సాధించడం మాత్రమే కాకుండా, ఆ విద్యలో నాణ్యత ఉండటం అత్యంత కీలకం. నాణ్యమైన విద్య తేలికగా ఉపయోగపడే జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యాలను అందిస్తుంది. ఆధునిక, సమగ్ర, సమయానుకూలమైన పాఠ్యాంశాలు విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తాయి. విద్యార్థులకు అలాంటి నాణ్యమైన విద్య లభించాలంటే, అధ్యాపకులకు నైపుణ్యం ఉండాలి. ప్రత్యేక శిక్షణ అత్యవసరం. వాస్తవిక అనుభవాల ద్వారా నేర్చుకునే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించాలి. సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండే విద్యా విధానం అమలుకావాలి. నాణ్యత విద్య అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఇది వ్యక్తిగత అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుంది. సరైన విద్య తగిన ఆలోచనా శక్తిని, సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ఉద్యోగ అవకాశాల కోసం కూడా ఇది అవసరం. మార్కెట్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలు కలిగి ఉండటం తప్పనిసరి. సమాజం పట్ల బాధ్యతతో, సౌహార్దంతో వ్యవహరించే వ్యక్తుల పెరుగుదలకు దారితీస్తుంది. నైపుణ్యం పెరిగిన వారు దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్తారు. ఎన్నో రకాలుగా ఉపయోగపడే నాణ్యత గల విద్య కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముందుగా పాఠ్యాంశాల నవీకరణ జరగాలి. అధ్యాపకుల శిక్షణ, ప్రేరణ విద్యా వ్యవస్థలో అంతర్భాగం కావాలి. సాంకేతికతతో బోధన విధానాలను సమన్వయం కుదుర్చుకోవాలి. ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించాలి. మూల్యాంకనం విధానాలలో నాణ్యత పెంపొందించాలి. అయితే, నాణ్యత విద్యను అందించడానికి కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో ముఖ్యమైనది ఉపాధ్యాయులకు తగిన శిక్షణ లేకపోవడం. అంతేగాక, కాలం చెల్లిన పాఠ్యాంశాలు, తగ్గిన ప్రాసంగికత, అవసరాలకు సరిపడని విద్యాసౌకర్యాలు వంటి సమస్యలు నాణ్యమైన విద్యను అందించడానికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అదే విధంగా సోషల్ మీడియా వంటి వివిధ కారణాలతో విద్యార్థుల ఆసక్తి తగ్గడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. ఇలాంటి అడ్డంకులను అధిగమించి, విద్యంలో నాణ్యత కలిగి ఉండటం అవసరం. ఇది కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, సమాజ, దేశాభివృద్ధికి ప్రధాన మూలధనం. అందుకే విద్యా సంస్థలు, ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి నాణ్యతను పెంపొందించేందుకు కృషి చేయాలి.

## ప్రజలకు అండ సిపిఐ జెండా

### సిపిఐ జిల్లా కార్యదర్శి..ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ (గుర్రంపోడు):** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ జెండా నిలబడి పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు.ఆదివారం గుర్రంపోడులో జరిగిన సిపిఐ మండల 15వ మహాసభ లో ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసిన నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విధంగా మళ్ళీ సిలిండర్ ధర పెంచడం అన్యాయమని అన్నారు.పండించిన పంట కు గిట్టుబాటు ధర మరియు, ఎరువులు విత్తనాలు సబ్సిడీ మీద ఇవ్వాలని అన్నారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రధాన సమస్య అయిన పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి జిల్లాకు సాగునీరు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని . కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజాచారి,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బి జగన్, మండల కార్యదర్శి రేపక లక్ష్మీపతి,నాంపల్లి మండల సిపిఐ కార్యదర్శి ఎస్ రమేష్, మండల నాయకులు రామచంద్రరావు,మాజీ జడ్పీటీసీ వెంకయ్య, మదార్, శంకరాచారి , యాదయ్య,నరసింహ,అమీర్, బి అంజయ్య ఇస్తారీ బి శ్రీను. కే నరసింహ చారి పర్వత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతను మింగేస్తున్న 'రిటైర్డ్' నియామకాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రైల్వే బోర్డు తీసుకున్న పదవీ విరమణ చేసిన ఉద్యోగుల తిరిగి నియామక నిర్ణయం దేశంలోని నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయమని, దీన్ని తక్షణమేఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి సమయంలో, గ్రూప్ సి, గ్రూప్ బి వర్గాల రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకొచ్చే నిర్ణయం అర్థరహితం. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

## దోపిడీదారులను తరిమికొట్టేవరకు సిపిఐ పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్

### మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** మాజీ సర్పంచులు ప్రభుత్వ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, దోపిడి దారులను తరమి కొట్టే వరకు సిపిఐ పోరాటాలు కొనసాగిస్తుందని పేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇంటి స్థలాలకేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. సదాశివ పేట దేశాన్ని దోచుకుంటున్న దోపిడీదారులను తరమి కొట్టే వరకు సిపిఐ పోరాటం చేస్తుందిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాలంలో చేసిన పనులకు మాజీ సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్ అన్నారు. సదాశివ పేట లోని సిపిఐ 6 మండల మహాసభలు సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దయనీయు పరిస్థితి నెలకొందని పేద ప్రజలు చికిత్స ల కోసం మా దృక్ప త్రికి వెళితే మందులు లేక వైద్యులు కొరతతో హైదరాబాద్ రెపర్ చేస్తున్నారని దీంతో జిల్లాలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వెంటనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ స్పందించి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు 100 గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వ భూముల్లో కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. పేద ప్రజల సంక్షేమాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ పూర్తిగా విస్మరించిందన్నారు. పేదలకు ఇంటి స్థలాలను పంఫిణి చేయడంలో సిపిఐ నారాయణరెడ్డి కాలం నుండి ఇప్పటి వరకు ఇంటి స్థలాలను వేలాది మందికి పంచిన చరిత్ర సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సదాశిపపేట ఏఐటియుసి మండల కార్యదర్శిగా శంకరప్ప సిపిఐ మండల కార్యదర్శి షఫీ అహ్మద్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెమమాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఏఐటియుసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరాజ్యం ,పాడి పరిశ్రమ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ రెడ్డి, నాయకులు రమేష్, బుజ్జమ్మ, రజిని ,జ్యోతి సాదిక్ అలీ ముస్తఫా అలీ ,ముస్తఫా పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత ఉండాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్లకేటాయింపులో అవకతవకలను అరికట్టి, అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 21, 22 తేదీలలో జిల్లాలో సిపిఐ నాలుగో మహాసభలు ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఈ మహాసభలో రామడుగు లక్ష్మణ్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్టు వెల్లడించారు. మొత్తం 51 మంది సభ్యులతో జిల్లా కౌన్సిల్‌ను, 16 మంది సభ్యులతో జిల్లా కార్యవర్గాన్ని మహాసభలోనే ఎన్నుకున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు విషయంలో కొన్ని చోట్ల అవకతవకలు జరుగుతున్నట్టు సమాచారం వస్తోందని, అర్హత లేని వారికి ఇళ్లు మంజూరవుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అనేవి రాజకీయాలకతీతంగా, పారదర్శకంగా కేటాయించాల్సినవని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నిజమైన పేదలకే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరోగ్యశ్రీ, పెన్షన్లు, రైతు భరోసా వంటి హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించి అర్హులైనవారికి పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, గిరిజనులు, బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ స్పందన తక్కువగా ఉందని విమర్శించారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తుమ్మిడి వద్ద కొనసాగించాలన్నది ప్రజల కోరిక అని చెప్పారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు ఇంటి స్థలాలు, 2025 లాభాల్లో వాటా ప్రకటించాలని, కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మద్దతు పొందిన ప్రజా సంఘాలు జిల్లాలో బలమైన నిర్మాణంతో ఉన్నందున, మంచిర్యాల జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఒక ఎకరం భూమిని కేటాయించి, ఆఫీసు నిర్మాణానికి బడ్జెట్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలిందర్ అలీ ఖాన్, మేకల దాసు, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, భీమనాథుని సుదర్శన్, ఇప్పకయల లింగయ్య, దాగం మల్లేష్, రేగుంట చంద్రకళ, ముస్కే సమ్మయ్య, మిర్యాల రాజేశ్వర్ రావు, గోపి, నక్క వెంకట స్వామి, చాడ మహేందర్ రెడ్డి, శంకరయ్య, దేవి పోచన్న పాల్గొన్నారు.

## 'రెడ్‌క్రాస్'కు ఇచ్చే కళాశాల స్థలాన్ని ఉపసంహరించుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రెడ్ క్రాస్ సంస్థకి ఇచ్చే కళాశాల స్థలాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం విషయంలో మా పార్టీ వారికి అందిన సమాచారం దృష్టిలో పెట్టుకొని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలించారు. భువనగిరి రెడ్ క్రాస్ సంస్థ వారు కళాశాల స్థలం కావాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లుగా తెలిసింది. ఇప్పటికే జూనియర్ కళాశాల స్థలం కొంత అన్యాక్రాంతం అయినదని ఇప్పుడు భువనగిరి రెడ్ క్రాస్ సంస్థ వారు కళాశాల స్థలం ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నట్లుగా తెలిసినదని ఆయన తెలిపారు. మేము మా పార్టీ అభ్యంతరం తెలియపరుస్తున్నాం. ఇట్టి స్థలం భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగ ఉంటుందని మరిన్ని విద్యా కళాశాలలు నిర్మాణం చేసుకోవాలి చెప్పారు. వందల సంఖ్యలో విద్యార్థులకు ఉపయోగముంటుంది, జిల్లా కేంద్రంలో ఈ ఒక్కటి మాత్రమే ఉన్నది రెడ్ క్రాస్ సంస్థకు దిన చర్యలు చాలా ఉంటాయి రోగుల సందడి ఉంటుంది కళాశాల స్థలం రెడ్ క్రాస్ సంస్థ వారికి ఇవ్వద్దని అభ్యంతరం తెలియజేశారు. మా పార్టీ స్థానిక నాయకులతో కలిసి కళాశాల స్థలాన్ని పరిశీలించి ప్రిన్సిపల్ పాపిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సిపిఐ భువనగిరి మండల పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మ య్య, పుట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 9న జాతీయ సార్వత్రిక సమ్మెకు తరలిరండి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో జులై 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య పిలుపునిచ్చారు. సోమవారంబద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతనజిల్లాకార్యవర్గ సమావేశం జరిగింది. సమ్మయ్య మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అత్యధిక సంఖ్యలో శ్రమిస్తున్న ప్రజల జీవితాలు, జీవన ఉపాధిపై తన కార్పోరేట్ విధానాల కుతంత్రాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు జీవన ఉపాధికి సంబంధించిన ప్రాథమిక హక్కులను దూరం చేస్తున్నదన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయం చేయడం జరిగిందని, జిల్లాలోని కార్మిక వర్గం విజయవంతం చేయాలని కోరారు. ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కెమసారం శ్రీనివాస్, కడారి బీరయ్య, కాళిదాసు, కొమురయ్య, రామారావు, సన్నీ, జక్కుల ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## బాధితులకు సత్వర న్యాయం : ఎస్‌పి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** వివిధ రకాల సమస్యలతో పోలీసులను ఆశ్రయించే బాధితులకు సత్వరన్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 21 మంది ఆర్జీదారులతో ఎస్‌పి అశోక్‌కుమార్ స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చే ఫిరాద్యులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు ఫెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుమంటామని చెప్పారు. బాధితుల పతి ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## వయొవృద్ధుల డే కేర్ సెంటర్ నిర్వహణకు 30లోగా దరఖాస్తు :వేణు గోపాల రావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వయో వృద్ధుల డే కేర్ సెంటర్ నిర్వహణకు ఆసక్తి గల వారు జూన్ 30 లోగా దరఖాస్తు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్ద పెల్లి జిల్లాలోని వయో వృద్ధుల కోసం డే కేర్ సెంటర్ ను ప్రభుత్వం మంజూరు చేసిందని, పెద్దపల్లి పట్టణంలో డే కేర్ సెంటర్ నిర్వహించడం జరుగుతుందని, దీనిని రిజిస్ట్ రిజిస్టర్ అయిన సీనియర్ సిటిజన్ అసోసియేషన్లకు అప్పగిస్తామని, 100 శాతం ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తుందని అన్నారు.డే కేర్ సెంటర్ నిర్వహణ సామర్థ్యం ఆసక్తిగల సీనియర్ సిటిజన్ అసోసియేషన్స్ జూన్ 30 సాయంత్రం ఐదు గంటల లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం నందు తమ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి ఆప్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజావాణితో సమస్యల పరిష్కారం


కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 261 దరఖాస్తులు వచ్చాయి.రెవెన్యూ శాఖకు 106, హౌసింగ్ శాఖకు 53, డీఆర్డీఓకు 34, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి 14, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 12, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారికి ఐదు చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారికి నాలుగు, సిస్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ వేములవాడకు మూడు చొప్పున, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఎస్పీ కార్యాలయం, ఎస్సీ కార్పొరేషన్, అటవీశాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ, ఎంపీడీఓ గంభీరావుపేట, జీఎం ఇండస్ట్రీస్, జిల్లా వైద్యాధికారి, వేములవాడ రాజన్న ఆలయ ఈఓకు రెండు చొప్పున, ఎంపీడీఓ ముస్తాబాద్ కు ఒక దరఖాస్తు వచ్చింది. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తుందని, కాంగ్రెస్ పాలనలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, నియోజకవర్గ స్థాయిలో మరో 1000 మంజూరు చేయిస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం రోజున పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్ద బొంకూరు, దస్తగిరిపల్లి గ్రామాల్లో రూ.69 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని, రాజకీయాలకతీతంగా పేదల సంక్షేమం కోసం కృషి చేస్తానని బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, నూగిల్ల మల్లన్న, బండారి రామ్మూర్తి, దండనవేణి రాజేందర్, కలవేన మహేందర్, కరెంగుల రమేష్, ఆర్కుటి సంతోష్ యాదవ్, పెగడ రమేష్, సరోత్తం రెడ్డి, మిట్టపల్లి శ్రీకాంత్, మిట్టపల్లి కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి సుధాకర్ రెడ్డి, డా. రమేష్, చెవుల తిరుపతి, సలేంద్ర రాజయ్య, ఉప్పు కొమురయ్య, వినోద్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో పేదల ఇంట్లో సంతోషం నింపాం

సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిఆర్‌ఎస్ నేతలు డబుల్ బెడ్‌రూం ఆశ చూపి దగాచేశారని..తాము ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేదోడి ఇంట్లో సంతోషాన్ని నింపామని సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామన్నారు. సిద్దిపేట మండలం బుస్సాపూర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. చక్కతో చేసిన ఇందిరమ్మ ఇండ్ల నమూనాను ప్రదర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ బిఆర్‌ఎస్ నేతలు పదేండ్లలో డబుల్ బెడ్ రూం ఇండ్ల ఆశ చూపి ప్రజలను మోసం చేశారన్నారు. గత పదేండ్లలో బిఆర్‌ఎస్ ప్రజలకు ఒరగబెట్టింది ఏమిలేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేసినట్లు తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీని ఒకేసారి మాఫీ చేసినట్లు తెలిపారు. గతంలో రుణమాఫీ విడుతల వారిగా చేపట్టి రైతులను ముప్పు తిప్పలు పెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్‌సర్కార్‌ను విమర్శలు చేస్తున్న బిఆర్‌ఎస్‌నేతలకు ప్రజలు గుణపాఠం చెప్పెరోజులు ముందున్నాయని విమర్శించారు. పేదోళ్ల సంక్షేమానికి కృషిచేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌ను మరో పదేండ్లు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ నేతలు సదాశివరెడ్డి, అంజిరెడ్డి, మంద పాండు, రాజారెడ్డి, అనిల్‌రెడ్డి, చెంది శ్రీనివాస్, సంతోష, ప్రతాప్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించాలి

సిద్దిపేట కలెక్టర్ హైమావతి





**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో అన్ని పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడిఒసి సమావేశం మందిరంలో జిలాఇ్ల విద్యాశాఖ అధికారులతో బాడిబాట, వేసవి కాలంలో జరిగిన ఉపాధ్యాయశిక్షణ, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాం పంపిణీ. టాస్, ఉల్లాస్ పదో తరగతిలో సాధించిన ఫలితాల తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటిస్తూ, విద్యార్థులకు కృత్యాధార బోధన నిర్వహిస్తూ క్లిష్టమైన అంశాలను సులువుగా అర్థమయ్యేలా ముఖ్యంగా ప్రాథమిక విద్యార్థులతో అభ్యాసన ఫలితాల ఆధారిత భోధన నిర్వహించబడేలా దిశనిర్దేశం చేశారు. ఇట్టి విషయాల పట్ల మండల విద్యాధికారులు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, తగురీతిలో సమీక్షలు నిర్వహిస్తూ ఖచ్చితమైన మానిటరింగ్ ఫోటోకాల్స్ పాటించాలని. ఈ విషయం పట్ల ఏలాంటి నిర్లక్ష్యం దృష్టికి తీసుకొచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిఇఇఒ రవీందర్‌రెడ్డి, డిఇఒ శ్రీనివాస్‌రెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్టినేటర్లు. 26 మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: కలెక్టర్**

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి సంబంధిత వివరాలను శనివారంలోగా ప్రతివారం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని జిల్లా కలెక్టర్ హైమావతి అదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అబ్దుల్ హైమద్‌లతో కలసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు. అంతకు ముందు ప్రజావాణి కార్యక్రమంపై జిల్లా అధికారులతో పెండింగ్ దరఖాస్తులతో సమీక్ష నిర్వహించారు. ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యా యం చేసేలా ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.ఒక వేళ ఆయా సమస్యలు మీపరిధిలోకి రాకుంటే ఆ వివరాలను ఆర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. సోమవారం సిద్దిపేట ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై 186 దరఖాస్తులు వచ్చాయి. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం

జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్





ప్రజాపక్షం/జగిత్యాలటౌన్‌: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రపాద్ సంబంధితఅ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కరానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాగా ప్రజా వాణి కార్యక్రమానికి మొత్తం 61 ఫిర్యాదులు వినతులు వచ్చాయని, వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ బిఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ , కోరుట్ల ఆర్‌డిఒ జివాకర్‌రెడ్డి, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు

సిపిఐ నగర కార్యదర్శి కనకరాజ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వర్షాకాలం ప్రారంభమైనందున పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ రామగుండం కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన సిపిఐ నగర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడుతూ నగరంలోని డివిజన్‌లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఓపెన్ డ్రైనేజీలలో మురుగునీరు నిలువ ఉండి రోడ్లపై పారడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు, వెంటనే రోడ్డు పై నీళ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని డివిజన్లలో రాత్రులందు వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్ కుమార్, ఎం.ఎ.గౌస్, పడాల కనకరాజు, సిరిసిల్ల మల్లెశ్, అబ్దుల్ కరీం, ప్రీతం, నవీన్ జగన్, సిౖర మైసయ్య, చిలుముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జింక్ కార్నర్‌ల ఏర్పాటు

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమం అనంతరం స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జులై 3వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో అస్వస్థతను తగ్గించడానికి, డయేరియా నిర్మూలనకు, శిశు మరణాలు సంభవించకుండా చేసేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఐదు సంవత్సరాలలో పిల్లలందరికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అందజేస్తారని, ఆరోగ్య సిబ్బంది సూచించిన విధంగా వాడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాలల్లో జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపిడిఒలు, తహసీల్దార్లు, ఎంఇఒలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని, గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శుభ్రమైన తాగునీరు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి విషయాలను గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సంధర్భంగా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్దుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు.

**ప్రజావాణికి 263 దరఖాస్తులు:** సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 263 దరఖాస్తులు వచ్చాయి. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ మహేశ్వర్, డిటిడిఒ పవన్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి



ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి/పెద్దపల్లి ప్రతినిధి:** నారాయణ పాఠశాలల్లో అధిక ఫీ జుల దోపిడీని అరికట్టాలని, నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న నారాయణ పాఠశాలపై విద్యాశాఖ పట్టించుకోవడం లేదంటూ సోమవారం ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం సమర్పించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పాఠశాల ఆవరణలో అమ్ముతున్న నారాయణ స్కూళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్‌లు మాట్లాడుతూ నారాయణ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా, కరీంనగర్ జిల్లాలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, బుక్కులు, పెన్నులు, షూ, టై వంటి అక్రమంగా అమ్ముతూ లాభార్జన ధ్యేయంగా నడిపిస్తున్నారని అన్నారు. జిఒ 1, 10, 92, 42లను ఉల్లంఘించి జిల్లా కేంద్రంలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచగా నోటీసు బోర్డులో పెట్టకుండా, స్మార్ట్ పేర్లను జోడిస్తూ, గ్రౌండ్, నిబంధనలకు అనుగుణంగా విశాలమైన తరగతి గదులు లేకుండా నడిపిస్తున్నారన్నారు. విద్యాశాఖ అమలు చేస్తున్న మార్గదర్శకాలను పట్టించుకోకుండా జిల్లా కేంద్రంలో నారాయణ పాఠశాలలు తమ ఇష్టానుసారం గా వ్యవస్థను నడుపుతున్నాయన్నారు. విద్యను వ్యాపారంగా మలిచే దిశగా తీసుకెళ్తోందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము, ఉపాధ్యక్షులు కనకం సాగర్, జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పెద్దపెల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు లేకున్నా, రంగు రంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ, మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి,చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ,మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు ప్రభుత్వం నుండి అనుమతులు ఉన్నాయా! లేవా! అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న, ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, అధిక ఫీజులను వసూలు చేస్తున్న, అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న నారాయణ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి మండల అధ్యక్షులు నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గత 8,9 నెలలుగా రిటైర్ ఐన టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్‌కు రూ. 2 లక్షలు, ఆయాకు రూ.1 లక్ష రావాల్సింది ఉందని ఇప్పటివరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.18 వేల వేతనం చెల్లిస్తానన్న వేతనం ఏమైందని ప్రశ్నించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనంలో సగం వేతనం రిటైర్ ఐన తరువాత ఇవ్వాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్‌తో 25 రోజుల పాటు నిరసనలు చేస్తే కాంగ్రెస్ పెద్దలు టెంట్‌ల వద్దకు వచ్చి న్యాయమైన అంగన్‌వాడీల సమస్యలను మా ప్రభుత్వం వస్తే నెరవేరుస్తామని హామీ ఇచ్చారని చరణ్ ఇప్పుడు ఆ ఊసే లేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న హామీలు నెరవేర్చడం లేదని మండిపడ్డారు. తక్షణమే రూ.18 వేలు వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, ఉపాధ్యక్షులు పంతం రవి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై విషం కక్కడంలో చంద్రబాబు హస్తం

బాబు డైరెక్షన్‌లో కేంద్ర మంత్రి 'బండి' వ్యాఖ్యలు

బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విషం కక్కడంలో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హస్తం ఉందని బిఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు ఆరోపించారు. తెలంగాణ గోదావరి నీళ్లను తరలించుకుని 'బనకచర్ల' ప్రాజెక్టును నిర్మించుకునే కుయుక్తులో బాగంగా బండి సంజయ్‌ను వాడుకుంటూ కాళేశ్వరంపై విషం కక్కిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల కలల బహుళ ప్రయోజనాల భారీ లిఫ్ట్ ఇరిగేషన్ కాళేశ్వరం ప్రాజెక్టుపై కనీస అవగాహన లేకుండా బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి నీళ్లను సముద్రంలో కలవనీయకుండా అడ్డుకునేందుకు గతంలో ఏ ప్రభుత్వమూ కృషి చేయలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులకు బిందెలు అడ్డుకునే పరిస్థితి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఎండాకాలంలో చెరువులు నిండి భూగర్భజలాలు పెరిగి పంటల సాగుకు మించి కరువు నేలలను సస్యశ్యామలం చేసిందని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైరీ, కమిషన్లపై నమ్మకం లేదంటున్న బండి సంజయ్ కాళేశ్వరం కమిషన్‌కు నివేదిక ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అదే విధంగా ఫోన్‌ట్యాపింగ్ విషయంలో దమ్ముంటే సిట్‌కు హాజరు కావొద్దని సవాల్ చేశారు. సమావేశంలో బిఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, శ్రీనివాస్, మోహన్, చాంద్ తదితరులున్నారు.

## బిసిలకు రిజర్వేషన్‌లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్ డిమాండ్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బిసిసంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి ఒరగంటి భార్గవ రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు బిసి రిజర్వేషన్ల పెంపు ,భవిష్యత్ కార్యాచరణపై ఆయన మాట్లాడుతూ బిసిల రాజ్యాధికారమే ల క్ష్యంగా బిసి సంక్షేమ సంఘం పనిచేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి సమాజంలో బిసిలకు జరుగుతున్న అన్యాయం గురించి తీవ్రంగా ఆలోచించి, రాష్ట్రంలో బిసి వర్గాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా తమ మేనిఫెస్టోలో పేర్కొన్నదని ,స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్ ఇస్తామన్న ప్రధాన హామీతోనే కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు .42 శాతం రిజర్వేషన్ హామీని అమలు చేయకపోతే బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కులుకచెర్ల శ్రీనివాస్ ముదిరాజ్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసిల నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు .బిసిలకు తరతరాలుగా అన్యాయం జరుగుతూనే ఉందని ,మంత్రి పదవుల్లో కూడా న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు .బిసిఉద్యమాలతో ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని ,బిసి ప్రజల ఆకాంక్షల మేరకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి తప్ప హామీలను మరిచి బిసిల రిజర్వేషన్లు తగ్గించి ఎన్నికలు నిర్వహించే కుట్రలను సేదిస్తాం రిజర్వేషన్లను సాధిస్తాం. బిసిల రాజ్యాధికారమే లక్ష్యముగా ముందుకు పోదామని ప్రభుత్వ ఆలోచనలు గ్రామ గ్రామాన ఉన్న బిసి సమాజానికి తెలియజేస్తామని,గ్రామ గ్రామాన సభలు పెట్టి ప్రభుత్వం నిజరూపాన్ని చాటి చెబుతామని తెలిపారు .బిసిలను బలమైన రాజకీయ శక్తిగా మార్చడానికి జాతీయ బిసి సంక్షేమ సంఘం కృషి చేస్తుందని బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ నేరవేర్చకపోతే బి ఆర్ ఎస్ పార్టీకి పట్టిన గతి పడుతుందని బీసీల ఐక్యతను చాటుతూ ముందుకు పోతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు .నిధులు ఇతర విషయాలపై ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీ ని కలుస్తున్న సిఎం రేవంత్ రెడ్డి బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో మాత్రం మాట్లాడడం లేదన్నారు .రాష్ట్రంలో కుల గణన ఆ ప్రకారం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి బిసిరిజర్వేషన్ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు .బిసిల రాజ్యాధికారం కొరకై బాహుబలిల యుద్ధం చేయాలి.బిసిల రాజ్యం కోసం ప్రతి బిసి ఉక్కు పిడికిలి బిగించి నినాదించాలి మా ధ్యేయం ,తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు చట్టపరమైన హామీతో రిజర్వేషన్లు కల్పించాలన్నారు.గ్రామ పంచాయితీలు ,మండల పరిషత్ లు ,జిల్లా పరిషత్ లు ,మున్సి పాలిటీలు కార్పొరేషన్లలో బిసిలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేలా రిజర్వేషన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు ,బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో వేసిన చట్టానికి అనుగుణంగా వెంటనే ప్రభుత్వ జీవో జారీ చేసి ఎన్నికలు జరపాలన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## త్వరితగతిన అర్జీల పరిష్కరణ కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యం నిస్తూ ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఐసిసి సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ లు చంద్ర శేఖర్, ,మాదురి, డిఆర్ఓ పద్మజ రాణి లకు విన్నవిస్తు అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు.వివిధ శాఖల జిల్లా అదికారులు పాల్గొన్నారు.

## పేట సిపిఐ మండల కార్యదర్శిగా పాండు

### పట్టణ కార్యదర్శిగా అనసూయ యాదవ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:**సిపిఐ సదాశివపేట మండల కార్యదర్శిగా పాండు ,పట్టణ కార్యదర్శిగా అనసూయ యాదవ్ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ షఫీ, శంకరప్ప, తాసుద్దీన్, బు జమ్మ, ముస్తఫా, లడ్డు లక్ష్మి సాదిక్ అలీలు ఎన్నికలైనట్లు సిపిఐ జిల్లా కా ర్యదర్శి జలాలోద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎన్నికైన మ ండల పాండు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు కాలంలో ఈ ప్రా ంతంలో పార్టీని బలోపేతం చేయడానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటాదివెంట పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 217 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఇన్‌చార్జి డీపీఓ శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

### వాంకిడి సిఐ సత్యనారాయణ




**ప్రజాపక్షం/ వాంకిడి :**పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని వాంకిడి సిఐ సత్యనారాయణ తెలిపారు. వాంకిడి మండల కేంద్రంలోని వాంకిడి కలాన్ ఎంపిపిఎస్ పాఠశాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి, దానిని సంరక్షించే పనిలో భాగస్వాములు కావాలని కోరారు. యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ, స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు కురిసేందుకు, విపత్తుల సమయంలో సహాయపడే చెట్ల విలువను అందరూ గుర్తించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒబిసి సెల్ అధ్యక్షుడు జాబోరే గణేష్, సీనియర్ నాయకులు ,ఆర్యా సంఘం జిల్లా అధ్యక్షుడు జైరాం, ప్రధానోపాధ్యాయులు చైర్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల తోపులాట



**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**మండలంలో యూరియా, ఎరువుల కోసం రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడటంతో సోమవారం తోపులాట చోటు చేసుకుంది. వ్యవసాయ సహకార సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ సబ్సిడీతో ఎరువుల పంపిణీ జరుగుతున్న ప్రదేశంలో రైతుల ఓపిక కోల్పోయి తోసుకుంటూ వెళ్లడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. తీవ్రమైన గందరగోళం నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, పంపిణీని క్రమబద్ధంగా నిర్వహించారు. ప్రభుత్వం యూరియాపై భారీ సబ్సిడీ అందించడంతో దీని ధర తక్కువగా ఉండటమే కాకుండా, ఇతర ఖరీదైన ఎరువుల కంటే యూరియాను రైతులు అధికంగా వాడుతున్నారు. పంపిణీ సమయంలో తగిన ఏర్పాట్లు లేకపోవడంతో ప్రతిసారీ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉత్పత్తి, సరఫరా, అవగాహన కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## డబుల్‌బెడ్‌రూమ్ గుత్తేదారుపై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**మహ్మద్‌నగర్ మండలంలో గత భరాస ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూం నిర్మాణంలో కాంట్రాక్టర్ గోల్ మాల్ చేశారని, బిఆర్ఎస్ సర్పంచుతో కలిసి అవకతవకలకు పాల్పడ్డారని స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకునే వరకు సహించేది లేదని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌రాథోడ్, బాధితులు ఉన్నారు.

## చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

### మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :**చిరు ధాన్యాల ఆహారాన్ని ప్రజలు స్వీకరించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న చిరు ధాన్యాల స్టాల్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి శంకరంపేట మండలం మహిళ ద్వారా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల స్టాల్ సందర్శించడం జరిగిందని, బ్రాండింగ్ (నిర్దిష్ట పేరు) కల్పించినట్లయితే మార్కెటింగ్ సౌకర్యం
పెరుగుతుందని తెలిపారు. విల్లెట్స్ గ్రామీణ ప్రాంత ప్రజలు మాత్రమే వాడతారని ఒక అపోగా ఉండేదని కాలక్రమేన చిరు ధాన్యాల ప్రాధాన్యత, పట్టణ ప్రాంత వాసులు ఆదరణ పెరిగి వారు వాడి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో మిల్లెట్ స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మిల్లెట్ స్టాల్లో రాగులు, అరికెలు, ఊదలు, నువ్వుల లడ్డు, ఇప్పపువ్వు లడ్డు, అవిసె గింజలు లడ్డూలు అనేక ప్రకృతి సహజసిద్ధమైన తినుబండారాలు, మునగాకు, కరివేపాకు, పొడులు, ప్రదర్శన చేయడం జరిగిందని ప్రజలందరూ వీటిని తినటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అని అన్నారు. విప్ప పువ్వు లడ్డు తినడం వల్ల రక్తహీనత నుడి కాపాడుకోవడంతోపాటు భవిష్యత్తులో బీపీ షుగర్ లాంటి వ్యాధులు గురి కాకుండా ఉంటామని తెలిపారు. చిరు ధాన్యాలు పోషకాలను అందించడమే కాకుండా రోగ కారకాలను శరీరంలో నుంచి తొలగించి దేహాన్ని శుద్ధి చేస్తాయని చెప్పారు కలెక్టరేట్ కార్యాలయం ఏర్పాటుచేసిన మిల్లెట్ స్టాల్ కు విశేషమైన స్పందన లభిస్తోంది. అని వివరించారు. ప్రతి సోమవారం ప్రజావాణికి వచ్చిన ప్రజలే కాకుండా వివిధ శాఖల అధికారులు సిరి ధాన్యాల స్టాల్ సందర్శించి కొనుగోలు చేయడం ద్వారా మహిళలకు ఉపాధి మార్గాలు చేకూరుతున్నాయని తెలిపారు.కోటి మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వ లక్ష్యాల మేరకు మహిళా సాధికారత ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జెడ్పి సిఇఒ ఎల్లయ్య, ఇతర జిల్లా అధికారులు మహిళా సంఘ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులను విధుల నుండి తొలగించాలి

### మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం/ దండేపల్లి :**కస్తూర్బా గర్ల్స్ పాఠశాలలో విద్యార్థులపై అవహేళన జరిగిందని వెల్లడవడంతో సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేం సాగర్ రావు అధికారులకు సూచించారు. సోమవారం దండేపల్లి మండలంలోని కస్తూర్బా పాఠశాలను ఎంఎల్ఎ ప్రేం సాగర్ రావు జిల్లా విద్యాధికారి యాదయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని భోదన, భోదనేతర సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు, సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ఏకాంతంగా మాట్లాడిన ఎంఎల్ఎ మీ సమస్యలు నిర్భయంగా చెప్పాలంటూ ప్రోత్సహించడంతో విద్యార్థులు పలు అంశాలను పంచుకున్నారు. వారు అందించిన సమాచారం ప్రకారం, పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని, ప్రత్యేకాధికారి తీరుతో పాటు కొంతమంది సిబ్బంది వ్యవహారం దురుసుగా ఉందని, తరచూ మూత్రశాలలు, తరగతి గదులు శుభ్రం చేయించేందుకు విద్యార్థులనే పనిచేయిస్తున్నారని తెలియజేశారు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చినప్పుడు వారికి సైతం అప్రమత్తంగా వ్యవహరించకపోవడం ఆందోళనకరమని వివరించారు. ఈ విషయాలపై ఎంఎల్ఎ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల అలాంటి అన్యాయమైన వైఖరిని సహించబోమని స్పష్టం చేశారు. వెంటనే సంబంధిత ప్రత్యేకాధికారిని, ముగ్గురు సిబ్బందిని బాధ్యతల నుంచి తొలగించాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ పిల్లలు ఇచ్చిన వాంగ్మూలాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని, విద్యార్థుల హక్కులను కాపాడటమే తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎంఎల్ఎ పేర్కొన్నారు. పాఠశాల సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి:**ఫోక్సో చట్టం 2015 సిఆర్‌పిసి(అట్రాసిటీ బాధితుల పరిహారం), మహిళలు, బాలికలపై జరిగిన దారుణాలకు గురైన బాధితులకు పరిహారం చెల్లింపును ఖరారు చేయడానికి సోమవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధ్యక్షతన సంబంధిత కార్యాలయ అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమన్వయ సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి మాట్లాడుతూ జిఓఎంఎస్ నెం. 28, తేది : 13.06.2011 ప్రకారం జిల్లాలో పోక్సో చట్టం 2015 సిఆర్‌పిసి (అట్రాసిటీ బాధితుల పరిహారం) కింద నమోదుఐనటువంటి అర్హత కలిగిన మొత్తం 86 కేసెస్ (పోక్సో చట్టం 2015 కింద 57, మహిళా రేప్ కేసెస్ 12, వరకట్న మరణాలు 4, కిడ్నాప్ కేసులు 13) బాధితులకు పరిహారం చెల్లింపును వివరాలను జిల్లాస్థాయి కమిటీకి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అర్హత కలిగిన మొత్తం 86 కేసుల వివరాలను తెలుసుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాధితులకు అందించే సేవలపై చర్చించి బాధితులకు పరిహారం చెల్లింపును త్వరితగతిగా అందించాలని జిల్లా సంక్షేమాధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన మొత్తం 86 కేసులను జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించారు. కార్యక్రమంలో సిపి సాయిచైతన్య, ప్రాజెక్టు డైరెక్టర్, డిఆర్‌డిఓ సాయగౌడ్, జిల్లా వైద్యారోగ్యాధికారి రాజశ్రీ, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బి, ఎన్‌జిఒ స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య పాల్గొన్నారు.

## నిర్మల్ యాంటీ నార్కోటిక్స్ వారోత్సవాలు..

### డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఎస్‌పి డా.జి. జానకి షర్మిల ప్రచారం..




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**నిర్మల్ జిల్లాలో మాదకద్రవ్యాల దుర్వినియోగంఅక్రమ రవాణా అవగాహన వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల డ్రగ్‌రహిత సమాజాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రజలు,యువత,విద్యార్థులు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీ సిబ్బందితో కలిసి జాగ్రత్త..!! మాదక ద్రవ్యాలు ..మీ జీవితాన్ని నాశనం చేస్తాయి..డ్రగ్స్ కు నో చెప్పండి'' అనే పోస్టర్లను ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన ("I AM ANTI DRUG SOLDIER") సెల్ఫీ పాయింట వద్ద జిల్లా ఎస్పీ,అడిషనల్ ఎస్పీ,ఇతర అధికారులు,సిబ్బంది,ఫోటోలు దిగారు అలాగే ("SAY NO TO DRUGS YES TO LIFE") అనే పోస్టర్‌పై సంతకాలు చేసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ నిబద్ధతను చాటుకున్నారు.గంజాయి వంటి మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో నంబర్ 8712671111 కు లేదా డయల్ 100కు లేదా మీ పరిధిలోని పోలీసులకు అందించాలని ఎస్పీ సూచించారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి,ఏవో యూనస్ అలీ,డిఎస్బి ఇన్స్పెక్టర్ సమ్మయ్య,ఆర్ఐ రామ్‌నింజర్ రావ్,ఆర్.ఎస్.ఐలు ,డిసిఓ సిబ్బంది,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్లు....

### అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ప్రజావాణిలో ఫిర్యాదులు

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/రామాయంపేట:**రామాయంపేట పట్టణంలో బీడికార్మికుల ప్లాట్లనుఅక్రమంగా రిజిస్ట్రేషన్లు.. ప్రభుత్వ పట్టాలకు ప్రైవేటు రిజిస్ట్రేషన్లు అనే కథనంతో ప్రజాపక్షంలో ప్రచురితమైన వార్తకు అనూస్య స్పందన వస్తుంది. రామాయంపేట ముదిరాజ్, యాదవ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున సమావేశమై అక్రమాలకు పాల్పడుతున్న శీలం సుబాష్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ముదిరాజ్ నాయకులు మాజీ కౌన్సిలర్ చిలుక గంగాదర్, మాజీ వార్డు సభ్యులు గుడాల లింగం, సంఘం బాద్యులు దేవుని రవి, భూమ మల్లేశం, అబ్రమైన గంగారాంతో పాటు తదితరులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పిర్యాదు చేశారు. అదేవిదంగా రామాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు యాదవ సంఘం నాయకులు మహాంకాళీ దేవాలయ మాజీ డైరెక్టర్ బసన్నపల్లి రాజుయాదవ్, కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రగొల్ల రమేష్, యాదవ సంఘం నాయకులు తాడెం మల్లయ్య, ఎర్రగొల్ల స్వామిలు తహశీల్దార్ రజనికుమారికి పిర్యాదు చేశారు. పిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లుఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

## క్రీడలతోచదువుతో ఏకాగ్రత పెరుగుతుంది

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ నస్పూర్ :**క్రీడలతో విద్యార్థులలో చదువుపై ఏకాగ్రత పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఒలంపిక్ డే రన్ 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు నిర్వహించిన రన్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హన్మంతరెడ్డి, ఎసిపి. ప్రకాష్, షెడ్యూల్డ్ కులముల సహకార సంస్థ ఇడి. దుర్గాప్రసాద్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని, క్రీడలతో చదువుపై ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం, క్రీడలకు కేటాయించుకోవాలని, తద్వారా శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారని తెలిపారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, స్నేహభావం పెరుగుతుందని, గెలుపుఓటములను సమానంగా తీసుకొనే నిబద్దత కలుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిఐ. ప్రమోద్రావు, సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రితో పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం శుభ పరిణామం



**ప్రజాపక్షం/శివ్వంపేట:**ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి ఆ పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం శుభ పరిమాణంగా భావిస్తున్నామని మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బుర్ర మురళి గౌడ్ అన్నారు. తాము శ్రీశైల పుణ్యక్షేత్రానికి వెళ్లిన సమయంలో అదే సమయంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అక్కడికి వచ్చిన విషయాన్ని గౌడ్ గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపులి సతీష్, బొమ్మిడాల శంకర్, దినేష్ రెడ్డి తదితరులు ఉన్నారు

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :**ఓపెన్ స్కూల్ సొసైటి పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాగజ్‌నగర్ మండలంలోని జడ్‌పిఎస్‌ఎస్ బాయ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కోఆర్డినేటర్ ఆత్రం ప్రమీల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయిని సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 12 నుండి జూలై 7 వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాలని అన్నారు. ఇతర వివరాల కోసం కోఆర్డినేటర్ ప్రమీల 9441605638, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సత్యనారాయణ 8074226871 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి శ్రీనివాస్

### విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం/నర్సాపూర్:**జక్కపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ శ్రీనివాస్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గురువారం జక్కపల్లి మాజీ సర్పంచ్ స్వర్గీయ దుప్తల శ్రీనివాస్ గత సంవత్సరం అకాల మరణం పొందడం గ్రామస్తులు ఆయన విగ్రహాన్ని ఆదివారం జక్కపల్లి గేటు వద్ద ఏర్పాటు చేయగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్యఅతిథిగ హాజరై ఎమ్మెల్యే సునీత రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డిలతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ శ్రీనివాస్ కుటుంబానికి ఎప్పుడూ అండగా నిలుస్తుందని తెలియజేశారు. శ్రీనివాస్ మంచితనం వల్లే మూడు పర్యాయాలు సర్పంచ్ గా గెలిచాడాన్ని అన్నారు. ఆయన మంచితనం వల్లే ఆయన విగ్రహాన్ని గ్రామ ప్రజలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. శ్రీనివాస్ మంచి ఉద్యమకారుడు అని కమ్యూనిస్టు పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడని అన్నారు. కెసిఆర్ ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్యాంకర్ ఇవ్వడం జరిగింది.

**ట్రాక్టర్ లో డీజిల్ పోయ లేని దుస్థితి కాంగ్రెస్ పార్టీది మాజీ మంత్రి హరీష్ రావు**

బిఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతి గ్రామానికి ట్రాక్టర్‌ను ,ట్రాలీని ఇవ్వడం జరిగిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ట్రాక్టర్ లో డీజిల్ పోయలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. జక్కపల్లి గ్రామానికి వచ్చిన మాజీ మంత్రి హరీష్ రావుకు పారిశుద్ధ్య కార్మికులు రోజు గ్రామంలో చేత్త సేకరించడానికి ట్రాక్టర్ లో డీజిల్ ఉండడం లేదని తమకు మూడు నెలలుగా జీతాలు లేవని మాజీ మంత్రి హరీష్ రావుకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఈ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలుపరచలేదని విమర్శించారు. ఓ రైతు హరీష్ రావు ముందు నర్సాపూర్ లో యూరియా బస్తా కోసం నాలుగు షాపులు తిరిగిన డిఎపి బస్తా దొరకలేదని రైతు హరీష్ రావు ముందు గోడును చెప్పుకోగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరువులు పుష్కలంగా ఉండేవని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఎరువులు దొరకకపోవడం బాధాకరమన్నారు. కెసిఆర్ హయాంలో ఢిల్లీ నుండి ఎన్నో అవార్డులు వచ్చాయని, రేవంత్ రెడ్డి పాలనలో ఒక్క అవార్డు కూడా రాలేదని విమర్శించారు .ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే.సునీత రెడ్డి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, జక్కపల్లి మాజీ ఎంపిటిసి సంధ్యారాణి, చత్రు నాయక్, మార్చి ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మన్సూర్, నాయకులు ,తదితరులు ఉన్నారు.

# రీల్



**కం**టెంట్ బాగుంటే, హ్యూమన్ ఎమోషన్స్‌ని టచ్ చేయగలిగితే ఆడియన్స్ థియేటర్స్‌కి వస్తారని 'కుబేర' సినిమా నిరూపించిందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన చిరంజీవి మాట్లాడుతూ ఇది నా సక్సెస్ మీట్‌లా అనిపిస్తుంది. అలాంటి ఆనందాన్ని ఇక్కడ పొందుతున్నాను. ఈ సినిమా నేను సినిమా చూశాను. ఆయన చెప్పినది వంద శాతం కరెక్ట్. ఈ సినిమా తర్వాత తను మరో 40 ఏళ్లు అద్భుతంగా రాణిస్తారనేది వాస్తవం. ఈ క్యారెక్టర్ శేఖర్ రాయడం, అది నాగార్జున యాక్టర్ ఎవరైనా ఉన్నా రంటే అది ఇండియాలో ధనుష్ ఒక్కరే. అంత నేచురల్‌గా క్యారెక్టర్‌లో ఇమిడిపోయారు. ఈ సినిమాతో తనకి బెస్ట్ యాక్టర్ అవార్డు రావాలి. తనకి ఈ సినిమాకి అవార్డు వస్తే కనుక ప్రతి ఒక్కరికి గర్వకారణం. ఇందులో తల్లి మీద పాడిన పాట ఖైదీ 150లో నీరు నీరు పాటని మైమరిపించే లాగా

## సమీరా క్యారెక్టర్ చూసినప్పుడు.. 'చూడాలని ఉంది'లో సౌందర్య గుర్తుకొచ్చింది

### కుబేర సక్సెస్ మీట్‌లో చిరంజీవి

చేయడం ఇదే ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నాను. దేవ క్యారెక్టర్‌లో ధనుస్‌ని తప్ప ఇంకెవరిని ఊహించుకోలేం. ఆ క్యారెక్టర్ చూసిన తర్వాత అలా అనిపించింది. సినిమా చూస్తున్నప్పుడు ధనుష్ ని గుర్తించలేకపోయాను. అంతలా క్యారెక్టర్‌లో ఇన్వాల్వ్ అయిపోయారు. ఈ సినిమాని ఒక సినిమాలా కాకుండా ఒక అనుభవంలా చూశాను. వాస్తవంగా జరుగుతున్నట్టుగా అనిపించింది. ఒక్కొక్క సినిమాని ఆణిముత్యం లాగా చేస్తూ ప్రేక్షకుల గుండెల్లో ఒక సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్న శేఖర్ కమ్ముల. స్టేట్ రౌడీ షూటింగ్ జరుగుతున్నప్పుడు శేఖర్ కమ్ముల నన్ను ఓ అభిమానిలా కలిశారు. ఆరోజే సినిమా ఇండస్ట్రీలో స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. శేఖర్ కమ్ములను దర్శకుడిగా చూస్తుంటే నిజంగా నాకు చాలా గర్వంగా ఉంది. ఈ సిల్వర్ జూబ్లీ ఇయర్ సందర్భంగా ఆయనకి మరొకసారి నా అభినందనలు తెలియజేస్తున్నాను. శేఖర్ కమ్ముల సినిమాలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాల పాత్రలు కూడా దేవ దీపక్ అనే గుర్తు పెట్టుకుంటాం. నాగ్ అనుకున్నట్లుగా ఇది ఆయనకి మరో డోర్ ఓపెన్ అయింది. రష్మిక ఫెంటాస్టిక్‌గా పెర్ఫార్మ్ చేసింది. తన ఫస్ట్ సినిమా వచ్చినప్పుడు నేను గెస్ట్‌గా వచ్చాను. తను నేషనల్ కాదు ఇంటర్నేషనల్ క్రష్ అయిపోయింది. తన క్యారెక్టర్‌లో ఇంటెన్సిటీ ఈ సినిమాలో కనిపించింది. ఈ సినిమాలో సమీరా క్యారెక్టర్ చూసినప్పుడు చూడాలని ఉందిలో సౌందర్య గుర్తుకొచ్చింది. ఈ సినిమా మొత్తంలో తన క్యారెక్టర్ ట్రాన్స్ఫర్మేషన్ అద్భుతంగా ఉంది. ఈ సినిమాలో హృదయానికి హత్తుకుపోయిన క్యారెక్టర్ దేవ. ఈ క్యారెక్టర్‌కి ధనుష్ తప్ప ఇంకెవరూ చేయలేరు. అంత స్టార్ ఇమేజ్ ఉండి ఇలాంటి క్యారెక్టర్ చేయగలిగే అనిపించింది అని చిరంజీవి పేర్కొన్నారు. నాగార్జున మాట్లాడుతూ. చిన్న సినిమా పెద్ద సినిమా ఏదైనా కావచ్చు.. సపోర్ట్ చేయడానికి చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు. అందుకే ఆయన్ని అందరూ ఇష్టపడతారు. ఆయన ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇది శేఖర్ కమ్ముల ఫిల్మ్. థ్రిల్లర్‌తో హ్యూమన్ ఎమోషన్‌తో సినిమా చేయడం అనేది మామూలు విషయం కాదు. అది ఈ సినిమాతో కుదిరింది. ఈ సినిమాలో దీపక్ దేవా సమీరా ఇలా అన్ని పాత్రలే తప్పా స్టార్స్ కనిపించరన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో హీరో ధనుష్, హీరోయిన్ రష్మిక మందాన, నిర్మాతలు సునీల్ నారంగ్, పుష్కర్ రామ్ మోహన్ రావు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిచే 'హ్యాపీ జర్నీ' పోస్టర్ రిలీజ్



**ఫ్యూ**చర్ బ్రైట్ ఫిలిమ్స్ పతాకంపై హరిప్రసాద్ కోనే, ఇషాని గోష్ హీరో హీరోయిన్లుగా నిర్మించిన సినిమా హ్యాపీ జర్నీ. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చిత్ర దర్శకులు చైతన్య కొండ, నిర్మాత గంగాధర్ పెద్ద కొండ, కెమెరా మెన్ అరుణ్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఫిలిం జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ' ఈ కథ విన్న తర్వాతనే ఈ సినిమా పోస్టర్ రిలీజ్ చేయడానికి అంగీకరించాను. ఇలాంటి సినిమా చేసిన ఈ డైరెక్టర్‌ని అభినందిస్తున్నాను ప్రస్తుత పరిస్థితుల్లో సొసైటీలో అలజడులు పెరిగిపోయాయి. సామాజిక అంశాల పట్ల స్పృహ ఉన్న డైరెక్టర్, మంచి అభిరుచి ఉన్న నిర్మాతలు కలసి ఇలాంటి సినిమాలు తీయడం అభినందనీయం. హిందీ తెలుగు భాషలలో విడుదల కానున్న ఇలాంటి సినిమాలకు నా వంతు సహకరిస్తాను అని బండి అన్నారు.

## 'కన్నప్ప' ఓవర్సీస్ థియేటర్ల జాబితా విడుదల



**పా**న్ ఇండియా' సినిమాగా నిర్మించిన కన్నప్ప సినిమాను అమెరికాలో కూడా విడుదల చేస్తున్నారు. అమెరికాలో ఈ సినిమా ప్రదర్శించే థియేటర్ల లిస్టను నిర్మాత మోహన్ బాబు మీడియాకు విడుదల చేశారు. విదేశాల్లో సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో నెలకొన్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని అమెరికాలో చాలా ఎక్కువ థియేటర్లలో విడుదల చేస్తున్నామని చెప్పారు. విజువల్ వండర్‌గా, భక్తిని పెంపొందించేలా 'కన్నప్ప' చిత్రాన్ని నిర్మించామన్నారు. ఇది విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ తన విజన్ తో అద్భుతంగా తెరకెక్కించారన్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద తెరకెక్కించిన ఈ సినిమాను ఓవర్ సిస్‌లో జూన్ 26న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నామని మోహన్ బాబు తెలిపారు. ఓవర్సీస్ ఆడియెన్స్ కోసం ఈ చిత్రాన్ని వాసరా ఎంటర్‌టైన్‌మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారని అన్నారు. థియేటర్ల జాబితా విడుదల కావడం, బుకింగ్‌లు ఓపెన్ అవ్వడంతో అక్కడ కన్నప్ప ట్రెండ్ అవుతోందని తెలిపారు. ఓవర్సీస్‌లో జూన్ 26న, ఇండియాలో జూన్ 27న కన్నప్ప భారీ ఎత్తున విడుదల చేస్తున్నామని మోహన్ బాబు పేర్కొన్నారు.

## 'స్కై' నుంచి 'తపనే తెలుపగ..' పాట విడుదల



**ము**రళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'స్కై'. ఈ చిత్రాన్ని వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్ లో నాగి రెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ కు రెడీ అవుతోంది. 'స్కై' సినిమా నుంచి 'తపనే తెలుపగ..' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'తపనే తెలుపగ..' పాటకు పృథ్వీ పెరిచెర్ల సాహిత్యం అందించగా గాయని వైష్ణవి ఆకట్టుకునేలా పాడారు. మ్యూజిక్ డైరెక్టర్ శివ ప్రసాద్ బ్యూటిఫుల్ మెలోడీ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. 'తపనే తెలుపగ పలుకే, ఉసురే నిలిపెను పిలుపే, మనవే వినగా మనసే, మదినే గుడిలా మలిచే, అలసిన సమయం జతగా, అనుమతి అడగక రావా, కురిసెను విరహం కనులా, రగిలిన హృదయపు సడిలో..' అంటూ సాగుతుంది. ఈ పాట హీరో హీరోయిన్స్ మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టిపై కూల్ మెలోడీగా ఆహ్లాదకరమైన లొకేషన్స్‌లో ఈ పాటను చిత్రీకరించారు.

## '8 వసంతాలు' సక్సెస్ మీట్

**అ**నంతిక సనీల్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 8 వసంతాలు సినిమా సక్సెస్ మీట్ సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఇటీవల



విడుదలైన ఈ సినిమా సక్సెస్ ఫుల్ గా థియేటర్లలో నడుస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో నటి నటులు సాంకేతిక నిపుణులు మాట్లాడారు. హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ సినిమాకి ఆడియన్స్ చాలా ప్రేమ ఇచ్చినందుకు ధన్యవాదాలు. సినిమాకి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. థియేటర్స్‌లో సినిమా చూస్తున్నప్పుడు చాలా గ్రేట్ ఫుల్‌గా అనిపించింది. ఇలాంటి మంచి టీంతో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు ఫణికి, మైత్రీ మూవీ మేకర్స్‌కి థాంక్ యూ. ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి ఆడియన్స్ నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. చాలా కాంప్లిమెంట్స్ వస్తున్నాయి. ముఖ్యంగా ఫైట్ సీక్వెన్స్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. ఫైట్ సీక్వెన్స్ కోసం చాలా రిహార్సల్ చేశాం. ఈ పాత్ర నా పర్సనల్ లైఫ్ కూడా చాలా చోట్ల కనెక్ట్ అయ్యింది. సినిమాకి అందరూ చాలా అద్భుతంగా కనెక్ట్ అవుతున్నారని అన్నారు.

## 'పరమపద సోపానం' టీజర్ ఆవిష్కరణ



**'అ**ర్ధనారి' 'తెప్ప సముద్రం' 'వెడ్డింగ్ డైరీస్' వంటి వైవిధ్యమైన సినిమాలతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ అంబటి, 'బిగ్ బాస్' రియాలిటీ షోతో ఫ్యామిలీ ఆడియన్స్‌కి మరింత దగ్గరయ్యారు. అర్జున్ అంబటి హీరోగా వస్తున్న తాజా సినిమా 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించిన ఈ సినిమాని 'ఎస్.ఎస్.మీడియా' సంస్థ పై గుడిమిట్ల సువర్ణలత సమర్పణలో గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మించారు. గుడిమిట్ల ఈశ్వర్ సహ నిర్మాత. స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. మాస్ మహారాజ్ రవితేజ ఈగల్' వంటి భారీ బడ్జెట్ సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ జాండ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ప్రపంచవ్యాప్తంగా జూలై 11న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ ఆవిష్కరించారు.

## ఆగస్ట్ 30న దుబాయ్‌లో గామా అవార్డ్స



**ప్ర**తిష్టాత్మమైన గామా (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) అవార్డ్స్‌కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా ఈ అవార్డుల వేడుక జరిగింది. తాజాగా 2025– 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో జరుగనున్నాయి. దుబాయ్‌లో జరిగిన కెన్ ఫ్రా ప్రాపర్టీస్ ప్రారంభోత్సవ సందర్భంగా గామా 5వ ఎడిషన్‌కు సంబంధించిన థీమ్ సాంగ్‌ను లాంచ్ చేశారు. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఈ పాటకు సాహిత్యం అందించారు. రఘు కుంచె సాంగ్ కంపోజ్ చేయడంతో పాటు తానే స్వయంగా పాడారు. ఆగస్టు 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు ఆగస్టు 29న ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకను నిర్వహించేలా భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీ విష్ణు, రోషన్, హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, దక్ష నాగర్కర్ తో పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి టెక్నీషియన్స్ పాల్గొంటారు. హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, కేతిక శర్మ, ఫరియా అబ్దుల్లా, ప్రియా హెగ్డే, శ్రీదేవి స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుంది. ప్రత్యేక అతిథులుగా బ్రహ్మానందం, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీప్రసాద్, తమన్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్, వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. 2024లో విడుదలైన చిత్రాల్లో నామినేటె అయిన విభాగాలకు, పబ్లిక్ ఓటింగ్ ప్రక్రియ ద్వారా సెలెక్ట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గామా అవార్డ్స్ చైర్మన్ త్రిమూర్తులు మాట్లాడుతూ 'దుబాయ్‌లో జరిగే ఏకైక అతి పెద్ద వేడుక గామా అవార్డ్స్. గత నాలుగు ఎడిషన్లు ఘనంగా పూర్తి చేసుకున్నాం. ఆగస్ట్ 30న జరగబోయే 5వ ఎడిషన్‌ను కూడా తెలుగు వారు అందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని అన్నారు. 'గామా అవార్డ్స్' సీఈవో సౌరభ కేసరి మాట్లాడుతూ అతి పెద్ద పార్కింగ్ కలిగిన షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో 10 వేల మంది ఆసీనులు అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని తెలిపారు.

---

# గాంధీభవన్ ముందు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నిరసన

### యాదవులు, కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న యాదవులు, కురుమలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని జాతీయయాదవ హక్కుల పోరాట సమితి నాయకులు కాంగ్రెస్ అదిష్టానాన్ని డిమాండ్ చేశారు. యాదవులు, కురమలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించడంతో పాటు యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేస తక్షణమే చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం గాంధీభవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలంటూ గాంధీభవన్ ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ బయటికి వచ్చి ఆందోళన కారులతో చర్చించి శాంతింపజేశారు. యాదవ సంఘం నాయకులు డిమాండ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని జాతీయయాదవ హక్కుల పోరాట సమితి నాయకులకు హామీ ఇచ్చారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ చిత్తశుద్ధితో కట్టుబడి ఉంది



మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ మొదలు మంత్రివర్గం మొత్తం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మత్స్య అభివృద్ధి సమాఖ్య ఛైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 10 ఏళ్ల పాటు అధికారంలో ఉండి ఏనాడు బిసిలను పట్టించుకోని ఎంఎల్‌సి కవితకు బిసిల గురించి మాట్లాడే హక్కే లేదని తెలిపారు. బిసిల కోసం అనేక ఉద్యమాలు చేసిన విద్యార్థి ఎంపి ఆర్.కృష్ణయ్య అంటే మాకెంతో గౌరవం ఉందని, అలాంటి వ్యక్తి కవితతో కలిసి కూర్చుని ఆమెకు మద్దతు ఇవ్వాలని తన గౌరవాన్ని తక్కువ చేసుకోవద్దని ఓ తమ్ముడిగా కోరుతున్నామని మంత్రి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే బిసి బిల్లును అసెంబ్లీలో ఆమోదింపచేసుకుని గవర్నర్‌కు పంపడంతోపాటు ఈ బిల్లును కేంద్రానికి సైతం పంపించామని తెలిపారు. ఈ బిల్లు ఆమోదం కోసం ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అపాయింట్ మెంట్ తీసుకోవాలని అందరం కలిసి ప్రధాని కలుద్దామన్నారు. బిసి బిల్లుకు రాజకీయ రంగు పులమడం సరికాదని, చేతనైతే బిసిల కోసం అందరూ కలిసి కట్టుగా మద్దతు ప్రకటించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# ప్లాట్ల ధరలు (మొదటి పేజీ తరువాయి)

ప్లాట్లను (ప్లాట్స్) కూడా సుమారు రూ.4.50 కోట్లకు పైగా బహిరంగ వేలంలో దక్కించుకునేందుకు పోటీపడగా, చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలతో కొనుగోలు చేశారు. 11 ప్లాట్లను వేలం వేస్తే ఇందుకు రూ.65.02 కోట్ల ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌజింగ్ కమిషనర్ వి.పి.గౌతం తెలిపారు. హైదరాబాద్ నగరంలోని చింతల్, గచ్చిబౌలి,నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాల ప్లాట్లకు హౌజింగ్ బోర్డు అధికారులు కూకట్ పల్లిలోని కెపిహెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు, గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లకు వేలం వేశారు. ఈ వేలం పాటలో 55 మంది పాల్గొన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఫ్లాట్ల వేలంలో బోర్డుకు రూ.65.02 కోట్ల ఆదాయం వచ్చింది.

### 'గచ్చిబౌలి భూముల' వేలంలో రూ.56 కోట్లు

గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ స్థలానికి గజానికి రూ.2.22 లక్షల చొప్పున సుమారు రూ. 33 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ భూములకు చదరపు గజానికి రూ 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ధారించగా, వేలం పాటలో ఇది రూ 2.22 లక్షలు పలికింది. ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాల భూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి రూ 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఈ భూములకు రూ 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. రెండు ఎంఐజి ప్లాట్లను చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ. 1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే రూ.55,56,84,000 ఆదాయం సమకూరినట్టు హౌజింగ్ బోర్డ్ తెలిపింది.

### చింతల్ భూముల రేట్లు ఆకాశానికే..

కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజి ప్లాట్లకు కూడా అత్యధిక ధరలకు విక్రయించారు. ఈ ప్రాంతంలో మొత్తం పది ప్లాట్లను వేలం వేయగా, ఇందులో ప్లాట్ నెం.113,114,115 ల ద్వారానే సుమారు రూ 8.11 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. నిజాంపేట బాచుపల్లిలోని నాలుగు ప్లాట్లకు సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.

# గాలిలో ఉండగా ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం

**న్యూఢిల్లీ :** ఎయిర్ ఇండియా విమానాలకు సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. తాజాగా మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఢిల్లీ టూ జమ్మూ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు సోమవారంనాడు ఈ పరిస్థితి తలెత్తింది. ఐఎక్స్ 2564 విమానం ఢిల్లీ నుంచి జమ్మూకు బయలుదేరిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిత లోపం గుర్తించారు. దీంతో విమానాన్ని తిరిగి ఢిల్లీకి మళ్లించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సాంకేతిక లోపం కారణంగా ఢిల్లీ విమానం వెనక్కి రావడంతో ప్రత్యామ్నాయంగా జమ్మూకు మరో విమానాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

# ఉసూరుమనిపించి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 22వ తేదీ నాటికే రైతులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 20 లక్షల ఎకరాల వరకు పత్తి, సోయాబిన్ 12 లక్షల వరకు పంటలు వేశారు. అదేవిధంగా పెసరు, కందులు తదితర పంటలకు సంబంధించి దాదాపుగా మరో 2లక్షలు ఎకరాలు, మొక్క జొన్న సుమారు 60వేల ఎకరాలలో ఇప్పటికే పంటలు వేశారు. మరోవైపు రాష్ట్రంలోని ప్రధాన పంట అయిన వరి నారుమళ్లను రైతులు సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వర్షాల పరిస్థితి ఇలాగే కొనసాగితే అందరికంటే ఎక్కువగా పత్తి పంటలు తీవ్రంగా నష్టపోనున్నట్లు రైతులు చెబుతున్నారు.

### మొహం చాటేసిన వర్షం

ముందు మురిపించిన వర్షం ఆ తర్వాత మొహం చాటేయడంతో రైతన్నలు ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల1వ తేదీ నుంచి 22వతేదీ వరకు సాధారణంగా 93.3 మి.మి. వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినట్లుగా విస్తారంగా వర్షం కురువక పోగా, అందులో 50 శాతం 53.4 మిమి వర్షం మాత్రమే నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే 43 శాతం తక్కువ కావడంతో భూమిలో విత్తిన పత్తి విత్తనాలు భూమిలోనే మగ్గి పోతున్నాయి.

### కౌలు రైతులకు తీవ్ర నష్టం

ఒక్క ఎకరానికి కౌలు దాదాపు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉండగా నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో మాత్రం రూ.10 వేలు, నల్ల రేగడి భూములకు ఎకరాకు రూ.30 వేల వరకు ఉంది. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని గత ఏడాది కంటే భూ యాజమానులు, కౌలు ధరలు పెంచినప్పటికీ కౌలు రైతులు వానలను నమ్ముకుని కౌలు చెల్లించి పంటలను వేసుకున్నారు. వానలు రాక ఒక్కసారిగా పరిస్థితి మారడంతో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కౌలు రూ.20 వేలతో పాటు విత్తనాలు, ఎరువులు, దుక్కులు ఇతరత్రా కలుపుకుని పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ. 30 వేలను కలుపుకుంటే దాదాపు రూ. 50వేలకు చేరుతుంది. సకాలంలో వర్షాలు కురవకపోతే రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది.





# నరమేధం వెంటనే ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

పాటు అమాయక ఆదివాసీల నెత్తురు ఏరులై పారుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్‌లతో ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. మావోయిస్టు రహిత భారత్ కోసమంటూ చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మానవ హక్కులనలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని మండిపడ్డారు. చర్చలకు వస్తామని చెప్పినా, చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకురాకుండా మారణ హోమం కొనాసాగిస్తోందన్నారు. అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్‌లకు అటవీ సంపదను దోచి పెట్టేందుకే కేంద్ర సర్కార్ నరమేధం కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గడ్‌లో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి, డోలమైట్, బాక్సైట్స్ నిక్షేపాలకు ప్రసిద్ధి గాచిందన్నారు. దేశంలో టిన్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం ఇదేనన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదపై దేశ బడా కార్పొరేట్ల కన్నుపడిందని, ఈ ఏడాది జనవరిలో ఏడువేల ఎకరాల్లో 4, 13వ ఖనిజ బ్లాకుల వేలానికి సిద్ధమయ్యాయన్నారు. ఈ ఖనిజ తవ్వకాలతో ఎక్కువ నష్టం జరిగేది అక్కడ నివసించే ఆదివాసులకే అన్నారు. అడవివి, వారిని విడదీసి చూడలేమన్నారు. ఈ తెగలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. దేశ సంపద ప్రజలందరికీ చెందాలే తప్ప బడా పెట్టుబడిదారీ కార్పొరేట్‌లకు కాదన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాస్తున్న నరేంద్ర మోదీ విధానాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి నాయకులు బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, మర్రి శ్రీమాన్, చేపూరి కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, చిలుక రాజ్, శ్రీను, సల్మాన్ బేగ్, శివ కుమార్, మహమూద్, మాజీద్, కొండూరి వెంకటేశ్, అశోక్, బిచ్చల శ్రీనివాస్, హేమంత్, నయీమ్, అశోక్, వెంకటేశ్, సురేష్, మధు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### అరెస్టు అయిన ఎఐవైఎఫ్ నేతలను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ

ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ఎఐవైఎఫ్ చేపట్టిన రాజ్ భవన్ ముట్టడిలో అరెస్టు అయిన నాయకులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈ.టి. నరసింహ పరామర్శించారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఎఐవైఎఫ్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు, గిరిజనులపై చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లన్ని ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. అరెస్టు చేసిన ఎఐవైఎఫ్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని ఈటి పోలీసులను డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com